www.vijayakranthinews.com

శుక్రవారం
08 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 320

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక


హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA & A.P STATES | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



ఎమర్జింగ్ స్టార్ 2018 10


మావోయిస్టులకు
ఎదురుదెబ్బ

- బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మృతి
- కొనసాగుతున్న కూంబింగ్ 4




కీలక వడ్డీ రేట్లు తగ్గించిన
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలో తొలి సమీక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు 12
- రివర్స్ రెపో రేటు 6% తగ్గింపు



మౌలిక వసతుల
అభివృద్ధిలో గడ్కరీ భేష్

- లోక్‌సభలో సోనియా ప్రశంసలు 8



పాస్‌వర్డ్ చెప్తే
రూ.1000 కోట్లు..

- మృతిచెందిన క్రిప్టో కరెన్సీ సంస్థ సీఈవో
- హ్యాక్ చేయలేక ఐటీ నిపుణుల తర్జనభర్జన 9



కూటమి కాదు కల్తీ



- మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే
- దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా కాంగ్రెస్ వ్యవహారం
- 55 ఏళ్లలో చేయని అభివృద్ధిని 55 నెలల్లో చేసి చూపాం
- ప్రజలకు నీతి వంతమైన పాలన అందిస్తున్నాం
- దేశాన్ని మహోన్నతంగా, సర్వశక్తిగా తీర్చి దిద్దడమే లక్ష్యం
- రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ సుదీర్ఘ ప్రసంగం

విజయక్రాంతి, న్యూఢిల్లీ: విపక్షాలు ఏర్పాటు చేసేది మహాకూటమి కాదని మహా కల్తీ అని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. మహాకూటమితో దేశ ప్రజలకు ఒరిగేదేమీలేదని, కూటమి నేతలు కనీసం ఒకరినొకరు చూసుకునే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. కోల్‌కతా వేదికగా కలిసిన మహకూటమి సర్కార్‌ను దేశ ప్రజలు కోరుకోవడం లేదన్నారు. అలాంటి ప్రభుత్వం వస్తే ఏమవుతుందో ప్రజలకు తెలుసని ప్రధాని ఎద్దేవా చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని మోదీ ధీమా వ్యక్తంచేశారు. గురువారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ టర్మ్‌లో లోక్‌సభలో చివరి ప్రసంగం కావడంతో ఎప్పుడూ లేనంతగా ఛలోక్తులు, జోకులతో మోదీ ప్రసంగించారు. 60 ఏళ్ళ కాంగ్రెస్ పాలనను తమ ఐదేళ్ళపాలనతో పోల్చి ఆ పార్టీని కడిగిపారేశారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని తాము 55 నెలల్లో చేసి చూపామన్నారు. ఆ పార్టీ హయాంలో ఎన్నడూ అభివృద్ధి జరగలేదన్నారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మోదీ ఆరోపించారు. ' 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనతో మా ఐదేళ్ల పాలనను పోల్చి చూడండి. వారు 55 ఏళ్లలో అధికారం కోసం పాకులాడితే.. మేం 55 నెలలూ దేశం కోసం పనిచేశాం..' అని మోదీ స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారుగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయంగా భారతదేశ కీర్తిప్రతిష్ఠలను మంటగలుపుతోందన్నారు. దేశంలోనైనా, బయట అయినా, పార్లమెంటులోనైనా, బయట అయినా తాము నిజాలే మాట్లాడతామన్నారు. కానీ సత్యాన్ని వినే సామర్థ్యం ప్రతిపక్షాలకు క్షీణించిందన్నారు. కాంగ్రెస్ నేతలు రెండు కాలాలను చూస్తున్నారని, వాటిలో ఒకటి బీసీ అని, అంటే బిఫోర్ కాంగ్రెస్ అని, అప్పట్లో ఏమీ జరగలేదని, మరొకటి ఏడీ అని అంటే ఆఫ్టర్ డైనాస్టీ అని, కాంగ్రెస్ ప్రభుత్వాలు లేనపుడు అన్నీ (తరువాయి 4లో)

మోడీ
ఓ పిరికిపంద

- కీలక అంశాలపై ఎదురుపడలేక పారిపోతారు
- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం
- త్రిపుల్ తలాక్ బిల్లును ఉపసంహరిస్తాం
- రాహుల్ గాంధీ



విజయక్రాంతి, ఢిల్లీ : దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన త్రిపుల్ తలాక్ బిల్లుపై ఏఐసీసీ చీఫ్ రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ బిల్లును ఉపసంహరిస్తామని రాహుల్ కుండబద్దలు కొట్టారు. దేశంలో (తరువాయి 4లో)

ప్రియాంక
తొలి ప్రచార సభలు

- సోమవారం నుంచి యూపీలో మొదలు
- చెల్లికి తోడుగా రాహుల్ పర్యటన



ఢిల్లీ: ప్రియాంక గాంధీ ఎలక్షన్ ప్రచార కార్యక్రమం ఖరారైంది. తూర్పు ఉత్తరప్రదేశ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రియాంక గాంధీ చేపట్టనున్నతొలి పర్యటనకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ తోడుగా వెళ్లనున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 14 వరకూ ఉత్తరప్రదేశ్లో ఆమె పర్యటన ఉండనుందని పార్టీ వర్గాల సమాచారం. లక్నోలో తొలుత రోడ్షో నిర్వహించి, అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆమె భేటీ అవుతారని తెలిసింది. రాబోయే లోక్సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అత్యధిక స్థానాలున్న ఉత్తర ప్రదేశ్లో పార్టీ ఆమెకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. (తరువాయి 4లో)

రెచ్చిపోతున్న కబ్జాదారులు

- ఇంటి స్థలాలను కాజేయడంలో సరికొత్త పంథాలు
- రోడ్లు, లేఅవుట్లు, పార్కులు మార్చి కాలనీల్లో అలజడులు
- మన్సూరాబాద్, వివేకానందనగర్ కాలనీలో దందాలు



విజయక్రాంతి, హైదరాబాద్: దొంగలు దొంగలు ఊర్లు పంచుకుంటున్న చందంగా నగరంలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. పలుకు బడి, అంగబలం, అర్థబలంతో సామాన్యుల ఇంటి స్థలాలపై గద్దల్లా వాలుతున్నారు. సామాన్యులు కడుపు కట్టి, కాలు గట్టి దాచుకున్న డబ్బుతో కొనుక్కొని, ఇల్లు కట్టుకొనే స్థోమత లేక ఖాళీగా ఉంచటంతో వాటిపై ఓ ప్లాన్ ప్రకారం వలవేస్తున్నారు. తమకున్న పలుకుబడితో వివాదాలు సృష్టించి సామాన్యులు స్థలాలను ఆక్రమించుకొంటున్న వైట్ కాలర్ నేరగాళ్ల వైనమిది. సామాన్యులకు అండగా నిలిచి ఆదుకోవలసిన అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటై అక్రమార్కులకు సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చట్టపరంగా అన్నీ ఉన్నా అధికారులు అమలు చేయకుండా సామాన్యులను మరింత కుంగదీస్తుండటంతో వారి ఆవేదన అరణ్య రోదనే అవుతుంది. బాధితులు న్యాయం కోసం గ్రేటర్ హైదరాబద్ మున్సిపల్ కార్యాలయాలు, రెవిన్యూ కార్యాలయాలు చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. వారి ఫిర్యాదులు ఒక చోటు నుంచి మరోచోటికి తిరుగుతున్నాయే తప్ప పరిష్కారం దొరకటంలేదు. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మన్సూరాబాద్ వివేకానంద నగర్ కాలనీ వాసుల సంఘం ఫిర్యాదుతో అక్కడ జరుగుతున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

కుట్రలు, ఎత్తుగడలతో కాలనీల్లో అలజడి

కబ్జాకోరులు కాలనీలోని కొందరిని తమకు అనుకూలంగా మలుచుకుంటారు. అది వీలు కాకపోతే తమ వ్యక్తులచేత కాలనీలో ప్లాటు కొనిపిస్తారు. క్రమంగా కాలనీ వ్యవహారాల్లో తలదూర్చుతూ పోటీ సంఘాలను సైతం ఏర్పాటు చేయిస్తారు. లేఅవుట్లను మార్చేస్తారు. రోడ్లను ఆక్రమించి, కాళీ ఇంటిస్థలాల నుంచి రోడ్డు నిర్మించాలని వివాదాలు లేవదీస్తారు. దాంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన రోడ్లను వేయకుండా అడ్డుకుంటారు. ఇలాంటి రకరకాల ఎత్తుగడలతో కాలనీ వాతావరణాన్ని దెబ్బతీసి విసుగు చెంది అక్కడివారు అమ్ముకొని పోయేలా చేస్తారు. ఈ వివాదాలతో బయటివారు రాకుండా చేసి, వారికే తక్కువ ధరకు అమ్ముకొని పాయేలా చేయటం కబ్జాదారులు తాజా అవలంబిస్తున్న కొత్త ఎత్తుగడగా తెలుస్తోంది. ఇదే విదంగా నగరంలోని మన్సూరాబాద్ లో జరుగుతున్న తతంగం వెలుగులోకి వచ్చింది. బాధితులు (తరువాయి 4లో)

జూన్ నాటికి ఎస్సారెస్పీ
ఆయకట్టుకు సాగునీరు

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోని 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి
- భూసేకరణకు వెంటనే నిధులు విడుదల చెయ్యాలి
- ఎస్సారెస్పీపై ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్ ఆదేశం

విజయక్రాంతి, హైదరాబాద్: ఈ ఏడాది వర్షాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి అనువుగా జూన్ నాటికే కాల్వలు, తూముల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజి నుంచి ఈ వర్షాకాలంలో నీటిని ఎత్తిపోయడం ప్రారంభమవుతుందని ఆ నీటిని మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తామ ని ముఖ్యమంత్రి. ఈ రెండు డ్యాముల్లో కలిపి 50 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉంటుందని, ఆ నీటితో ఎస్.ఆర్.ఎస్.పి. కాల్వల ద్వారా అన్ని చెరువులను నింపాలని ఆదేశించారు. ప్రాజెక్టుల ద్వారా నీళ్లొస్తున్నాయి, పనులు చేయడానికి నిధులిస్తున్నాం, అయినా పంట పొలాలకు నీరందించకుంటే పాపం చేసిన వారమవుతామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎస్.ఆర్.ఎస్.పి. ఆయకట్టు పరిధిలోని (తరువాయి 4లో)



గవర్నర్‌తో గజనాన్ భేటీ

- జీఎంగా బాధ్యతల చేపట్టిన తర్వాత తొలిసారి భేటీ
- రైల్వే అభివృద్ధి పనులపై చర్చ



విజయక్రాంతి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన గజనాన్ మాల్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్‌తో సమావేశమయ్యారు. జీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రయాణికుల సదుపాయాలు, వివిధ ప్రాజెక్టుల పురోగతి దశలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

14 నుంచి జేఎల్,
డీఎల్ పరీక్షలు

విజయక్రాంతి, హైదరాబాద్ : డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్ల పరీక్షలు ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీఆర్ఇఐఆర్‌బీ వెబ్‌సైట్ నుంచి ఈ నెల 8వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షకు 24 గంటల ముందు ఈ హాల్‌టికెట్‌లను వెబ్‌సైట్ నుంచి తొలగించనున్నందున అభ్యర్థులు ముందుగానే తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సాంకేతిక ఇబ్బంది తలెత్తితే 040–23317140లో సంప్రదించవచ్చు. లేదా convenor.treirb@gmail.comకు ఇమెయిల్ చేయవచ్చు. మరిన్ని వివరాలకు www.trierb.telangana.gov.in వైబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఆరోపణలు ఖండించిన వాద్రా

- లండన్‌లో ఎలాంటి ఇల్లూ లేదు
- రెండో రోజూ రాబర్ట్‌ను ప్రశ్నించిన ఈడీ



ఢిల్లీ : కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మనీ లాండరింగ్ కేసులో రెండో రోజు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట హాజరయ్యారు. గురువారం ఉదయం ఈడీ కార్యాలయానికి చేరుకున్న వాద్రాను అధికారులు నాలుగు గంటలపాటు ప్రశ్నించారు. బుధవారం ఈడీ అధికారులు ఆయనను 5.30గంటల పాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే.

లండన్లోని 12, బ్రైన్స్టన్ స్క్వేర్లో 1.9 మిలియన్ పౌండ్ల (రూ.17.62 కోట్లు)తో భవనం కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారంటూ వాద్రాపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. అయితే ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా దిల్లీ హైకోర్టు అందుకు అంగీకరించింది. ఫిబ్రవరి 16వరకు వాద్రాను (తరువాయి 4లో)




శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం	
ఉత్తరాయణం	
శిశిర ఋతువు	
మాఘ మాసం	
సూర్యోదయం	ఉ. 06:46
సూర్యాస్తమయం	సా. 06:14
పక్షము	శుక్లపక్షం
తిథి	తదియ 10:17 తదుపరి చవితి
నక్షత్రం	పూర్వాభాద్ర 14:059
యోగం	శివ 11:33
కరణం	గరజ 10:17 వనిజ 23:24
రాహుకాలం	ప. 11:05, మ. 12:30
యమగండం	మ. 03:20 04:45
వర్జ్యం	తె. 01:35, 03:22
అమృతకాలం	లేదు



సూక్తి సుధ



ఆలోచనలు ఉన్నప్పుడే, అది పరధ్యానం.. ఆలోచనలు లేనప్పుడు, అది ధ్యానం

-రమణమహర్షి




మాఘమాసం మాహా పుణ్యమాసం

ఈ భూమండలంలో ఉన్న దేశాలన్నిటిలోను భారతదేశం, కర్మ ధర్మ ధ్యాన పరాయణమై, సర్వోత్తమమైన విశిష్ట స్థానాన్ని కలిగివుంది. అట్టి భారతదేశంలో హిమాలయాది పర్వతాలు, గంగాది నదులూ, నైమిశం మొదలైన అరణ్యాలూ మరింత పవిత్రమైనవిగా చేసిన పూజ, మొదలైనవానికి అనేకరెట్లు ఫలితాన్నిచ్చేవిగా ప్రసిద్ధి చెందాయి. వైశాఖం, ఆషాడం, కార్తీకం, మాఘం, మొదలైన పవిత్రమైన పుణ్యదాయకమైన కాలంలో చేసే స్నానం, జపం, తపం, మొదలైన వాని వల్ల, వచ్చే పుణ్యం, బగణ్యమైనది. అంటే ఇంత అని లెక్కకురానిది. అలాగే మఘమాసం సూర్యభగవానునికి ఎంతో ప్రీతికరమైనదిగాను, పుణ్యకార్యాలకు, నదీస్నానాలకు ఎంతో పుణ్యదాయకంగాను, ఈ నెలలో మరణించిన వారికి అమృతత్వం సిద్ధిస్తుందని మాఘ పురాణంలో చెప్పబడింది. కొంతమంది ఈ నెల్లాళ్ళు ముల్లంగి దుంపను తినరు. ఈ మాసంలో నువ్వులను, బెల్లంను కలిపి తినాలట. నువ్వులను దానమివ్వాలట. రాగి పాత్రలో గోధుమ రంగుగా ఉన్న నువ్వులను పాత్రతో సహా దానమిస్తే మంచిది.

శ్రీ పంచమి

'మాఘశుద్ద పంచమి'ని శ్రీ పంచమి అంటారు. ఈ పంచమి నాడే 'సరస్వతీదేవి' జన్మించిందట. ఈనాడు 'రతీ మన్మధులను మల్లెపూలతో పూజిస్తారు. ఉత్తర భారతంలో విష్ణుమూర్తిని, సరస్వతీదేవిని కూడా పూజిస్తారు. బ్రహ్మదేవుడు సృష్టి చేయగా చరాచర ప్రపంచం శ్మశాన నిశ్శబ్ధతతో ఉందట. అవేదనతో తన కమండలంలోని నీటిని ప్రపంచంపై చిలకరించగా చెట్లపై ఆ నీటి బిందువులు పడి ఒక శక్తి ఉద్భవించిందట. రెండు చేతులతో వీణను వాయిస్తూ మరో రెండు చేతులతో పుస్తకాన్ని , మాలను ధరించి దర్శనమిచిందట. ఆ వాగేశ్వరి వీణావాదనం ద్వారా ప్రపంచంలోని స్తబ్ధతను ఉదాసీనతను తొలగించి విద్యాబుద్దులకు అదిష్ఠాత్రి అయింది ఆ దేవి. అప్పటి నుండి శ్రీ పంచమి రోజును సరస్వతిని పూజించడం జరుగుతుంది.



మాఘశుద్ద సప్తమి

ఇదే 'సూర్య సప్తమి' అని కూడా పిలువబడుతుంది. రథసప్తమి సుర్య గ్రహణదినం వలె ఇది పరమపవిత్రమైనది. ఈ రోజున అరుణోదయకాలంలో ఏడు జిల్లేడు ఆకులను అందులో రేగికాయలను ఉంచుకొని తలపై పెట్టుకొని స్నానం చేస్తే ఏడు విధాలైన శాపాలు నశిస్తాయట. స్నానానికి ముందు చెరకుగడతో నీటిని కదిలిస్తారు. నమస్కారం 'ప్రియ:సూర్య:' అన్న ఆర్య వాక్య ప్రకారం కేవలం నమస్కారం చేతనే సూర్యుడు సంతృప్తి చెందుతాడని తెలుస్తుంది. ఈ రోజున చిక్కుడుకాయలతో రథం చేసి కొత్త బియ్యంతో పాయసాన్ని వండి చిక్కుడు ఆకులలో పెట్టి సూర్యునికి నివేదన చేయడం ఆచారం.

సూర్యుడు తనను పూజించిన సత్రాజిత్తుకి ఈ రోజునే 'శమంతకమణి' ప్రసాదించాడు. హనుమంతునికి వ్యాకరణ శాస్త్రాన్ని యజవాల్క్యునికి యజుర్వేదాన్ని బోధించాడు. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అన్న వాక్యం ప్రకారం ఆరోగ్యం కొరకు ఆదిత్య హృదయం పారాయణ చెయ్యాలి. రథసప్తమి నాటి స్నానం సప్త సప్త మహాసప్త ద్వీపా వసుంధరా! కోటి జన్మార్జితంపాపిం వినశ్యతితతణాత్ అన్నట్లుగా పాప విముక్తి కలిగిస్తుందట.



తిల చతుర్థి అనగా

ఈ మాసంలో వచ్చే ముఖ్యమైన తిథి 'శుక్ల పక్ష చవితి' దీనిని 'తిల చతుర్థి'అంటారు. దీన్నే 'కుంద చతుర్థి' అని కూడా అంటారు. నువ్వులను తింటారు. నువ్వులతో లడ్లు చేసి పంచి పెడతారు. ఈ రోజున 'దుండిరాజును' ఉద్దేశించి, 'నక్త వ్రతం' పూజ చేస్తారు! డుండిని ఈ విధంగా పూజించడం వల్ల దేవతలు సైతం పూజలందుకుంటారని కాశీ ఖండంలో తెలియజేశారు.'కుంద చతుర్థి' నాడు కుంద పుష్పాలతో పరమేశ్వరునికి అర్పించి రాత్రి జాగారణ చేసినవారు, సకలైశ్వర్యాలను పొందుతారని కాలదర్శనంలో చెప్పబడింది. అయితే సాయంకాలం చతుర్థి ఉంటే ఉత్తమం అని ఈ సందర్భంలో తెలుసుకోవాలి.



స్నాన విశిష్ఠిత

మాఘమాసంలో ప్రాత:కాలంలో చేసే స్నాన, జప, తపాలు చాలా ఉత్తమమైనవి. ఈ మాసంలో స్నానం చేసేటప్పుడు 'దు:ఖ దారిద్ర్య నాశాయ, శ్రీ విష్ణోతోషణాయచ! ప్రాత:స్నానం కరోమ్య, మాఘ పాప వినాశనం!' అని చేసిన తరువాత 'సవిత్రేప్రసవిత్రేచ! పరంధామజలేమమ! త్వత్తేజసా పరిభ్రష్టం, పాపం యాతు సస్రదా'! అని చదవాలి. సూర్య భగవానునికి అర్ఘ్యమివ్వాలి.

ఈ మాసాన్ని కుంభమాసం అని కూడా అంటారు. కొంతమంది ఈ నెల్లాళ్ళు ముల్లంగి దుంపను తినరు. ఈ మాసంలో నవ్వులను, బెల్లంను కలిపి తినాలట. నువ్వులను దానమివ్వాలట. రాగి పాత్రలో గోధుమ రంగుగా ఉన్న నువ్వులను పాత్రతో సహా దానమిస్తే మంచిది. ఈ నెలలో మరణించిన వారికి అమృతత్వం సిద్దిస్తుందట.

భీష్మాష్టమి

భీష్మాష్టమి 'మాఘమానస్యచాష్టమ్యాం శుక్ల పక్షేచ పార్థివ! ప్రాజాపత్యేచ నక్షత్రే మధ్య:ప్రాప్తే దివాకరే! 'శోభకృత నామ సంవత్సరంలో మాఘమాసంలో శుక్లపక్షంలో రోహిణి నక్షత్రం ఉన్న అష్టమి తిథినాడు మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తూ ఉండగా అభిజిత్ లగ్నంలో భీష్మ పితామహుడు ధ్యాన స్థితుడై ప్రాణాలను విడిచిపెట్టాడట. స్వచ్ఛంద మరణం ఆయనకి వరం. ఆయనకు తర్పణలు విడిచి పెట్టడం నెలగంటు పెట్టినప్పటినుంచీ పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి దాచి ఆ పిడకలతో పాయసాన్ని వండి నివేదన చేయడం ముఖ్యం. అష్టమినాడే దైవ సాయుజ్యం పొందినా శ్రీ కృష్ణుని సమక్షంలోనే విష్ణుసహస్రనామాలతో ఆయనను కీర్తిస్తూ మోక్షం పొందాడు. కాబట్టి ఏకాదశిని ఆయన పేరుతో ఏర్పాటు చేశారు. భీష్మ ఏకాదశి నాడు విశేష పూజలు చేయడం ఆనవాయితీ. ఇక మాఘమాసంలో వచ్చే ప్రతి ఆదివారాలు మహిమాన్వితాలే. ఈ విధంగా మాఘ మాసమంతా 'శివరాత్రి' వరకూ అన్నీ పర్వదినాలే.

డా|| బాలుశర్మ పన్నాల
వేదపండితులు




యద్భావం తద్భవతి

శ్లో|| కాష్ఠపాషాణ ధాతూనాం కృత్యా భావేన సేవనమ్।
శ్రద్ధయా చ తయా సిద్ధస్తస్య విష్ణుః ప్రసీదతి||

కొయ్యి, రాయి, లోహాలతో బొమ్మలు చేసి భగవంతుడను భావంతో శ్రద్ధగా సేవించినచో ఆతని భావం సిద్ధించి విష్ణువు అతనియందు అనుగ్రహం కలవాడు అవుతాడు. భావనాశబ్ధమునకు ప్రజలు సరియగు అర్థమును గ్రహించుట లేదు. భావనా శబ్దమునకు సరైన అర్థాన్ని గ్రహించాలని ఈ దిగువ ఇచ్చిన సందర్భాన్ని చూస్తే తెలుస్తుంది. మీరు మట్టియందు బంగారం, వెండి అనే భావాన్ని, రాతియందు మణి అనే భావాన్ని, సముద్రపు నురుగునందు ముత్యమనే భావాన్ని, నీటియందు నెయ్యి, పాలు, పెరుగు అనే భావన, అలాగే దుమ్మునందు మైదా, పంచదార మొదలైన వానిగా భావించి ఏ విధంగా ఉపయోగిస్తారు. మీ రెన్నడునూ దుఃఖం అని భావింపరు గదా? అది మీకు ఎందుకు కలుగుతుంది? మీరెప్పుడూ సుఖాన్ని భావింతురు గదా! అది ఎలా చేకూరుతుంది? గుడ్డివాడు కన్నులన్నాయని భావించిన ఎలా చూడలేడు? చావాలని ఎవరూ భావించరు కదా! మరి ఎందుకు చస్తున్నారు. కాబట్టి మీ భావన సరైంది కాదు. వేనియందు ఎట్లు చేయాలో ఆ విధంగానే చేయాలన్న భావన ఉండాలి. అగ్నిని అగ్నిగాను, జలాన్ని జలంగాను తెలుసుకోవడం భావన అంటారు. ఆ విధంగా కాకుండా అగ్నిని జలంగాను తలంచడం అభావన అవుతుంది. (సత్యార్థ–ఏకాదశనం) కొయ్యను, రాళ్లను పూజించేవారిపై పరమాత్మ ప్రసన్నత చూపించడు. స్వామి దయానంద మహర్షి పూజలో పద్నాలుగు దోషాలు ఎంచారు. అందులోని ఏడవ దోషం ఎప్పుడైనను ఎవరైనా మరొకనితో నీవు కూర్చుండు ఆసనం మీద కాని, మీ పేరున్న చోటుగాని రాయి వేయుదునని అనేటట్లయితే ఆతడు కోపంచి వానిని కొట్టుటయో తిట్టుటయో చేస్తుంది. అలాగే పరమేశ్వరుని ఉపాసించటానికి తగిన హృదయమందును, ఆయన పేరు మీద రాతి మూర్తులు ధరిస్తున్నారు. ఆ విధమైన దుష్టబుద్ధికలవారి విషయంలో పరమేశ్వరుడు సత్యం నశించకుండా ఎందుకు చేయడు?

- యామిజాల సుబ్రహ్మణ్యం

చాణక్యం



ధర్మ సందేహాలకు సమాధానాలు

పూజా సమయంలో చేసే దైవోపచారాలను గూర్చి తెలపండి?

భగవంతుని పట్ల మనకు కల ప్రేమనే భక్తి. అయితే ఆయా దేవతల పట్ల మనం చూపే శ్రద్ధ మన భక్తికి నిదర్శనం. భగవంతుని స్మరణకు ముందు మన ఇష్టదైవాన్ని స్మరించడం సంప్రదాయం. అతిథికి ఎలా మర్యాద చేస్తామో దేవునికి కూడా అలాగే సేవ చెయ్యాలి.

షోడశ ఉపచారాలు:

1. **ఆవాహనం:** ఆహ్వానించడమే – 'ఆవాహనం' అనే ఉపచారం.
2. **ఆసనం:** దేవునికి 'ఆసనం' ఇవ్వడమే – 'ఆసనం' అనే ఉపచారం.
3. **పాద్యం:** పాదాలకు నీళ్లివ్వడమే – 'పాద్యం' అనే ఉపచారం.
4. **అర్ఘ్యం:** చేతులకు నీళ్లివ్వడమే – 'అర్ఘ్యం' అనే ఉపచారం.
5. **ఆచమనీయం:** త్రాగడానికి నీళ్లివ్వడమే – 'ఆచమనీయం' అనే ఉపచారం
6. **స్నానం:** దేవునికి స్నానం చేయడానికి నీళ్లిచ్చే ఉపచారం – 'స్నానం'
7. **వస్త్రం:** స్నానోపచారం తర్వాత 'వస్త్రం' సమర్పించడం
8. **యజ్ఞోపవీతం:** ఆ తర్వాత 'యజ్ఞోపవీతం' సమర్పణ.
9. **గంధం:** గంధాన్ని ఇచ్చి ధరింపచేయడం.
10. **పుష్పం:** పుష్ప సమర్పణం
11. **ధూపం:** సుగంధం కొరకు ధూపం వేయడం (అగరువత్తులు వెలిగించడం సాంబ్రాణి మొ||వాటితో పొగవేయడం)
12. **దీపం:** దీపం వెలిగించడం. కొందరు ఇక్కడ 'మంగళహారతి' అని కూడా చెబుతారు.
13. **నైవేద్యం:** ఏదైనా నివేదించడం 'నైవేద్యం'
14. **తాంబూలం:** అన్ని విలాసాల్లో 'తాంబూలం' గొప్పది కాబట్టి తాంబూల సమర్పణం.
15. **నమస్కారం:** దేవుని దివ్యతత్త్వాన్ని స్మరించి నమస్కరించడం.
16. **ఉద్వాసనం:** పూజానంతరం సాగనంపే కార్యక్రమం.



ఇదంతా భక్తి భావంతో చేసే ప్రక్రియ కాని యాంత్రికంగా చేసేది కాదు. దేవుని పట్ల మనకు గల భక్తిని ఈ కార్యక్రమం తెలియచేస్తుంది. బాహ్య పూజ కన్నా నిర్గుణ పూజ విశేష ఫలితమిస్తుందని శాస్త్రాలు, పెద్దలు చెప్పిన అభిప్రాయం; కాని గురి కుదిరే దాకా ఈ గుర్తులు తప్పవు.

– డా|| పి. భాస్కరయోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. భాగవత పురాణంలో ఉన్న శ్లోకాలు ఎన్ని?
2. భాగవతాన్ని ఎవరు, ఎవరెవరికి చెప్పారు?
3. భాగవతం చెబుతున్నది ఏమిటి?
4. త్రిశంకుడు ఎవరి కుమారుడు?
5. భగదత్తునికి శూలాయుధంను ప్రసాధించినది?
6. విదేహ రాజధాని ఎవరు?
7. యదు వంశాన్ని శపించినవారు?
8. ఘటోత్కచుని కుమారుడు?
9. వార్ధక్యదశలో శంతనుడు ఎవరి సౌందర్యానికి మోహితుడవుతాడు?
10. కర్ణుని వధ తరువాత దుర్యోధనుని పాండవులతో సంధి చేసుకోమని ఎవరు సలహా చెప్పారు?

సమాధానాలు

1. 18,000

రాజత్కృపాదాయిని



రాజత్కృపకి పాత్రులు కావాలంటే చాలా విషయాలను గుర్తుంచుకోవాలి. రాజ పరిపాలనలో ఉన్న అసమానతలను, లోపాలను రాజు దృష్టికి తేవాలి. ఆ లోపాలను, అసమానతలను, సవరించే ప్రణాళికలను చేపట్టి ఎంత త్వరగా త్రికరణ శుద్ధిగా అమలు చేస్తూ వస్తేగాని రాజత్కృపకు పాత్రులు కాలేరు. ప్రజాశేయస్సులో భాగంగా అభివృద్ధి పథంవైపు అడుగులు వేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలి. ప్రజలను రంజింప చేయడానికి సమాజంలోని అవిద్య, ఆర్థిక అసమానతలను తొలగించాలి. దుర్మార్గాలను రూపుమాపాలి. ప్రజలకు విద్యా, విజ్ఞాన విషయాలను నేర్పించి, సంపూర్ణ మానవత్వం గల పౌరులుగా ప్రజలను అధికారులు చైతన్యపరచాలి. అలాంటి అధికారులు రాజు దగ్గర ఉండవలసిందే! ప్రజాహితుల గూఢాచార వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. ప్రతిప్రక్ష నాయకులు కూడా అభినందించేలా రాజు వ్యవహార దక్షత ఉండి రాజుకు ప్రజల మీద, ప్రజలకు రాజుమీద ఉండే అవగాహనను క్రీయా రూపంలోకి మార్చేదే రాజత్కృపా శక్తి. ఈ రాజత్కృప ఉంటేనే జన జీవనం నిశ్చింతగా బతకగలుగుతుంది. తమలాగే బతుకుతూ ప్రజాసేవ చేస్తూ, ఇంకా కొంతమందిని విశ్వాసంలోకి తీసుకొనే రాజభక్తులుగా చేసే దీక్షను రాజ్యలక్ష్మీదేవి ప్రసాదిస్తుంది. ఇవన్నీ మానవ మాత్రులకు సంబంధించినవి మాత్రమే. అచంచల భక్తి విశ్వాసాలతో కూడిన రాజ్యాధికారులు ఎందరున్నా, రాజకీయ దురంధరులు ఎంత నిజాయితీగా పరిపాలించినా ఆ రాజరాజేశ్వరీ కృప ఉన్నంతవరకే! ఆమె కృప లేకపోతే పరిపాలనాశక్తి లేనివారు అవుతారు. సృష్టిలోని ఆ జగజ్జనని కృప పొందడం ఎలా అని ముందుగా మనం ప్రశ్నించుకోవాలి. అంతకంటే ముందు అమ్మదయను మనం అర్థం చేసుకుంటున్నామా? అని కూడా ఆలోచించాలి. జన్మ అంటే క్రిమి కీటాకాదులు జంతు జాలాలుగా కాక, మనకు ఉత్తమమైన మానవ జన్మను ఇచ్చింది. అందుకు అమ్మకు ముందుగా కృతజ్ఞత తెలుపుకోవాలి. ఇది అమ్మవారి కృపేకాదా, అందులోనూ విత్తనంలాంటి వంశవృక్షానికి కుటుంబాన్ని వృద్ధి చేయగల శక్తిగా ఆడజన్మను ప్రసాదించింది. మాతృ రూపంలో ఉండి, మాతృ స్థానాన్ని ప్రతిష్ఠించింది. అమ్మంటే ఇదే! అమ్మతనమంటే మాతృ స్వరూ

త్రిగుణాత్మక స్వరూపిణి

పంలోని కృపను అవగాహన చేసుకోవడమే అమ్మ దయ.

ఆకలి దప్పులు, ఆరోగ్య అవగాహనా సామర్థ్యం, విజ్ఞానం, ఇలా సర్వం స్త్రీయే జగన్మాత అన్నీ కృపారసాన్ని, శక్తిని వృక్షమంతా వ్యాప్తి చెందిన విత్తనంలా, ఒదిగి ఉండమని నిర్దేశించింది. ఇది కృపా రహస్యం కాదా! ఈ జగన్మాత దయ వల్లనే మనం జీవించి ఉన్నాము. పంచభూతాత్మకమైన పృధ్వీతత్వాన్ని శరీరానికిచ్చింది. మనం అనుక్షణం నిస్సహాయులమని, బలహీనులనుమని, అర్థమయ్యేలా సూర్యచంద్రాది అగ్ని రూపాలను, వాయుప్రకంపనలనడే ఉఛ్వాసనిశ్వాసాలను ఇచ్చింది.



-సి. విజయలక్ష్మీ రాజు

హుంకార్ ర్యాలీని జయప్రదం చేయండి

విజయక్రాంతి, వరంగల్: ఫిబ్రవరి 18న ఢిల్లీలో జరిగే హుంకార్ ర్యాలీని విజయవంతం చేయాలని అఖిల భారత విద్యాహక్కు వేదిక, డీఎస్‌వో తెలంగాణ కమిటీ పిలుపునిచ్చింది.దీనికి సంబంధించిన పోస్టర్‌ను డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ ఆర్ట్స్ కాలేజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తుందని అఖిల భారత విద్యాహక్కు వేదిక సభ్యులు ఈ సందర్భంగా విమర్శించారు. జాతీయ విద్యావిధానం 2016 మూసాయిదాను అమలు చేస్తూ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నిధులను కేటాయించకుండా కళాశాలలను మూసివేతకు గురిచేస్తూ, యూనివర్సిటీలను అగ్రహారాలుగా మలుస్తుందని డీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సభ్యులు వేణు మండిపడ్డారు.

డీసీసీ అధ్యక్ష పదవులను ప్రకటించిన ఏఐసీసీ

ముగ్గురు మహిళలకు అధ్యక్ష పదవులు.. బీసీలకు పెద్ద పీట



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్‌గాంధీ గురువారం ప్రకటించారు. ఐదుగురు పాత డీసీసీ అధ్యక్షులను కొనసాగిస్తూ ఇద్దరు ఎమ్మెల్యేల భార్యలకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు బిక్షమయ్య గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించారు. భూపాలపల్లి వరంగల్ జిల్లా అధ్యక్ష పదవిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణరెడ్డి భార్య గండ్ర జ్యోతికి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షపదవిని జగ్గారెడ్డి సతీమణి నిర్మలకు ఇచ్చారు. కరీంనగర్ జిల్లా అధ్యక్ష పదవిలో మృత్యుంజయంను కొనసాగించనున్నారు. మంచిర్యాల డీసీసీ అధ్యక్ష పదవిలో కొక్కిరాల సురేఖను నియమించారు. ఖమ్మం సిటీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ పదవికి దీపక్ చౌదరిని, గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్ష పదవిలో అంజన్‌కుమార్ యాదవ్‌ని నియమించారు. మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్ష పదవిలో ఒబేదుల్లా కొత్వాల్‌ను కొనసాగించనున్నారు. వరంగల్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిలో రాజేందర్‌రెడ్డి కొనసాగనున్నారు. కొత్తగా ప్రకటించిన డీసీసీ అధ్యక్షుల జాబితాలో ఇద్దరు బ్రహ్మణులు ఒక్క వెలమ, ఇద్దరు ఎస్టీలకు, ఇద్దరు ఎస్సీలకు, 12 మంది బీసీలకు, ఇద్దరు కమ్మ, 9 మంది రెడ్డీలు, ఒక్క ముస్లింలకు అవకాశం కల్పించారు. అంతేకాకుకుండా ముగ్గురు మహిళలకు కూడ అధ్యక్ష పదవులు దక్కాయి.

డీసీసీ అధ్యక్షుల జాబితా

1. ఆదిలాబాద్	భార్గవ్ దేశ్‌పండే	17. మెదక్	తిరుపతి రెడ్డి
2. మంచిర్యాల	కొక్కిరాల సురేఖ	18. సిద్దిపేట	టి. నర్సారెడ్డి
3. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్	ఆత్రం సక్కు	19.వికారాబాద్	టి.రోహిత్ రెడ్డి
4. కరీంనగర్	కె.మృత్యుంజయం	20. మేడ్చల్ మల్కాజ్‌గిరి	కూన శ్రీశైలం గౌడ్
5.జగిత్యాల	ఎ.లక్ష్మణ్ కుమార్	21. రంగారెడ్డి	చల్లా నర్సింహారెడ్డి
6.పెద్దపల్లి	ఈర్ల కొమరయ్య	22. మహబూబ్‌నగర్	ఓబేదుల్లా కొత్వాల్
7.రాజన్న సిరిసిల్ల	ఎన్.సత్యనారాయణ గౌడ్	23. వనపర్తి	శంకర్ ప్రసాద్
8. నిజామాబాద్	మానాల మనోహర్ రెడ్డి	24.గద్వాల	పటేల్ ప్రభాకర్ రెడ్డి
9.నిజామాబాద్	సిటీ కేశా వేణు	25.నాగర్‌కర్నూల్	వంశీచంద్ రెడ్డి
10.నిర్మల్	రామారావు పటేల్ పవార్	26.సూర్యాపేట	చెవిటి వెంకన్న యాదవ్
11. కామారెడ్డి	కైలాష్ శ్రీనివాసరావు	27.యాదాద్రి భువనగిరి	బిక్షమయ్య గౌడ్
12.వరంగల్ (అర్బన్ ,రూరల్)	నాయిని రాజేందర్ రెడ్డి	28. మహబూబాబాద్	జె.భరత్ చంద్రారెడ్డి
13.వరంగల్ సిటీ	కేదారి శ్రీనివాసరావు	29.నల్గొండ	కె.శంకర్ నాయక్
14.జయశంకర భూపాలపల్లి	గండ్ర జ్యోతి	30. భద్రాచలం కొత్తగూడెం	వనమా వెంకటేశ్వరరావు
15.జనగాం	జంగా రాఘవరెడ్డి	31. ఖమ్మం	పువ్వాడ దుర్గా ప్రసాద్
16.సంగారెడ్డి	తూర్పు నిర్మల రెడ్డి	32. ఖమ్మం సిటీ	ఎన్. దీపక్ చౌదరి జావీద్
		33. హైదరాబాద్	అంజన్ కుమార్ యాదవ్

విద్యార్థులకు అల్పాహారం



విజయక్రాంతి, బోడుప్పల్: బోడుప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షల దృష్ట్యా ప్రత్యేక తరగతులకు హాజరు అవుతుండడంతో వారికి సాయంత్రం పూట అల్పాహారం అందించి వారి ఆకలి తీర్చేందుకు గాను ముందకొచ్చాడు ఘట్‌కేసర్ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి. ప్రతి యేటా ఇలానే అతను పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పహారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ విద్య నేర్చిన పాఠశాలలోని విద్యార్థులు ఆకలితో ఉండకుండా చూడాల్సిన బాధ్యత నాపై ఉందని, అందుకే కార్పొరేట్ పాఠశాలలోని విద్యార్థుల కంటే మంచి మార్కులు సాధించాలంటే వారికి విద్యా బోధనలతో పాటు కడుపు నిండా తిండి కూడా ఆవసరమే అని గ్రహించి వారు పరీక్షలు రాసే వరకు 30 రోజుల పాటు వారికి సాయంత్రం అల్పాహారం అందేలా ఏర్పాట్లు చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాం రెడ్డి, టీఆర్‌ఎస్ అధ్యక్షులు చెర్ల అంజనేయులు యాదవ్, ఎం.గిరి, వంశీ కృష్ణ, పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ ట్రైనింగ్ కోసం దరఖాస్తులు



విజయక్రాంతి, ముషీరాబాద్: ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జంట నగరంలో ఉన్న ఆర్టీసీ అన్ని డిపోలలో అప్రెంటిస్ ట్రైనింగ్ కొరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరారు. ఈ సందర్భంగా గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఐటీఐ పూర్తిచేసుకున్న డీజిల్ మెకానిక్, మోటర్ మెకానికల్, ఎలక్ట్రిషన్ అభ్యర్థుల నుంచి ఆర్టీసీ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ హనుమ నాయక్, ఆర్టీసీ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ నగరంలో ఉన్న అన్ని ఆర్టీసీలో 928 అప్రెంటిస్ ట్రైనింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అన్ని గ్రేడ్‌లకు సంబంధించిన అభ్యర్థులు 7308 మంది అభ్యర్థులు హాజరై దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను గ్రేడ్ల వారీగా విభజించి అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి త్వరలోనే పిలవడం జరుగుతుందని తెలిపారు. సమాచారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మొబైల్ నెంబర్‌కు సమాచారం పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు ఎస్‌వికె నగేష్, అసిస్టెంట్ డైరెక్టర్ విఠల్, ఉపాధి, శిక్షణ శాఖ కెఎస్‌ఖాన్, ఐటీఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా రైళ్లు రద్దు

విజయక్రాంతి, హైదరాబాద్: భద్రతా నిర్వహణ పనుల కారణంగా నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 9న విజయవాడ – భద్రాచలం రోడ్ ప్యాసెంజర్‌ను డోర్నకల్ – భద్రాచలం మధ్య, భద్రాచలం రోడ్ – విజయవాడ ప్యాసెంజర్‌ను భద్రాచలం రోడ్ – డోర్నకల్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో బోధన్ – మహబూబ్‌నగర్ ప్యాసెంజర్‌ను, మహబూబ్‌నగర్ – కాచిగూడ ప్యాసెంజర్‌ను షాద్‌నగర్ – మహబూబ్‌నగర్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

ఏసీబీ వలలో వేములవాడ పంచాయతీరాజ్ డీఈ



విజయక్రాంతి, కరీంనగర్: చేసిన పనుల బిల్లుల చెల్లింపుకు లంచం ఇస్తే గాని ఇవ్వని లంచగొండి పంచాయతీ రాజ్ అధికారిని వేములవాడలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బిల్లుల చెల్లింపు కోసం అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా లాభం లేకపోవడంతో లంచం ఇచ్చుకోలేని బాధితుడు ఆ అధికారిని ఏసీబీ అధికారులకు పట్టించిన ఘటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంచలనం కలిగించింది. ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్, బాధితుడి కథనం ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కట్ట కనుకవ్వ భర్త లచ్చయ్య ఉపాధిహామీ నిధులతో గ్రామంలో రూ.13 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లుల కోసం రెండు సంవత్సరాలుగా పంచాయతీరాజ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. మంజూరైన బిల్లుకు సంబంధించి చెక్‌మెజర్‌మెంట్ కోసం పంచాయతీ రాజ్ డీఈ మహేందర్‌రెడ్డి బాధితుడిని రూ. 70 వేలు డిమాండ్ చేయగా రూ. 10 వేలు గతంలోనే ఇవ్వగా మిగిలిన రూ. 60 వేలు కావాలని డీఈ వేదించగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు రూ. 60 వేలు ఇవ్వగా గురువారం బాధితుడి నుంచి డీఈ డబ్బులు తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డబ్బులు స్వాధీనం చేసుకొని డీఈ నివాసంలో సోదాలు నిర్వహించారు. పట్టుబడిన డీఈ మహేందర్‌రెడ్డిని శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పనులు పరిశీలన





విజయక్రాంతి, హైదరాబాద్: జూబీహిల్స్ అపోలో ఆస్పత్రికి సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం పనులు పూర్తి కావచ్చాయి. వచ్చే నెలలో విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. ఇందుకు సంభంధించి చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల గురించి హైదరాబాద్‌లోని టీటీడీ బోర్డు సలహా మండలి మండలి సమావేశం, సభ్యులు శ్రీమతి విజయా రాజం నివాసంలో జరిగింది. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. అంతకు ముందు సభ్యులు దేవాలయాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు.

నా జీవితం నల్లగొండ ప్రజానీకానికే అంకితం

- పార్లమెంటుకు పోటీచేస్తున్న భారీ మెజార్టీతో గెలిపించండి
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విజయక్రాంతి, నల్లగొండ: ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ నియోజకవర్గంలోని నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానకి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఎన్నికై ఉపసర్పంచ్‌లను వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు పింఛన్‌లు కట్ చేస్తామని, ప్రభుత్వం పథకాలు నిలిపేస్తామని ప్రజలను భయపెట్టి సర్పంచ్ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నం చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి కాంగ్రెస్ మద్దతు దారులను భారీ మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిఎం కేసీఆర్ దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పడంతో ప్రజలు ధన ప్రవాహానికి తలొగ్గి టీఆర్‌ఎస్ పార్టీని గెలిపించారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో శాసనసభ ఎన్నికల్లో ఎన్ని ఓట్లతో ఓటమి చెందానో అంతకుమించి డబుల్ ఓట్ల మెజార్టీతో ఎంపిగా గెలిపించాలని నల్లగొండ నియోజకవర్గ ప్రజలపై సంపూర్ణ నమ్మకం, విశ్వాసం ఉన్నదని, పదవులు, ఉన్నా లేకున్నా నా జీవితం ప్రజా సేవకే అంకితం అన్నారు. సీఎం కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుంటానిని చెప్పడం సంతోషం అని పార్టీలతో సంబంధం లేకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని, మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు నల్లగొండ పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రజలు, నాయకులు, అభిమానులు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, షబ్బీర్‌అలీ, శేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఖనిజాలు దేశ ప్రగతికి ఆయువు పట్టు



- భూగర్భ విజ్ఞాన శాస్త్రం గురించి మరింత అవగాహన పెరగాలి
- పత్రిక సమాచార కార్యాలయ అదనపు డైరక్టర్ జనరల్ వెంకటేశ్వరరావు

విజయక్రాంతి, ముషీరాబాద్: ఖనిజాలు దేశ ప్రగతికి ఆయువు పట్టు లాంటివని, మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఖనిజాలు ఊతమిస్తాయని పత్రికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్ జనరల్ టి.వి.కె రెడ్డి పేర్కొన్నారు. మన దేశంతో పాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులకు భారతీయ భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ ద్వారా ఖనిజ అన్వేషణలో శిక్షణ అందిస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం ముషీరాబాద్ కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ సముదాయంలో పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూగర్భ విజ్ఞాన శాస్త్రం గురించి మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని అన్నారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.ఎచ్. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ 1976లో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా స్థాపించబడి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, శాస్త్రవేత్తలకు కావలసిన భూగర్భ విషయ పరిజ్ఞానాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. భూ విజ్ఞాన పరిశోధనలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 32,000 మంది భూ సంబంధ వృత్తి నిపుణులు ఈ శిక్షణ సంస్థ ద్వారా లబ్ధి పొందినట్లు ఆయన తెలిపారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ భూగర్భ శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం భూ విజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ ప్రధాన కార్యక్రమమని, ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ విద్యార్థులు కనబరుస్తోన్న ఆసక్తి, డిమాండ్‌కి అనుగుణంగా శిక్షణ, సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ప్రపంచ నలుమూలల నుంచి దాదాపు 62 దేశాలకు చెందిన 433 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఈ సంస్థ ద్వారా శిక్షణ పొందినట్లు వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ డైరెక్టర్ డా. తారక్ నాథ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించిన ఎమ్మెల్యే

విజయక్రాంతి, మెహిదీపట్నం: కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ గోల్కొండ కోటలో ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, టూరిజం, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సందర్శించి కోటలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించారు. కోటలో చేపడుతున్న అభివృద్ధి పనులతో కోటను అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. బొటింగ్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రతి రోజు దాదాపు ముప్పై వేల మంది సందర్శకులు గోల్కొండ కోటను సందర్శిస్తారనీ, పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉన్నదని తెలిపారు. దీనికి పరిష్కారంగా ప్రస్తుతం ఉన్న రహదారి సరిపోవడం లేదనీ, దీంతో పాటు పాత రహదారి కబ్జాకు గురైందనీ పాతరహదారిని అందుబాటులో తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్వాన్, నానల్‌నగర్, గోల్కొండ కార్పొరేటర్లు అధికారులు,ఎ ఐఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా భయపెడుతున్న ప్రీఎక్లంప్షియ



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రీఎక్లంప్షియ ప్రపంచ వ్యాప్తంగా భయపెడుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో 2 శాతం ఇన్సిడెన్స్ ఉండగా ఆఫ్రికాలోని కొన్ని చోట్ల 18 శాతం దాకా ఉంది. లాటిన్ అమెరికాలో ప్రీఎక్లంప్షియ తల్లుల మరణానికి గల కారణాల్లో మొదటిది. ప్రపంచ వ్యాప్తంగా 10 మిలియన్‌ల మంది మహిళల్లో ప్రీఎక్లంప్షియ కనిపిస్తోంది. 76,000 గర్భినులు ప్రతి యేటా ప్రీఎక్లంప్షియ దాని సంబంధిత సమస్యలతో చనిపోతున్నారు. ఇండియాలో ప్రతి యేటా 28 మిలియన్ల ప్రెగ్నెన్సీలకు 810 శాతం ప్రీఎక్లంప్షియ రిపోర్ట్ అవుతున్నాయి. ఇండియాలో 3.5 మిలియన్ల శిశువులు నెలలు నిండకుండానే పుడుతున్నారు. ప్రీఎక్లంప్షియను తొందరగా గుర్తించి సకాలంలో మేనేజ్ చేయాలంటే అన్ని సౌకర్యాలున్న, హై రిస్క్ ప్రెగ్నెన్సి డీల్ చేయగల యాంటీ నేటల్ క్లినిక్స్ ఉండాలి. శిక్షణ పొందిన వాళ్ళు ఉండడం ముఖ్యం. డాక్టర్ శాంతకుమారి, ఇండియన్ కాలేజ్ ఆఫ్ అబ్ స్టే ట్రీషియన్స్ అండ్ గైనకాలజీస్ట్స్ ఫంక్షన్ గురించి, ఇండియాలో ప్రీఎక్లంప్షియ గురించి వివరించారు. డాక్టర్ ప్రతిభ, రిటైర్డ్ ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ అబ్ స్టే ట్రిక్స్, గైనకాలజీ, ఉస్మానియా మెడికల్ కాలేజ్, హైదరాబాద్, పబ్లిక్ హెల్త్‌లో పరిస్థితుల గురించి వివరించారు.

అనుబంధాలను గుర్తుచేసేవే బాలల సినిమాలు

- ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు



విజయక్రాంతి, కరీంనగర్: చిన్నారులకు ప్రేమానురాగాలు, అనుబంధాలు, ఆప్యాయతలను తెలియజెప్పేవే బాలల చలనచిత్రాలు అని, బాలల సినిమాలను విరివిగా చూసి విద్యార్థులు మానవీయ విలువలు పెంపొందించుకోవాలని కరీంనగర్ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఫిలింభవన్‌లో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఇండియా, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన బాలల చలనచిత్రోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కుటుంబ కథా చిత్రాలు చాలా అరుదుగా వస్తున్నాయని, విజ్ఞానం, వినోదం సృజనాత్మకతతో పాటు మానవాయ సంబంధాలు పెంపొందించేలా నిర్మించిన బాలల చిత్రాలు మనస్సును హత్తుకుంటాయని అన్నారు. ఇలాంటి సినిమాలు చూడటం వల్ల చిన్నారుల్లో తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల పూజ్యభావం పెరుగుతుందని అన్నారు. సినీ విమర్శకులు వారాల ఆనంద్, కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ బాలల సినిమాలు చూడటం వల్ల చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శక్తియుక్తులు వెలుగులోకి వస్తాయని అన్నారు. బాలల చిత్రాలను చిన్నారులతో పాటు తల్లి దండ్రులు కూడా కలిసి చూడాలని అప్పుడే చిన్నారుల్లో మనసు లోతులను తల్లిదండ్రులు అర్థం చేసుకోగలుగుతారని అన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానొపాధ్యాయులు విద్యార్థులను బాలల చలన చిత్రాలు చూసేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కఫిసో కార్యదర్శి ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు రూ.2 కోట్ల మంజూరు

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న మురుగునీటి సమస్యకు గురువారంతో ఫుల్‌స్టాప్ పడనుంది. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పట్టుదలతో అధికారుల చుట్టూ తిరిగి చివరికి సాధించుకున్నారు. ప్రేమ్‌నగర్ మురుగునీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ.2 కోట్లను మంజూరు చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ పనులు సైతం గురువారం ప్రారంభించారు.

ప్రియాంక తొలి ప్రచార సభలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ప్రియాంక బుధవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె పరిధిలో ఉన్న 40లోక్‌సభ స్థానాల్లో భాజపా కంచుకోటలుగా చెప్పుకొనే స్థానాలున్నాయి. వాటిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఎంపీగా పనిచేసిన గోరఖ్పూర్ సీట్లు కీలకమైనవి. ఉత్తరప్రదేశ్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, జ్యోతిరాదిత్య సింధియాతో ఆమె మంగళవారమే చర్చలు జరిపారు. లోక్సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో ఓ వైపు ప్రియాంకతో, మరోవైపు యువతను ఆకర్షించగలిగే సమర్థత ఉన్న నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాతో ప్రచారం పార్టీకి లాభిస్తుందని భావిస్తున్నారు.

ఆరోపణలు ఖండించిన వాద్రా

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయకూడదని ఆదేశించింది. అయితే కేసు విచారణ నిమిత్తం ఈడీ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు వాద్రాకు సూచించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం 3.40 గంటల ప్రాంతంలో ఆయన ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట భార్య ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. వాద్రా లోపలకు వెళ్లగానే ప్రియాంక అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రాబర్ట్ వాద్రాను ఈడీ దాదాపు అయిదున్నర గంటల పాటు విచారించింది. దాదాపు 40 ప్రశ్నలు వేసి లిఖిత పూర్వకంగా సమాధానాలు తెలుసుకొంది. జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, మరో అయిదుగురు అధికారులు విచారించారు. తనకు లండన్లో ఎలాంటి ఇల్లులేదని వాద్రా చెప్పినట్టు తెలిసింది.

రెచ్చిపోతున్న కబ్జాదారులు

(మొదటి పేజీ తరువాయి)

గ్రేటర్ హైదరాబాద్ అధికారులకు చేసిన ఫిర్యాదుతో అక్కడ జరుగుతున్న అక్రమాలు వెలుగోలోకి వచ్చాయి. చుట్టూ తిరిగినా న్యాయం జరగకపోతుండటంతో పరిధిలోని మన్సూరాబాద్ వివేకానంద నగర్ కాలనీ వాసుల సంఘం పిర్యాదుతో అక్కడ జరుగుతున్న అక్రమాలు వెలుగోలోకి వచ్చాయి.

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవటం ప్రజలు చేస్తున్న ఆరోపణలకు బలాన్ని ఇస్తోంది. ఆక్రమణదారులు చేసిన అక్రమాలతో ప్రమీల అనే సీనియర్ సిటిజన్ తన ఇంటిస్థలాన్ని కోల్పోయింది. న్యాయం చేయండి ప్రభో అంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతోంది. జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరాబాద్ సర్వే నెంబరు 30లో 53 ప్లాట్లతో వివేకానంద నగర్ కాలనీ వెలిసింది. 1978లో గ్రామపంచాయితీ లేఅవుట్ ప్రకారం అమ్మకాలు జరిగాయి. దాంతో అప్పటి ఎల్బీనగర్ మున్సిపాటిటీ అనుమతులతో కొందరు స్థల యజమానులు ఇళ్లు నిర్మించుకోగా కొన్ని ఇంటి స్థలాలు కాళీగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్లాట్ల ధరలు పెరగటంతో కబ్జాదారుల కన్ను వీటిపై పడింది. దాంతో వెనక ఉంటూ కథనడిపించటం మొదలు పెట్టారు. తమ వ్యక్తుల చేత అందు లో స్థలాలు కొనిపించి కబ్జాలకు తెరతీసినట్లు తెలిసింది. కాలనీ వాసులు అడ్డుకోవటంతో అందులో ఒకరు అధికార పార్టీ టీఆర్ ఎస్ నేతను రంగంలోకి దింపాడు.

సమస్య మరింత జఠిలంగా తయారైంది. ప్లాట్ నెంబరు 1,2,24 ప్లాట్ల యజమానులు గుండు గౌతం, రాజయ్య, మల్లేశ్ చేస్తున్న అక్రమాలు మొత్తం కాలనీ వాసులకు తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. వీరు లేఅవుట్ లోని రోడ్లను ఆక్రమించి నిర్మల ఇంటి స్థలం ప్లాట్ నెం,19 ని రోడ్డుగా మార్చారు. ఈ విషయం తెలుసుకొని నిలదీసినా స్పందించకుండా వ్యవహరించటంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. ఆమెకు న్యాయం చేయాలని కోర్టు అధికారులను ఆదేశించింది. కాని కోర్టు తీర్పును అమలు చేయకుండా అధికారులు సాకులు చూపుతూ తప్పించుకుంటున్నారు. ఇప్పటికీ ఈ తీర్పు అమలు కోసం ఆమె రెవిన్యూ, జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంది. కబ్జాదారులు సృష్టించిన వివాదంతో కాలనీకి దాదాపు రూ.19 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ పనులు నిలిచి పోయాయి. దాంతో కాలనీ ప్రజలు రోడ్డు సదుపాయానికి నోచుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత రెవిన్యూ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఈ కాలనీ లేఅవుట్ పై సమగ్రమైన విచారణ జరిపించి వివాదాలను పరిష్కరించాలని, సామాన్యులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

స్పీకర్‌ను పరామర్శించిన సీఎం కేసీఆర్..

విజయక్రాంతి, కామారెడ్డి: శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. ఇటీవల పోచారం తల్లి పాపమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బాన్సువాడ చేరుకున్న సీఎం కేసీఆర్ రోడ్డు మార్గం ద్వారా పోచారం స్వగ్రామం పోచారం గ్రామానికి చేరుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి విచ్చేసిన కేసీఆర్ స్వర్గీయ పాపమ్మ చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించారు. సీఎం వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ ఉన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దఫేదర్ రాజు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, మాజీ స్పీకర్ మధుసూధన చారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్దన్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, నల్లమడుగు సురేందర్, శ్రీనివాస్ గౌడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఖమ్మం ఎంపీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గుత్తా సుఖేందర్ రెడ్డి, నాయని నరసింహారెడ్డి, ఏనుగు రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమి కాదు కల్తీ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తున్నామన్నారు. తమ నాలుగేళ్ల పాలనలో భారత్‌ను అనేక రంగాల్లో అగ్రగామిగా చేశామని ప్రధాని మోదీ తెలిపారు. సమస్యలు, సవాళ్లకు ఎదురు నిలిచామని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చామన్నారు. భారత్ లోనే ఎక్కువ సెల్ ఫోన్లు తయారవుతున్నాయి. భారత్ లోనే అత్యధికంగా మొబైల్ డేటా వినియోగిస్తున్నారని ప్రధాని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉంటుందని భావిస్తున్నామని, తొలిసారి ఓటు వేసే యువతను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.

వారు దేశాన్ని ద్వేషిస్తున్నారు..

మోదీ, బీజేపీ ఆలోచనలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ దేశానికి కీడు చేస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు. వ్యవస్థలను నాశనం చేస్తున్నామంటూ తనను విమర్శిస్తున్న పార్టీలు అదే క్రమంలో దేశాన్ని కూడా ద్వేషిస్తున్నాయని మండిపడ్డారు. 'రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేస్తున్నారని నాపై విమర్శలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు అన్నాక విమర్శలు చేయడం సహజం. మోదీని విమర్శించే క్రమంలో దేశాన్ని ద్వేషిస్తున్నారు. ఖర్గే చేసిన విమర్శలు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా ఉంది. లండన్ వెళ్లి భారత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సమంజసమా? అని మోదీ ప్రశ్నించారు. మేం వ్యవస్థలను నిర్వీర్యం చేశామనేది అవాస్తవమని అన్నారు. సమస్యలు, సవాళ్లకు ఎదురు నిలిచామని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామని ధీమా వ్యక్తం చేశారు.

హక్కులు కాలరాసింది కాంగ్రెస్సే..

కాంగ్రెస్‌కు నిజాలు ఒప్పుకునే అలవాటు లేదని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు పవిత్రత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వ్యవస్థల పట్ల ఏమి గౌరవం ఉందని మోదీ నిలదీశారు. ఇందిరా గాంధీ రాష్ట్ర ప్రభుత్వాలను 50 సార్లు డిస్మిస్ చేశారన్నారు. అభిశంసన పేరుతో న్యాయ వ్యవస్థను భయపెట్టే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రాల హక్కులను హరించడం.. రాజకీయం కోసం రాష్ట్రపతి పాలన పెట్టడం ఆ పార్టీకి అలవాటని ఆయన ఆరోపించారు. నెహ్రూ, ఇందిర హయాంలో కేరళ, బెంగాల్లో హక్కులను కాలరాశారని మోదీ మండిపడ్డారు. 'ఆర్టికల్ 352ను కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు ప్రయోగించింది. కేరళలో మొట్టమొదట కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోసింది కాంగ్రెస్ పార్టీనే. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూడా అలాగే కూలదోశారు. ఈ నాలుగున్నరేళ్లలోనే ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. 11వ స్థానంలో ఉన్న భారత్ ఆరో స్థానానికి చేరితే విపక్షం ఎందుకు బాధపడుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాం. దోపిడీదారులు దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ చూస్తూ కూర్చుంది.' అని మోదీ విమర్శించారు. అవినీతిపరులపై చర్యలు చేపట్టేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

రఫేల్‌పై అందుకే వివాదం..

దేశ రక్షణకు ప్రాణాలర్పించే సైన్యం కోసం తమ ప్రభుత్వం ఎటువంటి చర్యలకైనా సిద్ధమని ప్రధాని మోదీ తెలిపారు. సైన్యం యుద్ధ సామర్థ్యం పెంచేందుకు మేం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, సైన్యానికి నాణ్యమైన ఆయుధ సంపత్తి అందించామన్నారు. భారత వాయుసేన బలోపేతం కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, అందుకే రఫేల్ అంశాన్ని ఆ పార్టీ వివాదం చేస్తోందని అని మోదీ మండిపడ్డారు. 'దేశ సైనికుల పట్ల కాంగ్రెస్ పార్టీ అగౌరవ వ్యాఖ్యలు చేసింది. రాజకీయాల కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. న్యాయవ్యవస్థలో మేం ఎక్కడా జోక్యం చేసుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ భారత సైన్యాన్ని అవమానించింది. సైన్యాధ్యక్షుడిని 'గూండా' అంటోంది. ఈసీ, సుప్రీం కోర్టులను అగౌరవపరిచేలా వ్యవహరించింది. న్యాయవ్యవస్థను భయపెట్టేలా కాంగ్రెస్ పార్టీనే వ్యాఖ్యలు చేస్తోంది..' అని మోదీ ఆరోపించారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందం గురించి రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పారన్నారు. కాంగ్రెస్ తన ముప్పయ్యేళ్ల పాలనలో భారతీయ వాయు సేనకు అత్యాధునిక (నెక్స్ట్ జనరేషన్) విమానాలను ఎందుకు సమకూర్చలేదని మోదీ ప్రశ్నించారు. దేశాన్ని కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆరోపించారు. ఏ కంపెనీల కోసం మీరు సిగ్గు లేకుండా పని చేస్తున్నారని నిలదీశారు. దళారీతనంతో సైన్యం సామర్థ్యాన్ని దెబ్బతీశారని, యూపీయే పాలనలో లక్షిత దాడులు (సర్జికల్ స్ట్రైక్స్) చేయలేకపోయారని మోదీ దుయ్యబట్టారు. భారత సైన్యం ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నినట్లు కాంగ్రెస్ నేతలు కథలు అల్లారని చెప్పు, వ్యవస్థలను నాశనం చేస్తున్నది ఎవరు? అని మోదీ నిలదీశారు. సుప్రీం కోర్టు, వాయు సేన, సీబీఐ, లోక్ తంత్రను అవమానించడం వెనక కాంగ్రెస్ వికృతి ప్రవర్తనే కారణమని విమర్శించారు. ఇదోక రోగంగా ఆయన అభివర్ణించారు. రోగం నయం కావాలంటే సరైన మందు పడాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో కలిస్తే ఆత్మహత్యతో సమానమని అంబేద్కర్ అన్నారని, కాంగ్రెస్ ముక్త భారత్ గాంధీజీ నినాదమని, దాన్ని పూర్తి చేస్తున్నామని మోదీ విమర్శించారు.

దేశాన్ని సర్వశక్తిగా తీర్చి దిద్దడమే లక్ష్యం

దేశాన్ని మహోన్నతంగా, సర్వశక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. నాలుగేళ్లలో అనేక రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. 'అనేక అంకుర సంస్థలను ప్రోత్సహించాం. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాం. ఆధార్ వ్యవస్థ ద్వారా అవినీతి పరుల ఆటకట్టించాం. నోట్ల రద్దుతో నకిలీ 3 వేల కంపెనీలు మూతపడ్డాయి. జీఎస్టీతో అక్రమ సంపాదన లెక్కలు అన్ని బయటకు వచ్చాయి. ద్రవ్యోల్బణం దిగివచ్చింది. విద్యారుణాలు మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనకరంగా మారాయి' అని మోదీ తెలిపారు. ఎల్ఈడీ బల్బుల ధరలు మా హయాంలో తగ్గాయని, దేశమంతా వెలుగులు విరజిమ్ముతోంది, విద్యుత్ బిల్లులు కూడా బాగా తగ్గాయన్నారు. తక్కువ ధరకు స్టెంట్‌లు లభిస్తున్నాయని, దేశ వ్యాప్తంగా డయాలిస్ కేంద్రాలు, జన ఔషధి కేంద్రాల ఏర్పాటయ్యాయన్నారు. క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులతో చనిపోయేందుకు కూడా పేదలు సిద్ధమేకానీ, ఆసుప్రతులకు రావడానికి భయపడుతుంటారని అలాంటి వారికి ఆయుష్మాన భారత్ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. దీంతో గతంలోగా ఎంపీలు డబ్బుల కోసం నా లేఖల కోసం ఎదురు చూడాల్సిన తప్పిందన్నారు. అయితే కోలుకున్న తానే లేఖలు రాస్తున్నట్లు మోదీ వివరించారు.

పరోక్షంగా లక్షల్లో ఉపాధి

వంద రంగాల్లో ఉద్యోగాల కల్పనకు రంగం సిద్ధం చేసినట్లు ప్రధాని తెలిపారు. 80 నుంచి 90 శాతం ఉన్న అసంఘటిత రంగంలో పరోక్షంగా లక్షల్లో ఉపాధి కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. నేషనల్ పెన్షన్ స్కీమ్ సభ్యులు 1.2 కోట్లు చేరారని, 15 నెలల్లో 1.80 లక్షల పీఎఫ్ జమ అయ్యిందన్నారు. 4 ఏళ్లలో 6 లక్షల కొత్త ఉద్యోగాలు కల్పించామన్నారు. స్వయం ఉపాధితో డాక్టర్, సీఏ, తదితరులు పలు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. రవాణా రంగం ఎంతో మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిందన్నారు. 4 ఏళ్లలో కమర్షియల్, ప్రయాణ, ఆటో వాహనాలు పెరిగాయని తద్వారా ఎంతో మందికి ఉపాధి లభిందన్నారు. వాటి నిర్వహణలో పరోక్షంగా ఉపాధి కలుగుతోందన్నారు. హోటల్ పరిశ్రమ కూడా ఇలాగే ఉంది 50 శాతం వృద్ధి చెందిందని, ఎంతో మందికి ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. ముద్రా యోజన ద్వారా రుణాలు పొందిన వారి సంఖ్య తొలిసారి లక్షల్లో దాటిందన్నారు. దేశ వ్యాప్తంగా 2 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు పని చేస్తున్నాయని ఒక్కో సెంటర్ 3 నుంచి 5 గురికి ఉపాధి కల్పిస్తోందన్నారు. రహదారుల నిర్మాణం, కొత్త ఎయిర్‌పోర్టులు, రైల్వేల అభివృద్ధితో పాటు స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి వాటితో అనేక ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ నిరుద్యోగంపై విపక్షాల విమర్శలను మోదీ తిప్పికొట్టారు.బడ్జెట్ చూస్తే ఉపాధి కల్పనకు ఎంత కేటాయించామో తెలుస్తోందన్నారు.

రైతులకు మేలు చేసింది మేమే

రైతులకు కూడా తమ ప్రభుత్వ హయాంలోనే ఎంతో మేలు జరిగిందని ప్రధాని మోదీ అన్నారు. మీ , మా పాలనలో రైతులకు దక్కిన ఫలాలను భేరీజు చేసుకోవాలన్నారు. 2009లో 4 లక్షల కోట్ల రుణాల్లో 52 కోట్ల మాత్రమే కాంగ్రెస్ రుణ మాఫీ చేసిందని విమర్శించారు. రాజకీయాలు ఆపి పేదల గురించి ఆలోచించాలని చురకలు వేశారు. కర్నాటక రైతులకు ఏం చేశారో చెప్పాలని మోదీ డిమాండ్ చేశారు. చాలా వాగ్దానాలు శారు.. రుణ మాఫీ చేశారా అని నిలదీశారు. రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో రుణమాఫీ జరిగింది ఎంత అని మోదీ ప్రశ్నించారు.

భారత వాణి ప్రపంచానికి చేరుతోంది

భారత వాణి ప్రపంచానికి చేరుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలో జరిగే ఏ నిర్ణయమైనా భారత్‌లో ముందుగా అమలవుతోందన్నారు. ప్రపంచంలో రెండు శత్రు దేశాలు కూడా భారత్‌కు మిత్ర దేశాలేనని గుర్తు చేశారు. కుంభ మేళాకు ప్రపంచ దేశ దౌత్యవేత్తలు కూడా వస్తున్నారన్నారు. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా వెనుకబాటుకు కాంగ్రెస్సే కారణమని మోదీ ఆరోపించారు. మీకు నీతి లేదు, విజన్ లేదు అందుకే ఇంత వెనక బడి ఉన్నాం అని మండిపడ్డారు. అహంకారమే కాంగ్రెస్‌ను దిగజార్చిందని, అందుకే 400 నుంచి 44 కు పడిపోగా తాము కమిట్ మెంట్‌తో 2 సీట్ల నుంచి 282 సీట్లకు ఎదిగామన్నారు. దేశ కలలు సహకారం చేసేందుకు పగలు, రాత్రి పని చేస్తున్నామని, దేశ అభివృద్ధి కోసం మేం పని చేస్తూనే ఉంటామన్నారు. దేశాన్ని లూటీ చేసిన వారిలో భయం కల్పిస్తూనే ఉంటామని, అందుకే మేం ఇక్కడ ఉన్నామని మోదీ స్పష్టం చేశారు. అవినీతి పరులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు.'పేదల అభ్యున్నతి, దేశ ప్రగతి కోసం పని చేస్తున్నాం.ప్రజలే మాకు అండదండ. సంపూర్ణ మెజార్టీ ఉన్న ప్రభుత్వం ఎలా చేసి చూపిస్తుందో నిరూపించాం.. అందుకే మేం మళ్లీ అధికారంలోకి రానున్నాం' అని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మా సేవలను పేదలు గుర్తించాలి, మమల్ని గెలిపించేందుకు వారికి మరో అవకాశం వచ్చిందన్నారు. తన ప్రసంగం సందర్భంగా పలు కవితలను మోదీ వినిపించారు. కాంగ్రెస్‌పై అనేక వ్యంగాస్త్రాలు సంధించారు. ప్రధాని ప్రసంగం అనంతరం మోదీ.. మోదీ అంటూ ఎన్డీయే సభ్యుల నినాదాలు, చప్పట్లతో సభ మారుమోగింది.

దేశ రక్షకులకు, దేశ వ్యతిరేకులకు మధ్యే పార్లమెంట్ ఎన్నికలు



విజయక్రాంతి, వరంగల్: స్కీంలు కేంద్రానివి, స్కాంలు రాష్ట్రాలవి అని నెహ్రూ యువ కేంద్ర సంఘటన జాతీయ ఉపాధ్యక్షులు, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. రానున్న 2019 పార్లమెంట్ ఎన్నికలు దేశ రక్షకులకు, దేశ వ్యతిరేకుల మధ్య జరుగనున్నాయన్నారు. బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా కార్యాలయంలో బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి తెలంగాణలో టీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేశారు. భారతదేశ చరిత్రలో రాజ్యాంగాన్ని అవమానపరిచి, అపహాస్యపాలు చేసి, పార్లమెంటరీ, ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ నిలిచిపోతారని ఆయన ఎద్దేవా చేశారు. 70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో రెండు నెలల పాటు క్యాబినెట్ ఏర్పాటు చేయకుండా కేసీఆర్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ ఒక జాగీర్‌లాగా, కొడుకు కేటీఆర్ యువరాజులుగా, కూతురు కవిత యువరాణిలాగా ఆడిందే ఆటగా, పాడిందే పాటగా వ్యవహరిస్తూ, తెలంగాణ ప్రజలనే కాకుండా, యావత్ భారతదేశ ప్రజలను అవమానపరిచాడని ఆవేదన వ్యక్తం చేశాడు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను గెలిపించడానికి చంద్రబాబునాయుడు ఆడిన ఒక దొంగాట కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడమేనని, దీన్ని కాంగ్రెస్ నాయకులు ఒప్పుకోవాలని ఆయన అన్నారు. దొంగలను సురక్షితంగా పెట్టడానికి చంద్రబాబునాయులు చాలా కష్టపడుతున్నారని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోడీకి వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కేసీఆర్, కాంగ్రెస్‌తో చంద్రబాబునాయుడు కలిసి దొంగలంతా ఒక్కటై కొత్త డ్రామాకు సిద్ధమయ్యారని విమర్శించారు. 2019 పార్లమెంట్ ఎన్నికలలో కేసీఆర్ గెలిచే ఐదారు ఎంపీ సీట్లతో తెలంగాణ రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, కేవలం తెలంగాణ రాష్ట్రానికి ఒక కొత్త యువరాజు మాత్రమే వస్తారని ఆయన జోష్యం చెప్పారు.రానున్న ఎన్నికలలో బీజేపీని అధిక మెజార్టీతో గెలిపించి దేశ అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలకు విన్నవించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నరహరి వేణుగోపాల్ రెడ్డి, గంద్రతి యాదగిరి, జిల్లా నాయకులు సంగని జగదీశ్వర్ , పశికంటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విజయక్రాంతి, రాజేంద్రనగర్: పుప్పాల్‌గూడ గ్రామ పంచాయతీలో డ్రైనేజీలో పడి ప్రాణాలు కోల్పోయిన నర్సింగ్‌రావు కుటుంబానికి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, ఎంపీటీసీలు సుమారు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నర్సింగ్‌రావు కుటుంబాన్ని అదుకోవాలని ధర్నా నిర్వహించారు. గతంలో కూడా ఇదే గ్రామానికి చెందిన మరో కార్మికుడు డ్రైనేజీలో దిగి చనిపోయినా ఎవరు పట్టించుకోలేదని సీఐటీయూ గండిపేట మండల కార్యదర్శి రుద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో చనిపోతున్న కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోదు, గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లు పట్టించుకోకపోతే మరెవరు పట్టించుకొంటారని ప్రశ్నించారు. ఇక ఎమ్మెల్యే కూడా ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. చివరి గ్రామ ఉపసర్పంచ్ మహేశ్‌కుమార్, ఎంపీటీసీలు లావణ్య, అంజనేయులు, ఊర్మిళ, లక్ష్మి, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌లతో పాటు కార్యదర్శి వెంకటశివయ్య మరికొందరు కాంట్రాక్టర్లు కలిసి చనిపోయిన నర్సింగ్‌రావు కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చేందుకు హామీ ఇవ్వడంతో కార్మికులు తమ ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.జంగయ్య, యాదయ్య, దేవేందర్, ప్రభాకర్, రవికుమార్, నరసింహరాజు, చంద్రకళ, ఎల్లమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

జూన్ నాటికి ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ ఎస్.కె.జోషి, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఓఎస్డి శ్రీధర్ దేశ్ పాండే, నీటి పారుదల ఇ.ఎన్.సి.లు మురళీధర్, అనిల్ కుమార్, నాగేందర్, సిఇలు శంకర్, శ్రీనివాస్ రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపిలు జె.సంతోష్ కుమార్, సీతారామ్ నాయక్, ఎమ్మెల్యేలు ఈటల రాజెందర్, డి.ఎస్. రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బాల్క సుమన్, సుంకె రవి శంకర్, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, గంగుల కమలాకర్, ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, గ్యాదరి కిశోర్, నన్నపునేని నరేందర్, వి. సతీష్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్.ఆర్.ఎస్.పి. పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై కూలంకశంగా చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఉందో గుర్తించి, దాన్ని అప్పటికప్పుడే పరిష్కరించారు. భూసేకరణకు, ఇతర పనులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. "గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. ఈ నీటిని ఎత్తిపోయడానికి భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నం. ఈ ఏడాది వర్షాకాలం నుంచే మేడిగడ్డ నుంచి నీరు ఎత్తిపోసి మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తాం. అలా తరలించిన నీటిని ఎస్.ఆర్.ఎస్.పి. కాల్వల ద్వారా అన్ని చెరువులను మళ్లించాలి. చెరువులను నింపడమే ప్రథమ ప్రాధాన్యంగా గుర్తించాలి. దీనికోసం ఎస్.ఆర్.ఎస్.పి. కాల్వలన్నింటినీ మరమ్మత్తు చేయాలి. కావాల్సిన చోట తూములు వెంటనే నిర్మించాలి. భూ సేకరణ పూర్తి చేయాలి. రెండో ఫేజులో నిర్మించిన కాల్వలకు లైనింగ్ పూర్తి చేయాలి. అవసరమైతే కాల్వల క్యారీయింగ్ కెపాసిటీ (నీటి ప్రవాహ ఉధృతి సామర్థ్యం) ని పెంచుకోవాలి. ఎక్కడ ఏ పనిచేయాలో నిర్ణయించడానికి వెంటనే 50 మంది ఇంజనీర్లను నియమించండి. యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, అంచనాలు రూపొందించాలి. కావాల్సిన నిధులు వెంటనే మంజూరు చేస్తాం. పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరగాలి. అన్ని పనులూ పూర్తి చేసి, ఎట్టి పరిస్థితుల్లో ఈ వర్షాకాలానికి ఎస్.ఆర్.ఎస్.పి. పరిధిలోని 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. ఎండాకాలంలోపు పనులు పూర్తి కావాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన సూచనలు అంశాలు వారీగా

- ఎస్సారెస్పీ కాల్వల పనులు చేయడానికి ఎక్కడికక్కడ ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించాలి. అన్ని చోట్ల పనులు సమాంతరంగా జరగాలి.
- అన్ని ప్రాజెక్టుల కాల్వలకు సంబంధించిన హద్దులను నిర్ణయించాలి. ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలను (ఇన్వెంటరీ) రూపొందించాలి.
- కడెం గేటు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి
- ఎస్సారెస్పీ పంట కాల్వలను ఎవరైనా దున్నుకుంటే, వాటిని పునరుద్ధరించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపి, రైతులను ఒప్పించాలి.
- అన్ని ప్రాజెక్టుల ప్రొఫైల్ తయారు చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ తయారు చేయాలి.
- ప్రాజెక్టుల నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయాలి. ఆ నిధులను బడ్జెట్ లోనే కేటాయిస్తాం.
- చనాఖా కొరాటా పనులు మే 15 నాటికి పూర్తి కావాలి.
- దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘనపూర్, పాఖాల కాల్వల పనులను ఈ ఎండాకాలంలోనే పూర్తి చేయాలి.
- దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి.

మోడీ ఓ పిరికిపంద

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఎంతో మంది ముస్లింల మనోభావాలకు విరుద్ధంగా బీజేపి ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు. దేశంలోని పౌరులందరిని సమానంగా చూసేంది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని ఆయన అభివర్ణించారు. అంతే కాకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై రాహుల్ మరోసారి పదునైన వ్యాఖ్యలతో విరుకుచుకుపడ్డారు. ప్రధానమంత్రి ఓ "పిరికిపంద" అనీ దమ్ముంటే జాతీయ భద్రత, రాఫెల్ ఒప్పందం, ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై తనతో చర్చకు రావాలంటూ ఆయన సవాల్ విసిరారు. ఢిల్లీలో కాంగ్రెస్ మైనారిటీ విభాగం నిర్వహించిన ఓ సమావేశంలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. మోడీని పరోక్షంగా ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ 56 అంగుళాల ఛాతీ వణికిపోతోందన్నారు. ఈ దేశం అందరిదీనని చెప్పారు. రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందన్నారు. మోడీ చాలా నిరాశతో కనిపిస్తున్నారని, విద్వేషాన్ని వ్యాపింపజేయడం వల్ల మనుగడ ఉండదని ఆయనకు కనువిప్పు కలిగినట్టు ఉందని తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని రాహుల్ చెప్పుకొచ్చారు."ఐదేళ్ల పాటు పోరాడిన తర్వాత ఆయన (మోడీ) సంగతేంటో నాకు అర్థమైంది, ఆయనో పిరికిపంద. ఎవరైనా ఆయన ఎదురుగా వచ్చి నిలబడితే, ఆయన పారిపోతారు అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని రాహుల్ గాంధీ ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

విజయక్రాంతి, హైదరాబాద్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతాదళాలకు, మావోయిస్టులకు జరిగిన భీకరపోరులో మావోయిస్టులకు గట్టి దెబ్బ తగిలింది. ఈ సంఘటన జరిగిన ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అబూజ్మడ్ ప్రాంతంలోని ఇంద్రావతి నది సమీపంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. డీఆర్జీ, ఎస్టీఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఎన్ కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఎన్ కౌంటర్ బీజాపూర్ ఎస్పీ మోహిత్ గార్గ్ ధ్రువీకరించారు. ఘటనాస్థలం నుంచి 11 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న మావోయిస్టుల కోసం బలగాలు గాలిస్తున్నాయి. బీజాపూర్ జిల్లా ఎస్పీ మోహిత్ గార్గ్ మాట్లాడుతూ బైరాన్ ఘడ్ ప్రాంతంలో ఎస్టీఎఫ్, డీఆర్జీ సంయుక్త బలగాలు కూంబింగ్ చేపట్టాయని తెలిపారు. ఇంతలోనే మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని, ఈ ఎన్ కౌంటర్ లో భద్రతా బలగాల తరఫున ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని ఆయన తెలిపారు. భైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు భద్రతాదళాలకు సమాచారం అందింది. దీంతో ఇంద్రావతి నది సమీపంలోని అబూజ్మడ్ ప్రాంతంలో డీఆర్జీ, ఎస్టీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో జవాన్లపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ప్రస్తుతం కాల్పులు కొనసాగుతున్నాయి. చనిపోయిన మావోయిస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఫుల్ జోష్

- పైలట్‌గా 6 జిల్లాలు ఎంపిక
- వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంచేందుకు కృషి
- రైతులకు లాభాలపై ఫోకస్
- జూన్ నుంచి అమలుకు శ్రీకారం
- ప్రత్యేక దృష్టి సారించిన సీఎం కేసీఆర్

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తులకు భారీగా లాభాలు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. పండించిన పంటకు విలువను పెంచేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఆహార శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఈ కేంద్రాలు రైతులు పండించిన పంటకు విలువను పెంచి రైతుల భాగస్వామ్యంతోనే మార్కెట్‌కు తరలించేందుకు ఏర్పాటు చేయనున్నది. దీంట్లో భాగంగానే సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే రాష్ట్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా వీటి బాధ్యతను గ్రామీణాభివృద్ధిశాఖకు అప్పగించారు. వ్యవసాయశాఖ సమన్వయంతో గ్రామీణాభివృద్ధిశాఖ ఆహార శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. దీనిపై అయా శాఖల అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, భద్రాది కొత్తగూడెం, వనపర్తి, జనగామ్, నల్గొండ, కామారెడ్డి జిల్లాల్లో పైలట్‌గా ఆహారశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. దీంట్లో భాగంగానే గురువారం అయా జిల్లాల డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లు, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లకు సెర్ప్ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారధి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆహార శుద్ధి కేంద్రాలపై వివరించారు. ఈ కేంద్రాలను రాబోయే జూన్ నాటికి అయా జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు తెలిసింది.

రాష్ట్రంలో ఆహార శుద్ధి కేంద్రాలపై ప్రత్యేక నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నారు. ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా అమలు చేసేందుకు సన్నద్ధం చేస్తున్నారు. వీటిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిసింది. అయా జిల్లాల్లో డిమాండ్‌లో ఉన్న పంట ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లాల్లో పసుపు పంటకు డిమాండ్ ఉంది. ఆ ప్రాంతంలో పసుపు పంటకు సంబంధించిన శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇదే పద్ధతిలో జిల్లాలన్నింటిలో అయా ప్రాంతాల్లో డిమాండ్ ఉన్న పంటలకు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల రైతులు పండించిన పంటకు లాభాలతో పాటు ఈ యూనిట్ల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. అంతేకాకుండా అయా గ్రామాల్లోని వనరులను అదే గ్రామంలోని ప్రజలు వినియోగించుకునేందుకు అవకాశముంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కేంద్రాలు విజయవంతమైతే ఆహార కొరతను చాలా వరకూ నివారించవచ్చునని ప్రభుత్వం యోచిస్తుంది. దీనిపై ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డెక్కిన పసుపు, ఎర్రజొన్న రైతులు



- మద్దతు ధర పెంచాలని డిమాండ్

విజయక్రాంతి, నిజామాబాద్: పసుపు, ఎర్రజొన్నలకు మద్దతు ధర పెంచాలని కోరుతూ నిజామాబాద్ జిల్లాలో రైతులు రోడ్డెక్కారు. గురువారం జిల్లాలోని పసుపు, ఎర్రజొన్న రైతులు చలో ఆర్మూర్ చేపట్టారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు చెందిన సుమారు వంద గ్రామాల నుంచి వేలాదిగా రైతులు ఆర్మూర్‌లోని మామిడిపల్లి చౌరస్తాకు చేరుకున్నారు. మామామిపల్లి చౌరస్తాపై రహదారిపై ధర్నాతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రహదారిపై దాదాపుగా నాలుగు గంటల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నిర్మల్, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. పసుపు క్వింటాలు రూ.15 వేలు, ఎర్రొజొన్న క్వింటాలు రూ.3,500 మద్దతు ధర కల్పించాలని కోరుతూ రైతులు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. మద్దతు ధరపై ప్రభుత్వం ప్రకటించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తేల్చిచెప్పడంతో అధికారులు ఇబ్బందికి గురయ్యారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని కోరారు. పసుపు సాగు చేసేందుకు ఎకరాకు లక్షకుపైగా ఖర్చవుతుండగా కనీసం పెట్టుబడి రాని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో పసుపు రూ.4 వేలకు కింటాలు మించడం లేదని గిట్టుబాటు కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఉద్రిత్తంగా మారకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. గతంలో జరిగిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందస్తు చర్యలను తీసుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తలు తలెత్తకుండా సంమయనంతో వ్యవహరించారు.

10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించాలి: జి. కిషన్‌రెడ్డి

విజయక్రాంతి, అంబర్‌పేట్: విద్యార్థులు వచ్చే 10వ తరగతిలో ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను చదవడం వల్ల 10కి 10శాతం ఉత్తీర్ణత పొందుతారని అంబర్‌పేట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం అంబర్‌పేట్, నల్లకుంట డివిజన్‌లోని ప్రైవేటు స్కూల్లో ఆయన ప్రధాని నరేంద్రమోడి రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగభూషణం, భీక్షపతి, కృష్ణముదిరాజ్, యాదగిరి, పట్టి అనీల్, మైలారం రాజు, నవీన్‌రెడ్డి, ఆయోధ్య రాములు, ఎండి అతీక్, ఈశ్వర్, తిరుపతి, అండాళ్ళమ్మ, మహేష్, ఎస్ఎస్‌రెడ్డి లు పాల్గొన్నారు.

ఓయూలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- ఛీఫ్ వార్డెన్‌కు విద్యార్థుల వినతి
- వారం రోజుల్లో పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

విజయక్రాంతి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ విజృంభణ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యార్థులు ఛీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ హరి సింగ్ నాయక్‌కు గురువారం విద్యార్థులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సంద ర్భంగా పీడీఎస్‌యూ విజృంభణ నాయకులు ఆనంద్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో కనీస వసతి, సదుపాయాలు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ హాస్టల్ సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతి సౌకర్యం లేక హాస్టళ్లలో ఇరుకు గదుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. వసతి గృహాల్లో స్టడీ టేబుల్స్, సరియైన త్రాగునీరు, బాత్రూమ్‌లలో పరిశుభ్రతలేక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ కాంపౌండ్స్‌లలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, మూగ జీవులు హాస్టళ్లలోకి వస్తున్నాయని అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. హాస్టళ్లలో భోజనం నాణ్యత కూడా తగ్గిందని ఆనంద్ వెల్లడించారు. అంతేకాకుండా ఇటీవల జరుగుతున్న ఘటనల కారణంగా మహిళా హాస్టల్ వద్ద భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో సరైన వస తి, సదుపాయాలు సమస్యలు వారం రోజుల్లోగా పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఆనంద్, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు షారుక్, రవితేజ, అమర్, రాజులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

విజయక్రాంతి, మిర్యాలగూడ: ఈ నెల 15 నుంచి 18 వరకూ కేరళలోని కొచ్చిన్‌లో జరిగే ఎంసీపీఐయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి వస్కుల మట్టయ్య కోరారు. గురువారం స్థానిక సుందరయ్య విగ్రహం వద్ద మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకొచ్చాక పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ పరం అవుతున్నాయని అన్నారు. బహుళజాతి కంపెనీలకు రాయితీలిస్తూ పేద ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపి, బాబురావు, సైదమ్మ, జ్యోతి, భరత్, కాశీ, కిరణ్, చంద్రశేఖర్, మోహన్‌నాయక్, శివనాయక్, హాతీరాం నాయక్, సురేష్, సతీష్, ముత్తయ్య పాల్గొన్నారు.

శంకర్‌నాయక్ నియామకం పట్ల హర్షం

విజయక్రాంతి, మిర్యాలగూడ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను నియమిస్తూ టీపీసీసీ ఉత్తర్వులు జారీ చేయడం కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్‌చౌక్ వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. శంకర్‌నాయక్ నాయకత్వంలో పార్టీ బలోపేతమౌతుందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఆరిఫ్, మెరుగు శ్రీను, చంద్రశేఖర్, చిరంజీవి, సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణచారి, పర్వేజ్, సిద్ధునాయక్, మంగ్యానాయక్, జాన్‌ఖాన్, జమాలుద్దీన్, శ్రవణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సాహిత్య పాఠశాలను విజయవంతం చేయాలి

విజయక్రాంతి, మిర్యాలగూడ: విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నల్లగొండలో జరిగే సాహిత్య పాఠశాలను విజయవంతం చేయాలని విరసం జిల్లా కన్వీనర్ వెంకన్న కోరారు. గురువారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండలోని ఎస్‌డీఆర్ ఫంక్షన్‌హాల్‌లో పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు సాహిత్యానికి, పోరాటతత్వానికి మట్టి వాసనల పరిమళాన్ని, ప్రజా జానపద ప్రత్యామ్నాయాన్ని అందించిన జిల్లా పాత్ర విలువైందన్నారు. ప్రజా పోరాటాల చైతన్యంతో పోరాడతామన్నారు. . రాష్ట్రస్థాయి సాహిత్య పాఠశాలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ, నాళ్ల అంజయ్య పాల్గొన్నారు.

మధులికకు రక్తదానం చేయడానికి

- దాతలు ముందుకు రావాలి

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రేమోన్మాది చేతిలో తీవ్రంగా గాయపడిన మధులిక యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ మధులికకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఇంకా రక్తాన్ని ఎక్కిస్తూనే ఉన్నామన్నారు. ఇంకా రక్తం అవసరం ఉందని.. ఏ గ్రూప్ రక్తం వారైనా సరే.. రక్తదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు.మధులిక పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, నిన్నటితో పోలిస్తే కొంత మెరుగ్గా ఉన్న ఇంకా ఆందోళనకరంగానే ఉందని మరో 24 గంటలు దాటితే కానీ ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు. వెంటిలేట్పనే ఉండడం వల్ల ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తిగా చెప్పలేమన్నారు. బీపీని నిలకడగా తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశామని, అవసరమైన సర్జరీలు చేయాల్సి ఉందన్నారు. దాడిలో మెదడుకు తీవ్ర గాయమైందని ఎమ్ఆర్ఐ స్కాన్ ద్వారా ఆ విషయం బయటపడిందన్నారు. బ్రెయిన్ సర్జరీ చేయాల్సి ఉందని, దాడికి వినియోగించిన కత్తి తుప్పు పట్టి ఉండటంవల్ల ఆమె శరీరంలో తీవ్ర ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. రిపోర్టులూ నార్మల్గా ఉన్నట్లు వస్తే ఆమెకు అవసరమైన సర్జరీలు చేస్తామని డాక్టర్లు పేర్కొన్నారు.

అడుగంటుతున్న సింగూరు

- సింగూరు సామర్థ్యం 30 టీఎంసీలు
- మిగిలిన జలాలు 1.784 టీఎంసీలు
- నీటి పొదుపుపై అధికారుల సమాలోచనలు
- భగీరథకు రోజు 100 క్యూసెక్కులు
- సగానికి తగ్గించుకుంటే వేసవిలో సేఫ్



విజయక్రాంతి, సంగారెడ్డి: వేసవి సమీపిస్తుంది. తాగునీటి ఎద్దడి ముంచుకొస్తుంది. ఉమ్మడి జిల్లా మెదక్‌తో పాటు పొరుగు ఉమ్మడి జిల్లా నిజామాబాద్, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దాహం తీరుస్తున్న సింగూరు నీటి మట్టం క్రమంగా తగ్గుతూ కలవరపెడుతుంది. అడుగంటుతున్న సింగూరు జలాశయం తీరు ప్రజలు, అధికారుల్లో ఆందోళన పెంచుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న పద్ధతినే కొనసాగిస్తే ఏప్రిల్ మొదటి వారంలోనే పూర్తిగా ఎండిపోయే ప్రమాదకర పరిస్థితి కనిపిస్తుంది. దీంతో నడి వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడాల్సి రావచ్చు. అంత జఠిల సమస్య ఎదురవకుండా ముందు జాగ్రత్తలు అధికారులు తగిన చర్యలు తీసుకోనున్నారు. ఉన్న కాస్త జలాలను పొదుపుగా వాడుకొనే అంశమై దృష్టి సారించారు. మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మహానగర అవసరాలకు నీటిని తీసుకెళ్లకుండా చూసేలా ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. మరో వైపు ఉమ్మడి జిల్లా సంగారెడ్డి, మెదక్‌తో పాటు పొరుగు జిల్లా అయిన కామారెడ్డిలోని అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా ప్రతి రోజు అందిస్తున్న నీటి పరిణామాన్ని తగ్గించి ఇచ్చే అంశమై సమాలోచనలు చేస్తున్నారు. ఇందు కోసం ఫిబ్రవరి 2 శనివారం రోజున సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశమై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

దినచర్యగా మిషన్ భగీరథకు 100 క్యూసెక్కులు

సింగూరు జలాశయం పూర్తి సామర్థ్యం 29.91 టీఎంసీలు, అందులో ప్రస్తుతం కేవలం 1.784 టీఎంసీల మేర మాత్రమే నీరుంది. అందులో నుంచే ప్రతి రోజు 100 క్యూసెక్కులను మిషన్ భగీరథ పథకంలో భాగంగా వాడేస్తున్నారు. నిత్యం 35 క్యూసెక్కుల మేర ఆవిరి నష్టాలు ఉంటాయి. ఓడీఎఫ్, బీడీఎల్‌ల కోసం ఇక్కడి నుంచి రోజు 30 క్యూసెక్కులు తీసుకెలుతున్నారు. దిగువన ఉన్న మంజీరా బ్యారేజీలో ప్రస్తుతం 0.25టీఎంసీల నీళ్లున్నాయి. ఇక్కడి నుంచే సంగారెడ్డి పురపాలక సంఘంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గానికి నీళ్లందిస్తున్నారు. దీనికి తోడు నిత్యం 150ఎంఎల్‌డీ జలాలను హైదరాబాద్ మహానగర అవసరాల కోసం తరలిస్తున్నారు. ఇదే విధానం ఇలాగే కొనసాగితే అధికారుల అంచనా ప్రకారం ఏప్రిల్ మొదటి వారం వరకే సంగారెడ్డి, మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల వాసులకు తాగునీటిని సరఫరా చేయగలుగుతారు. వేసవి విజృంభిస్తున్న సమయంలోనే నీటికి కటకట ఏర్పడుతుంది. మండు వేసవిలో నీళ్ల కోసం తిప్పలు పడాల్సిన దుస్థితి తలెత్తుతుంది.

ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభం

సంగారెడ్డి, మెదక్ జిల్లాలలోని నియోజకవర్గాలతో పాటు కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గాలకు మంజీరా నది ఆధారంగానే మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సింగూరులో నీటిమట్టం 1.784 టీఎంసీలకు చేరడంతో మున్ముందు తాగునీటి కష్టాలు ఎదురవకుండా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికైతే ప్రతిరోజు వంద క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ కోసం తీసుకుంటున్నారు. ఇందులో సగం మేర పంపిణీని తగ్గించుకుంటే ఇబ్బందులను కొంతమేరకు ఎదుర్కొవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు విన్నవించారు. ఇప్పుడు తీసుకుంటున్నట్లుగా రోజు వంద క్యూసెక్కులను బదులుగా 50 క్యూసెక్కుల నీటిని మాత్రమే వాడుకుంటే జూన్ వరకు తాగునీటికి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదనేది వారి అంచనా. మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ నగర అవసరాలకు తీసుకెళ్లే నీటిని నిలిపి వేయాలని ఇప్పటికే మెదక్ జిల్లా పాలనాధికారి హన్మంతరావు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మరో రెండు మూడు రోజుల్లో ఈ తరలింపు ప్రక్రియ ఆగిపోనుందని సమాచారం.



ఎంపీ కవితకు కోల్‌సిటీ శ్రేణుల సత్కారం

విజయక్రాంతి, రామగుండం: ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాన్ని పొందిన నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను రామగుండం ప్రాంత టీఆర్ఎస్ శ్రేణులు గురువారం హైదరాబాద్‌లో సత్కరించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో కవితను కలిసి అభినందించారు. రాబోయే కాలంలో మరిన్ని పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఔన్నత్యాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందర్ వెంట టీఆర్ఎస్ నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెంట రాజేష్, దేవ రాజ్, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, అంబటి నరేశ్, అడ్డాల గట్టయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ పటిష్టతపై కాంగ్రెస్ నేతల సమావేశం

విజయక్రాంతి, రామగుండం: పార్టీ బలోపేతంతో రాబోయే ఎన్నికల్లో విజయవకాశాలు మెండుగా ఉంటాయని... కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి కార్యకర్తల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిష్టతకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పాటుపడాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి జరుపాలన్నారు. పార్టీ కోసం పాటుపడే వ్యక్తులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు బొంతల రాజేష్, బాబర్ సలీంపాషా, గుమ్మడి కుమారస్వామి, మహంకాళి స్వామి, తానిపర్తి గోపాల్‌రావు, దొంతుల లింగం, పెద్దెల్లి ప్రకాశ్, పీచర శ్రీనివాస్, దాసరి సావిత్రి, కొలిపాక మల్లయ్య, రవికుమార్, ముస్తాఫా, వాజిద్‌ఖాన్, విజయ, రమేశ్, యుగేందర్, మహేష్, ఫకృద్దీన్, పీక అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



వేగంగా దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేలుస్తాం

- సీపీ అంజనీ కుమార్



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్నారై చిగురుపాటి జయరాం హత్య కేసు తెలంగాణకు బదిలీ అయ్యిందని హైదరాబాద్ నగర కమిషనర్ అంజనీ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు కృష్ణా జిల్లా ఎస్పీ స్పెషల్ మెసెంజర్ ద్వారా తమకు సమాచారం, కేసుకు చెందిన దస్తావేజులు చేరినట్లు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రభుత్వం తమకు న్యాయం చెయ్యలేదని, కాబట్టి తెలంగాణ ప్రభుత్వం నుంచి న్యాయం ఆశిస్తున్నానంటూ జయరాం సతీమణి పద్మశ్రీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె జూబ్లీహిల్స్ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ పోలీసులపై తనకు పూర్తి నమ్మకం ఉందని, కేసును తెలంగాణకు బదిలీ చేయాలని పద్మశ్రీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జయరాం హత్యకేసు తెలంగాణకు బదిలీ అయ్యింది. ఈ క్రమంలో శిఖా చౌదరే చేయించిందని జయరాం భార్య పద్మశ్రీ ఆరోపించారు. దాంతో తమపై జయరాం భార్య ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని సీపీ స్పష్టం చేశారు. కేసుపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో అన్ని కోణాల్లో పూర్తిస్థాయి విచారణ చేపడుతామన్నారు. బంజారాహిల్స్ ఏసీపీ ఆధ్వర్యంలో ఈ కేసు విచారణ జరుగుతుందని చెప్పారు. జయరాం హత్య కేసులో అరెస్టై రిమాండ్ లో ఉన్న ఇద్దరు నిందితులను కూడా విచారిస్తామని సీపీ స్పష్టం చేశారు. ఈ కేసులో ఇన్వాల్వ్ అయిన వారిలో ఎవరిని కూడా వదిలే ప్రసక్తే లేదన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి నిజాలను వెలుగుతీస్తామని సీపీ పేర్కొన్నారు.

ధూళి కణాలతో భాగ్యనగరం ఉక్కిరి బిక్కిరి

- వ్యాధులతో సతమతం

విజయక్రాంతి, హైదరాబాద్: అధ్వాన రోడ్లు బాగుపడితే మనం పీల్చే గాలి 'స్వచ్ఛం'గా మారుతుంది. రహదారులకు.. పీల్చే గాలికి సంబంధమేంటని సందేహంగా ఉందా.. కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనంలోనూ.. సూక్ష్మ ధూళి కణాలు 33 శాతం.. అతి సూక్ష్మ ధూళి కణాలు 11 శాతం రోడ్ల నుంచే వెలువడుతున్నట్లుగా తేలిందని పర్యావరణ నిపుణులు వివరిస్తున్నారు.

ఆ రెండే..!

వాయు కాలుష్యం కోరలు చాస్తోన్న మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్ ఉన్నట్లు పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వాహనాలు, రోడ్లు, చెత్తను కాల్చడం, నిర్మాణ పనులు తదితర కార్యకలాపాల వల్ల గాల్లోకి నిత్యం పీఎం 10, పీఎం 2.5, నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్మోనాక్సైడ్ తదితర 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతున్నాయి. స్వచ్ఛమైన గాలిని కలుషితం చేసే పీఎం 10, కంటికి కనిపించకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరి అక్కడే స్థిరపడి లేనిపోని అనారోగ్య సమస్యలకు కారణమయ్యే పీఎం 2.5 తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. గతేడాది 20 ప్రాంతాల్లో ఎలా ఉందని లెక్కలు తీస్తే అన్ని చోట్ల పీఎం 10 కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) నిర్దేశిత పరిమితుల్ని దాటింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 12 చోట్ల 100 మార్కును దాటిందంటే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నాలుగేళ్ల వ్యవధిలోనే 11 మైక్రో గ్రాములు పెరిగింది. 2016తో పోలిస్తే 2017లో పీఎం 2.5 తీవ్రత భారీగా పెరిగినట్లుగా పీసీబీ లెక్క తేల్చింది. ఒక్క చోట మాత్రమే సీపీసీబీ నిర్దేశిత పరిమితుల్ని దాచలేదు. మిగిలిన చోట్ల దుమ్ము దులిపింది.



2020 నాటికి..!

పీఎం 10, పీఎం 2.5 తీవ్రత 2020 నాటికి ఎలా ఉండే అవకాశముందో ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఈపీటీఆర్ఐ) ఓ అధ్యయనం చేసింది. ఆ గణాంకాలను పరిశీలిస్తే గుండె గుభేల్మనడం ఖాయం. 2006లో పీఎం 10... 29,599 టన్నులు వెలువడగా.. 2020 నాటికి అది 43,550 టన్నులకు చేరుకోనుంది. ఇక పీఎం 2.5 విషయానికొస్తే 2006లో 11,380 టన్నులు వెలువడగా.. 2020 నాటికి 18,412 టన్నులకు చేరుకునే అవకాశముందని అంచనా వేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్వో) అధ్యయనంలో దక్షిణ భారతదేశంలో అత్యధికంగా పీఎం 2.5 నమోదవుతున్న నగరాల్లో బెంగళూరు(61 మైక్రోగ్రాములు) తర్వాత హైదరాబాదే(59 మైక్రో గ్రాములు) ఉంది.

అలా చేస్తే..!

కాలుష్య ఉద్గారాల్లో అధిక వాటా వాహనాలది.. ఆ తర్వాతి స్థానం రోడ్లదే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే నగరంలో వాహనాల సంఖ్య 50 లక్షల మార్కును దాటేసింది. అయిదారేళ్ల వ్యవధిలో వ్యక్తిగత వాహనాల వినియోగం భారీగా పెరిగింది. మెట్రో నగరాల్లో 100కు 60 మంది ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని.. మన దగ్గర మాత్రం ఆ సంఖ్య 40 మాత్రమే ఉందంటూ నిపుణులు వివరిస్తున్నారు. అలా అని వాహనాలు రోడ్డెక్కకుండా ఆపేస్తే అభివృద్ధి ఆగిపోతుందని స్పష్టం చేస్తున్నారు. కాలుష్యం తగ్గేందుకు ప్రత్యామ్నాయ చర్యలను అన్వేషించాలని సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే అధ్వాన రోడ్లపై నజర్ పెట్టాలని సూచిస్తున్నారు. రోడ్లు బాగుపడితే 'దుమ్ము' లేవదు. పైగా.. ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. వేగం పెరుగుతుంది. ఫలితంగా గాల్లోకి వెలువడే పీఎం 10, పీఎం 2.5 తీవ్రత కొంత వరకు తగ్గుతుందని చెబుతున్నారు.



ప్రియాంక గాంధీపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టి, మహిళలు రాజకీయాల్లోకి రాకుండా భయపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద ఆధ్వర్యంలో డీజీపీ మహేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మహిళా సభ్యులు



అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు ఇస్తాం

- దళారులను నమ్మవద్దు: ఎమ్మెల్యే గాంధీ

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికి ఇళ్ళు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని, అందుకోసం నియోజకరవ్గంలో మూడు చోట్ల డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్ల నిర్మిస్తున్నామని ఈ ఇళ్ల నిజమైన అర్హులకు అందేలా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. నియోజకరవ్గం లోని గచ్చిబౌలి గుల్‌మోహర్ పూర్క కాలనీలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను గురువారం ఆయన అధికారులు, స్థానిక కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ కాంట్రక్టర్‌కు ఇచ్చిన గడువులోగా పనులు పూర్తిచేసి అప్పగించాలని పూర్తి అయిన తరువాత ప్రత్యేకంగా సర్వే చేసి నిజమైన అర్హులకే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకర్గంలో నిర్మిస్తున్న మూడు ప్రాంతాల్లోను గచ్చిబౌలి కేశవనగర్, హఫీజ్‌పేటలో నిర్మాణ పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయని ఆ పనులు కూడా కాంట్రాక్టర్లు వేగవంతంచేసి ప్రజలు ఎవరికి ఇళ్ళకోసం దబ్బులు కానీ, దరఖాస్తులు కానీ ఇవ్వవద్దని నేరుగా కార్పొరేటర్ల ద్వారానే ఇవ్వడం జరుగుతుందని వివరించారు. మధ్యదళారులను నమ్మవద్దని అధికారులులను సంప్రదిస్తే మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఉప్పట పాటి శ్రీకాంత్, ప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



విజయక్రాంతి, మెహిదిపట్నం: ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని వెస్ట్ సెంట్రల్‌జోన్ ఏసీపీ రామలింగరాజు తెలిపారు. 30 వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మెహిదిపట్నంలోని ఎంపీ గార్డెన్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లెసైన్స్ లేకుండా వాహనం నడుపరాదనీ, డ్రంకన్ డ్రైవ్‌లో, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే.. పట్టుబడితే వారి వివరాలు ఆధార్ కార్డ్‌తో అనుసంధానించబడి ఉంటాయని దీని ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న వారికీ, పాస్‌పోర్టు జారీలో పోలీసుల విచారణలో బయటపడతాయని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, గోషామహల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వెస్ట్ సెంట్రల్ జోన్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు శేఖర్, అయిలయ్య, కానిస్టేబుల్‌లతో పాటు స్టేషన్ సిబ్బంది స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలను చెల్లించాలి



మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి

విజయక్రాంతి, అంబర్‌పేట్: బాగ్‌అంబర్‌పేట్ డివిజన్‌లోని సత్యసాయి పొదుపు గ్రూప్ మహిళా సంఘంకు మంజూరైన 2లక్షల రూపాయల రుణమును అంబర్‌పేట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి సంఘం సభ్యులకు అందించారు. భువనేశ్వరీ పొదుపు సంఘం, శ్రీలక్ష్మీ పొదుపు సంఘం, శ్రీరేణుక మహిళా పొదుపు సంఘం మహిళాల గ్రూపులకు సమావేశం రిజిస్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా సంఘం వారు క్రమం తప్పక సరియైన తేదిలోగా ఋణం డబ్బులను బ్యాంకులలో చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు చుక్కజగన్, సి.కృష్ణగౌడ్, పి.గోవర్ధన్‌రెడ్డి, ఎన్.సాంబశివగౌడ్, ఈ.అరేందర్, మిర్యాల శ్రీనివాస్, ఈ.ఆజయ్‌కుమార్, ఈ.బాలకృష్ణ, డి.శాంతమ్మ, ఏ.వాణి, కట్టమ్మ, లక్ష్మీ, నిర్మల, చంద్రమ్మ, సరళ, పద్మ, రవిందర్, సునిత తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలకు స్వేచ్ఛ

ఈ జైలుకు గోడలు ఉండవు. గేటు వద్ద భద్రతా గార్డులు లేరు. రోజూ జైల్లోంచి బయటకు వెళ్లి, పనిచేసి సంపాదించుకొనేందుకు ఖైదీలను అనుమతిస్తారు. దీనిని ప్రోత్సహిస్తారు కూడా. 1950ల నుంచి ఈ సాంగనైర్ జైలు ఉంది. ఇందులో 450 మంది ఖైదీలు ఉన్నారు. రాజస్థాన్‌లో ఇలాంటి జైళ్లు దాదాపు 30 ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఓపెన్ జైళ్లు ఉండేలా నిబంధనలు తీసుకురావాలంటూ స్మితా చక్రవర్తి అనే మహిళ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. న్యాయ స్థానం స్పందించి సాంగనర్ తరహా జైళ్లు ఎక్కువ చోట్ల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్రాలకు నిర్దేశించింది. రాజస్థాన్‌లో జైళ్ల గౌరవ కమిషనర్‌గా స్మిత వ్యవహరిస్తున్నారు. దేశవ్యాప్తంగా మెరుగైన శిక్షా విధానం కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఇటీవలే అగామీ ప్రైజ్ లభించింది. 2015 చివరి నాటికి భారత్‌లో 4,19,623 మంది ఖైదీలు ఉండగా, వీరిలో కేవలం 3,789 మంది (0.9 శాతం) మాత్రమే ఓపెన్ జైళ్లలో ఉన్నారు. దేశంలోని మొత్తం ఓపెన్ జైళ్లలో మూడింట రెండొంతులు జైళ్లు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలోనే ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో 42 ఓపెన్ జైళ్లు ఉండగా మరో 15 రాష్ట్రాల్లో 21 ఓపెన్ జైళ్లు ఉన్నాయి. శిక్షాకాలంలో మూడింట కనీసం రెండొంతుల కాలాన్ని సాధారణ (క్లోజ్డ్) జైలులో గడిపిన ఖైదీలనే సాంగనైర్ జైలుకు పంపుతారు. సాధారణ జైళ్లతో పోలిస్తే ఇక్కడ ఎంతో స్వేచ్ఛ ఉంటుందని ఖైదీలు చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఈ జైలును వీడి వెళ్లేందుకు ఖైదీలు నిరాకరిస్తుంటారు. గతంలో ఇలా మొండికేసిన కొందరు ఖైదీలను అధికార యంత్రాంగం బలవంతంగా ఖాళీ చేయించాల్సి వచ్చింది. ఈ జైల్లో ఉన్న సమయంలో దగ్గర్లోనే స్థిరమైన ఉపాధిని పొందడం, చుట్టుపక్కల్లోని పాఠశాలల్లో పిల్లలు చదువుకొంటుండటం లాంటి కారణాల వల్ల దీనిని విడిచిపెట్టేందుకు కొందరు మొగ్గుచూపరు. సాంగనర్ జైల్లో జీవితం దాదాపు సాధారణ జీవితం లాగే ఉంటుందని ఇక్కడి ఖైదీలు చెప్పారు. ప్రతి ఖైదీకి సాంగనర్లో ప్రభుత్వం నిర్మించిన ఇల్లును కేటాయిస్తారు. రోజూ ఖైదీల్లో అత్యధికులు జైలు ప్రాంగణాన్ని వీడి బయటకు వెళ్లి పొట్టపోసుకుంటారు. బయట భద్రతా గార్డులుగా, కర్మాగార కార్మికులుగా, రోజు కూలీలుగా పనిచేసేవారిలో హత్యానేరానికి శిక్ష పడ్డవారు కూడా ఉన్నారు. రోజూ సాయంత్రం జైల్లో హాజరు వేస్తారు. ఆ సమయానికి అందరూ అక్కడ ఉండాలి.

మన దౌత్యవేత్తల తీరు అభినందనీయం

భారత దౌత్యవేత్తలు తమ సర్వ శక్తులు, సామర్థ్యాలు ఒడ్డి మరో సారి జమ్మూ కశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసేందుకు పన్నిన పాకిస్తాన్ పన్నాగాన్ని భగ్నం చేయగలిగారు. ఇది అభినందనీయం. విదేశ వ్యవహారాల విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించే తత్వానికి తిలోదకాలు పలికి, మన అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించారు. ఈ నవ్య క్రియాశీలతను ఖచ్చితంగా ప్రశంసించాల్సిందే.

ఫిబ్రవరి 5న పాకిస్తాన్ లండన్‌లో అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసింది. పాక్ విదేశ వ్యవహారాల మంత్రి షా మహ్మద్ ఖురేషీ ఇందులో ముఖ్యవక్త. ఈ కార్యక్రమం ఏకంగా బ్రిటిష్ పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసింది పాకిస్తాన్. తన దౌత్య చాతుర్యాన్ని ఉపయోగించి, పాక్ అనుకూల లాబీలను ఉసిగొల్పి పాకిస్తాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ కార్యక్రమంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొనేలా చేయాలని పాకిస్తాన్ పలు విధాలుగా ప్రయత్నించింది.

అలా చేస్తే అంతర్జాతీయంగా భారత వ్యతిరేక వాతావరణం నిర్మాణమౌతుంది. కశ్మీర్ సంఘీభావ పేరిట ఇలాంటి కార్యక్రమాలను ప్రపంచంలోని ప్రధాన రాజధానులన్నిటా జరపడం పాకిస్తాన్ చాలా కాలంగా చేస్తూ వస్తోంది. హక్కుల విషయంలో అత్యంత సంవేదనశీలంగా ఉండే పాశ్చాత్య లిబరల్ ప్రజాస్వామ్యాలను భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించేలా చేయడం కోసమే ఈ కశ్మీర్ సాలిడారిటీ డే ను పాకిస్తాన్ ప్రతి ఏటా నిర్వహిస్తుంది.

కానీ భారత దౌత్య విభాగం అత్యంత కౌశల్యాన్ని ప్రదర్శించి పాక్ పన్నాగాలను వమ్ము చేయగలిగింది. ప్రధాని నరేంద్ర మోదీ గత అయిదేళ్లుగా అనుసరిస్తున్న క్రియాశీలక విదేశాంగ విధానం వల్లే ఇది సాధ్యమైంది. భారత దౌత్యాధికారులు బ్రిటిష్ ప్రభుత్వంతో దౌత్యపరమైన చర్చల ద్వారా, భారత్ అభిప్రాయాలను నిర్మొహమాటంగా కుండ బద్దలుగొట్టినట్టు చెప్పారు. యూకే లోని ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల భారత్ తన తీవ్ర అభ్యంతరాలను స్పష్టంగా తెలియచేసింది. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టింది. షా మహ్మద్ ఖురేషీ అధికారిక హోదాలో లండన్ కార్యక్రమంలో పాల్గొనడం లేదని, ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్‌తో ప్రభుత్వానికి సంబంధం లేదని తేటతెల్లం చేసింది. బ్రిటిష్ ప్రభుత్వంతో మన చర్చల ఫలితంగా పార్లమెంటరీ గ్రూప్ కీలక సభ్యులెవరూ కార్యక్రమానికి హాజరు కాలేదు. బ్రిటిష్ ప్రభుత్వం తరపున కూడా ఎవరూ సభలో పాల్గొనలేదు. భారత వ్యతిరేక పోకడలకు పర్యాయపదాలుగా వ్యవహరించే పాక్ మూలానికి చెందిన రాజకీయనాయకులైన నాజిర్ అహ్మద్, సయీదా వార్సీలు మాత్రమే కార్యక్రమాన్ని సంబోధించారు. కార్యక్రమం పేలవంగా సాగింది.

మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరువాత విదేశాల్లో భారత వ్యతిరేక ప్రచారాన్ని, వేర్పాటువాద, విచ్ఛిన వాద, ఉగ్రవాద శక్తుల ఆటలను సమర్థవంతంగా అడ్డుకోవడం జరుగుతోంది. మన దౌత్యాధికారులు ఆయా దేశాలలో జరిగే భారత వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కొని, అక్కడి ప్రభుత్వాలకు వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఫిబ్రవరి5 నాటి పాకిస్తాన్ అనుకూల సభ చప్పబడిపోవడానికి కూడా ఈ సఫల దౌత్యనీతే కారణం.

పాకిస్తాన్ మొదటి నుంచీ జమ్మూ కశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసేందుకు కుటిల యత్నాలు చేస్తూనే వస్తోంది. మొదట్లో పాకిస్తాన్ జమ్మూ కశ్మీర్ తమదేనని అంతర్జాతీయ వేదికలపై వాదించింది. కానీ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఏప్రిల్ 21, 1948 నాడు 286 నంబర్ సమావేశంలో ఆమోదించిన 47వ తీర్మానం పాకిస్తాన్ నడ్డి విరిచింది. ముందు పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్ నుంచి వైదొలగాలని, శాంతియుత పరిస్థితులు నెలకొన్న తరువాత భారత్ భద్రతా దళాల ఆజమాయిషీలో జమ్మూ కశ్మీర్ లో ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని ఐరాస తీర్మానం చెప్పింది. దాంతో కశ్మీర్ నుంచి వైదొలగడం ఇష్టం లేని పాకిస్తాన్ అప్పట్నుంచీ తన కబ్జాలో ఉన్న జమ్మూ కశ్మీర్ ను ఆజాద్ కశ్మీర్ అని సంబోధించనారంభించింది. అదొక స్వతంత్ర భూమి అని వాదించడం మొదలు పెట్టింది. అప్పట్నుంచీ కశ్మీర్‌లోకి ప్రవేశించిన జెహాదీ చొరబాటుదారులను స్వాతంత్ర్య సమరయోధులుగా, కశ్మీరీ వేర్పాటువాద హింసను స్వాతంత్ర్యోద్యమంగా అంతర్జాతీయ సముదాయాన్ని నమ్మ బలికే ప్రయత్నం చేసింది. ఇప్పుడు కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన గురించి మాట్లాడుతుందే తప్ప కశ్మీర్ తమకే చెందాలని వాదించలేకపోతోంది. నిజానికి పాకిస్తాన్‌కు జమ్మూ కశ్మీర్‌పై ఎలాంటి హక్కూ లేదని ఇప్పుడు అంతర్జాతీయ సముదాయం గుర్తిస్తోంది. నెమ్మదినెమ్మదిగా అంతర్జాతీయ సంస్థలు ఈ విషయంలో అవగాహనతో కూడిన వస్తునిష్ట వైఖరిని అవలంబిస్తున్నాయి. దీంతో మింగుడుపడని పాకిస్తాన్ ఇలా వివిధ వేదికలను ఉపయోగించుకుని, మోసపూరిత మార్గాల ద్వారా కశ్మీర్ గురించి అనుమానాలు, అపోహలు కలిగేలా ప్రయత్నాలు సాగిస్తోంది.

గతంలో ఇలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకునేందుకు మన దౌత్యాధికారులు పెద్దగా ప్రయత్నించేవారు కాదు. తల దాకా మునిగిన తరువాత కానీ దిద్దుబాటు చర్యలు చేపట్టేవారు కారు. మోదీ ప్రభుత్వం మాత్రం గతానికి భిన్నంగా పాక్ అంతర్జాతీయ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఆట కట్టిస్తోంది. దీంతో పాకిస్తాన్ కు అంతర్జాతీయంగా చుక్కెదురు అవుతోంది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో అభినందించాల్సిందే.

వైద్య సేవలు అభివృద్ధి చేయండి

గోలేటి నుంచి ఇల్లందు వరకు వైద్య పరంగా అభివృద్ధి చేయడమే కాదు, సింగరేణిలో మెడికల్ కాలేజీ పెట్టి కార్పోరేట్ వైద్యం అందిస్తామని స్వయంగా సీఎం కేసీఆర్‌గారు చెప్పారు. సింగరేణి హాస్పిటల్‌లో తాను బి.పి పరీక్ష చేయించుకుంటానని కూడా చెప్పారు. కాని ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చెప్పినట్లు ఏమి అభివృద్ధి జరగక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

అయితే వార్డులను ఏసీలతో అభివృద్ధి చేసి ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేశారు. ఆధునిక స్కానింగ్ మిషిన్లను నిర్వహించే ఆపరేటర్లను , తగిన వైద్యులను నియమించలేదు. అనారోగ్యంతో హాస్పటల్ కు పోతే డ్యూటీ డాక్టర్ పేషెంట్ విషమ పరిస్థితి చూసి స్కానింగ్ రాస్తే హాస్పిటల్ లో ఆపరేటర్ ఉంటే స్కానింగ్ చేస్తున్నాడు. ఆపరేటర్ లేకపోతే ప్రైవేటుగా స్కానింగ్ తీయించుకుని సొంత డబ్బులను ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. స్కానింగ్ తీసినప్పటికి రోగ నిర్ధారణ చేసే రేడియాలజిస్ట్ లేక ఆ రిపోర్టులను ప్రైవేటు వైద్యుల దగ్గరకు పంపుతున్నారు. దీంతో స్కానింగ్ రిపోర్ట్ వచ్చే వరకు రెండు మూడు రోజులవుతుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదిలా ఉండగా థైరాయిడ్, డయాబిటీష్ , బి.పి లాంటి దీర్ఘకాల వ్యాధులకు జీవిత కాలం మందులు వాడాల్సిందే . కాని చాలాసార్లు దీర్ఘకాల వ్యాధులకు కూడ మందుల కొరతతో సింగరేణి కార్మికులు ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. సింగరేణి ఉన్నతాధికారులు దృషిపెట్టి అవసరమైన వైద్యులను నియమించటంతోపాటు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.

–సి. రాజేశం, జమ్మికుంట

నాణ్యతకే అగ్రతాంబూలం ఇవ్వాలి



శ్రేష్ఠతా సోపానపథం

1 – నాణ్యత

రాశికన్నా వాశిమిన్న, సంపూర్ణ ఫలప్రాప్తికి ప్రమాణం పరిమాణం రెండూ అవశ్యమే అయినా, మొదట నాణ్యతకే అగ్రతాంబూలం ఇవ్వాలి.

'ఇది ఇంకా బాగా చేయలేమా?' అని నీ వాళ్ళను ప్రశ్నించు.

ఒక కవితకు నాణ్యతను సమకూర్చేవి – మధురమైన భావం, దానికి సరితూగే పదవిన్యాసం, ఈ రెంటికి సమ ఉజ్జీయైన అలంకారాలే. ఒక ప్రసంగం / వ్యాసం / లేఖకు నాణ్యత చేకూర్చేవి వాటిలోని సందేశం, ప్రస్తావన, పరిసమాప్తి విధానాలే. అలాగే ఒక వస్తువు యొక్క ఉత్పత్తికి నాణ్యతను ఆపాదించేవి – నిర్ధారిత ప్రమాణాలకు సమ్మతమైన విధ్యుక్త కార్యనిర్వహణ సామర్థ్యం, దాని దారుఢ్యము, మన్నిక, సంతులమైన రూపు రేఖలు, ఇంపుసొంపులు ఇత్యాది విశేష గుణాలే.

వాశి లోపమైన రాశి కేవలం 'దిబ్బ' వంటిదే. నాణ్యత కొఱవైన 'ఉత్పత్తి' వ్యవసాయంలో పండేవి కలుపుమొక్కలే తప్ప, ధాన్యం కాదు. కాబట్టి నాణ్యతను నిర్వచించు, నిర్వహించు. నాణ్యతనే ఆశించు, అందించు, నాణ్యతనే పరీక్షించు, పరిరక్షించు.

1977కు పూర్వం నేను సైతం పరిమాణవాదినే. అయితే, నేను 1977 జర్మనీదేశం వెళ్ళటం జరిగింది. జర్మనులు శుద్ధ నాణ్యతా ఛాందసవాదులు, వారెప్పుడూ నాణ్యతాసిద్ధి కోసమే పరిశ్రమిస్తారు, పరితపిస్తారు.

అక్కడ వారు నాకిచ్చిన ప్రశిక్షణలో అధికభాగం ప్రమాణికాల, నాణ్యతల నిర్వహణే. (వాళ్ళు నన్ను అర్థం చేసుకొన్నట్టున్నారు.)

పరిమాణ సాధనలో ఒరిగిపడే లాభం స్వల్పకాలికమే. కాని, కాలక్రమాన ప్రమాణాలదే అంతిమ విజయమౌవుతుంది. కాబట్టి నాణ్యతనే స్వీకరించు. నాణ్యతనే సమర్పించు.

నాణ్యత ధృవీకరణకు ప్రమాణికాలు

1. ఉత్పాదన ప్రక్రియల సంవిధానాలు – ఆచరణ విధానాల అధ్యయనం.
2. అవశ్యమైన, ఆచరణయోగ్యమైన, ఆచరణసాధ్యమైన సహేతుకమైన ప్రమాణాల నిర్ధారణ.
3. ప్రక్రియల్లోనూ, రూపకల్పనలోనూ నాణ్యత సహజసిద్ధంగా ఉండేవిధంగా శ్రద్ధ, నాణ్యత అనేది వస్తువులకు పూసేదీ, అతికించేదీ కాదు. అది దానిలో సహజంగా రావాలి.
4. నాణ్యతాస్థాయి పరిశీలన – అంచనా.
5. సవరణలకు, సంస్కరణలకు, సంవర్ధనాలకు తగిన అవకాశం.
6. ఉత్పత్తులు, ఉద్దేశిత ప్రయోజనాలకు అనుగుణంగా సంపూర్ణంగా ఉండుటకు జాగ్రత్తలు.

నాణ్యతయే శ్రేష్ఠతకు సురక్షితమైన సులక్షణమైన మార్గం.



గట్టు నారాయణ (గురూజీ)

ఉమ్మడి ప్రాజెక్టుల్లో తెలంగాణాకు తీవ్ర అన్యాయం

(నిన్నటి తరువాయి)

ఈ ప్రాజెక్టులు పూర్తి ఉపయోగానికే రావాలంటే (1991 అంచనాల ప్రకారం) ఇంకా దాదాపు 11 వందల కోట్లు నిధులు సమకూర్చవలసి ఉంటుంది. అదే మాదిరిగా 20 సంవత్సరాల క్రింద చేపట్టి పూర్తి చేయని 13 మధ్యతరహా ప్రాజెక్టులపై 20 టి.యం.సి. నీరు వాడుకునే అవకాశం ఉండగా కేవలం 6 టి.యం.సి.ల నీరు మాత్రం ఉపయోగానికి వచ్చింది. వీటిపై ఇంకా 75 కోట్లు ఖర్చు చేస్తే తప్ప (1991 అంచనాల ప్రకారం) పూర్తి నీరు ఉపయోగానికి రాదు.

గత 15,20 సంవత్సరాలుగా తెలంగాణ లిస్టులో ఆరు పెద్ద తరహా ప్రాజెక్టులు చేపట్టినట్లు వాటిపైన పని కొనసాగుతున్నట్లు చూపిస్తున్నారు. వీటిలో మొదటిది నిజాంసాగర్ ప్రాజెక్టు. ఇది నిజాం కాలంలో 1926లో పూర్తి చేసినది. ఆంధ్రలో మిగతా అన్ని ప్రాజెక్టులు ఆధునీకరణ చేసినట్టే దీని ఆయకట్టు స్థిరీకరణకు 30 కోట్ల వ్యయంతో ఆధునీకరణ చేయాలని 5వ ప్రణాళికలో మొట్టమొదటిసారిగా చేర్చారు. 2 సంవత్సరాలలో పూర్తి చేయవలసిన ఈ పనిని కావాలని 15/20 సంవత్సరాలుగా కొనసాగించి పనులు జరుగుతున్న ప్రాజెక్టుల లిస్టు నుండి తొలగింపు కాకుండా చూస్తున్నారు. కృష్ణా, గోదావరి కె.సి.కెనాల్ వగైరా అన్ని సకాలంలో ఆధునీకరించబడుచున్నవి. ఇది (నిజాంసాగర్) ఒకటి మాత్రం ఎందుకో పూర్తికాకుండా లిస్టుకు అంటిపెట్టుకొని ఉన్నది. ఇక రెండవది సింగూర్. ఇది రాష్ట్ర ఉమ్మడి అవసరాలయి నటువంటి త్రాగునీరుకు ఉపయోగించేది. దీని క్రింద 2 టి.యం.సి.ల నీరు రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఒక ఎకరం కూడా సాగుబాటు చేయని ఈ ప్రాజెక్టు తెలంగాణా నీరు పారుదల పెద్ద ప్రాజెక్టుల లిస్టులో చూపుతున్నారు.

తెలంగాణలో ప్రాముఖ్యత గల నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మాణానికి సాంకేతిక, ఆర్థిక మరియు పరిపాలనాపరమైన ఎన్నో కుంటిసాకులు చూపుతూ దశాబ్దాలుగా త్రొక్కి పెడుతున్నారు. 37 మధ్యతరహా ప్రాజెక్టులు, 9 పెద్ద తరహా ప్రాజెక్టులు, ఎన్నో ఎత్తిపోతల పథకాల్ని గత 20 సంవత్సరాలుగా ప్రతి ప్రణాళికలో చేర్చుతూ తెలంగాణా వారిని మభ్యపెట్టడానికి ఏటేటా రాష్ట్ర నీటి పారుదల వార్షిక బడ్జెట్‌లలో వాటి విషయం ప్రస్తావిస్తూ డబ్బు కేటాయించక, సాంకేతిక పరిపాలనా పరమైన అనుమతి ఇవ్వక త్రొక్కిపెడుతున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి 4,590 కోట్లు నిధులు అవసరం. రెండు మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాజెక్టులు ప్రారంభించిపూర్తి చేసినట్లయితే 1991 అంచనాలలో నాలుగవ వంతు వ్యయంతో ఇవి పూర్తి చేసే అవకాశం ఉండేది. వీటి ద్వారా వెనుక బడ్డ తెలంగాణా పేద రైతులకు కొన్ని వేల కోట్ల రూపాయల ఆర్థిక స్తోమత పెరిగెడిది.

ఇంత వరకు జంటనగరాలకు త్రాగునీరు తెలంగణా రైతుల నోరు కొట్టి ఇచ్చినదే. ఉస్మాన్‌నగర్, హిమయత్‌సాగర్, సింగూర్, మంజీర మొదటి, రెండవ, మూడవ దశలు అన్ని తెలంగాణాలోనివే. ఉమ్మడి రాజధానిలో ప్రజలకు త్రాగునీరు ఇవ్వడానికి కృష్ణా జలాల నుంచి ట్రిబ్యునల్స్ ద్వారా నీరు కేటాయించబడింది. అయినప్పటికీ ప్రభుత్వం త్రాగునీటిని రాజకీయాలతో ప్రాంతీయ తత్వంతో ముడిపెట్టి సమస్యను ప్రజాభిప్రాయానికి, అఖిలపక్ష పార్టీ సమ్మతికి, నిపుణుల అభిప్రాయానికి వదిలేసి 50 లక్షల జంటనగరాల పౌరులకు సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులను కొనసాగించినది. భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు మరియు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఉపయోగపడే రామగుండంలోని నేషనల్ థర్మల్ ప్రాజెక్టుకు తెలంగాణా పేదరైతుల నోరు కొట్టి ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి 10 టి.యం.సిల నీరు ఇచ్చింది. సాగుబాటులోనికి వచ్చి లోకలైజేషన్ జరిగిన ఒక లక్ష ఇరవై వేల ఎకరాలకు సరిపోయే నీరును ప్రభుత్వం తరలించి పరిశ్రమలకు ఇచ్చింది. ఈ నీరుకు బదులుగా ఎల్లంపల్లి వద్ద బ్యారేజ్‌కట్టి డబ్బు కేటాయించి రెండు సంవత్సరాలలో నిర్మాణం చేస్తామని వ్రాతపూర్వకంగా అభయమిచ్చి కూడా దశాబ్దాలు గడిచాయి. ఇంత వరకు ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి ఆసక్తి చూపటం లేదు.

మూడు ప్రాంతాలకు సంబంధించిన ఉమ్మడి ప్రాజెక్టులపైన తెలంగాణాకు తీవ్ర అన్యాయం జరిగింది, జరుగుతున్నది. పనుల ఆవశ్యకత నిర్ణయించడం, నిర్మాణం చేపట్టడంలో, తూములు, కాలువల నిర్మాణంలో నీటి కేటాయింపులలో తెలంగాణా ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్ళు ఏండ్ల తరబడిగా క్రిందికి, మీదికి తిరుగుతున్నవి. కొన్ని ప్రాజెక్టులకు మొక్కుబడిగా నిధులు కేటాయించబడినా చివరి నిముషంలో ఆ డబ్బు ఇతర ప్రాజెక్టులకు తరలించబడుతున్నది.

ఉమ్మడి ప్రాజెక్టు పైన రెండు ప్రాంతాలకు సంబంధించిన పనులు మొదలు పెట్టినా కూడా ఒక ప్రాంతంలోని పనులు పూర్తిచేసి రైతులకు నీరు అందిస్తూ ఇంకొక ప్రాంతంలో (తెలంగాణలో) దశాబ్దాలుగా పనులు చేపట్టక, పూర్తి చేయకపోవటం వలన ఆ ప్రాజెక్టుపై సర్వాధికారాలు ఒకే ప్రాంతం వారికి సంక్రమింపచేసినట్లుగా అవుతున్నది. ఉదాహరణకు శ్రీశైలం ఎడమ కాల్వ పనిని కావాలని తొక్కిపెట్టి, సాంకేతిక నిర్ణయాలు సకాలంలో చేయక శ్రీశైలం రిజర్వాయరు నీటితో ఇతరి ప్రాజెక్టులు శీఘ్రతరం చేయటం పేర్కొనవచ్చును.

తెలంగాణా ప్రాజక్టులపై కేటాయించిన డబ్బును తుది నిమిషం వరకు, ఖర్చుచేయకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. టెండర్లు పిలవకపోవడం, సాంకేతిక అనుమతి, ఆర్థక అనుమతి, పరిపాలనా అనుమతి ఇవ్వకపోవడం, తగినన్ని డివిజన్లు, సర్కిల్స్, పెట్టక సాంకేతిక సిబ్బందిని ఇవ్వకపోవడం, ఎస్టిమేట్లు, రివైజ్డ్ ఎస్టిమేట్స్ అనుమతి ఇవ్వకపోవడం,అవసరం ఉన్న పెద్ద మిషన్లు ఇవ్వకపోవడం, ప్రాజెక్టు కట్టడానికి అవసరమున్న భూమి సేకరణ చేయకపోవడం, భూమి పరిహారానికి సంబంధించిన లావాదేవీలు తేల్చకపోవడం, కాంట్రాక్టర్లను కోర్టుకు పంపించడం, అటవీశాఖ, పరిసరాల శాఖ, కేంద్రప్రభుత్వం, కేంద్ర నీటి కమీషన్, ప్రణాళికా సంఘం అనుమతులు తీసుకోకపోవడం, అంతర్ రాష్ట్ర వివాదాలు తేల్చకపోవడం, ఇలాంటి ఎన్నో చిక్కుముడులతో తెలంగాణా ప్రాజెక్టులను ఇరికించి ఏండ్ల తరబడి పూర్తి చేయక ప్రాజెక్టులను కుంటు పెండింగ్‌లో పెడుతున్నారు.

తెలంగాణా ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమం నీరు విడుదల చేసే కార్యక్రమం నిధులు ఇచ్చే కార్యక్రమం ఒక్కటి కూడా నిర్ణయించిన క్రమంగా అమలు జరగడం లేదు. తెలంగాణాలోని వివిధ ప్రాజెక్టులకు కేటాయించబడిన మొత్తాలను ప్రణాళికా సంఘం నిర్ణయించిన పద్ధతిలో ప్రభుత్వం ఖర్చు పెట్టడం లేదు. రాష్ట్ర ప్రణాళికలో వార్షిక బడ్జెటులో చూపిన నిధులను విచక్షణా రహితంగా ఇతర చోట్లకు తరలించి తెలంగాణా ప్రాజెక్టులను కుంటుపడగొడుతున్నారు. 7వ పంచవర్ష ప్రణాళికలో తెలంగాణా ప్రాజెక్టులపై కేటాయించిన డబ్బులో 52 శాతం మాత్రమే ఖర్చు చేసి మిగతా డబ్బు ఇతర చోట్లకు తరలించారు.

ఏటేటా కేటాయించిన డబ్బు ప్రతియేటా పెరుగుతున్న ధరల వలన ప్రాజెక్టులపై అంచనాలకు కూడా సరిపోవడం లేదు. తెలంగాణాలో ఇప్పుడు (1991లో) నడుస్తున్న అయిదు పెద్ద తరహా, మరియు 13 మధ్య తరహా ప్రాజెక్టులు పూర్తి చేయటానికి ఇంకా 1188 కోట్లు రూపాయలు అవసరం. పెరుగుతున్న ధరల వలన ప్రతియేటా 10 నుండి 15 శాతం ప్రాజెక్టు వ్యయం అధికమవుతున్నది. అనగా ప్రతియేటా 1188 కోట్ల పైగా 10 శాతం పెరుగుదల ద్వారా ప్రాజెక్టు అంచనాలు పెరిగి ప్రతి సంవత్సరం 118 కోట్లు వ్యయం అధికమవుతున్నది. ప్రాజెక్టుల వార్షిక కేటాయింపులు మాత్రం 90 కోట్లకు మించడం లేదు. ఈ మాదిరిగా ఈ ప్రాజెక్టుల పని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు.

1970లో 600 కోట్లతో పూర్తికావలసిన ఈ 5 పెద్ద తరహా, 13 మధ్యతరహా ప్రాజెక్టుల ఖర్చు అంచనాలు 1980 వరకు 1200 కోట్లకు, 1990 వరకు 2000 కోట్లకు చేరినవి. వీటిపైన 20 సంవత్సరాల కాలంలో ఖర్చు పెట్టిన డబ్బు 1000 కోట్లకు మించలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ ప్రాజెక్టులు ఇంకా 100 సంవత్సరాల తర్వాత కూడా పూర్తి అయ్యే అవకాశం లేదు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైన 4 సంవత్సరాలలో 400 కోట్లు ప్రపంచ బ్యాంకు నిధులు ఖర్చు పెట్టవలసిన అగత్యం ఉందని తెలిసి కూడా గత 2 సంవత్సరాలుగా 50 శాతం పైన సిబ్బందిని పోస్టు చేయక నిర్ణయించిన కార్యక్రమాల్ని కుంటుపడగొట్టారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైన అతి కీలకమైన ఛీఫ్ ఇంజనీర్‌ను 6 సంవత్సరాల్లో 8 మందిని మార్చారు. ఒక పర్యాయం ప్రాజెక్టు అనుభవం లేని రిటైర్డ్ మనిషిని కూడా వేసారు. నేటి వరకు (1992) కూడి ఇద్దరు ఛీఫ్ ఇంజనీర్లు, ముగ్గురు సూపరింటెండెంట్ ఇంజనీర్లు, 8 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 53 మంది డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పోస్టులు ఖాళీ పెట్టారు.

అదే మాదిరిగా 2 సంవత్సరాల నుండి ఆయకట్టు రోడ్ల సర్కిల్స్, డివిజన్స్, సబ్ డివిజన్స్ ఏర్పరచక, సిబ్బందిని వేయక, 40 కోట్ల రూపాయల నిధులను మురగపెట్టి 800 కి.మీ ఆయకట్టు రోడ్డును కుంటుపడగొట్టారు. ముంపు గ్రామాలకు పునరావాసం ఏర్పరచే నిధులను కూడి ఇదే రకంగా నిరుపయోగం చేస్తున్నారు. (సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

ఆదివాసీల అపురూప వేడుక... నాగోబా జాతర








ఆధ్యాత్మికతతో ఆదివాసీ సంస్కృతి పెనవేసుకున్న అపురూపమైన వేడుక నాగోబా జాతర. ఆదివాసీలు తమ ఆరాధ్య దైవమైన సర్ప దేవత నాగోబాను పూజిస్తూ ఎంతో ఘనంగా జరిపే ఈ పండుగ(జాతర) ప్రాచీనమైనది. ఎన్నో విశిష్టతలు కలిగి ప్రతి యేట పుష్య మాసం రాగానే తెలంగాణాలో ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అప్పటి వరకు నిర్మానుష్యంగా ఉండే అటవీ ప్రాంతం జాతర నిర్వహించే సమయంలో జనసంద్రమైపోతుంది. ఆదిమ గిరిజనుల్లో గోండు తెగకు చెందినా మేస్త్రం వంశస్తులు నాగోబాకు పూజలు నిర్వహిస్తున్నారు. వందల ఏళ్ల నుంచి ఈ సంప్రదాయం ఏ మాత్రం మార్పు లేకుండా కొనసాగుతూ ఉండటం విశేషం. ముఖ్యంగా తాతల సంప్రదాయం ప్రకారం నాగోబాను పూజిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయని,శాంతి నెలకొంటుందని, రోగాలు మాటుమాయం అవుతాయని భక్తులు విశ్వసిస్తారు. నాగోబా ఆవిర్భావం గురించి అనేక కథలు ఉన్నప్పటికీ పూర్వం మేస్రం కుటుంబానికి చెందినా నాగాయి మోతి రాణికి కలలో కన్పించి సర్ప రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడట.ఆ కల నిజమైందని గోండుల ఇళ్ళల్లో కొత్తగా పెళ్ళయిన ప్రతి జంటను తన సన్నిధిలో తీసుకువచ్చి తనకు పరిచయం చేయాలనీ నాగేంద్రుడు కోరాడట. ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య రోజున స్వయంగా ప్రత్యక్షమవుతానని వరమిచ్చారట.

ఈ విధంగా మేస్రం వంశీయులు జాతరకు ముందు రోజు నాటికి ఎక్కడెక్కడో ఉన్న వారంతా కేస్లాపూర్‌లో జమ అయి ఆలయం పక్కన విడిది చేస్తారు. తరువాత పరదన్, కాటోడాలు ఎడ్ల బండ్ల మీద సుమారు ఏడు,ఎనిమిది ఉర్లు తిరిగి జాతరకు ఆహ్వానిస్తారు. తిరికొండకు వెళ్లి కమ్మరి వాళ్ళ దగ్గర పూజల కుండల సిద్ధం చేస్తారు. తిరుగు ప్రయాణంలో పౌర్ణమి రోజున కేస్లాపూర్ లో పూజలు నిర్వహించి మడవి వంశం ఇంట్లో బస చేస్తారు. తదుపరి మేస్రం వంశస్తులు పవిత్ర గోదావరి జలాలను తీసుకురావడానికి కాలినడకన ఎనభై,తొంబై మైళ్లు నడిచి వెళ్తారు.సుమారుగా ఎనిమిది గ్రామాలలో బస చేసుకుంటూ వెళ్తారు.గోదావరి నదిలో పూజ నిర్వహిస్తారు.కాటోడ ఇంట్లో పూజలు నిర్వహించి కుండల్లో,పాత్రల్లో గోదావరి జలాలను తీసుకుని తిరిగి కేస్లాపూర్ పయనమవుతారు. మధ్యలో ఇంద్రవేల్లిలోని ఇంద్రాయి గ్రామం వద్దకు చేరుకొని ఇంద్రాయి దేవతను పుజిస్తారు.అదే రోజు కేస్లాపూర్ చేరుకొని ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టు దగ్గరకు చేరుకొని 'తుమ్' చనిపోయిన పెద్దలను స్మరించుకుంటూ అందరు కలిసి విడది చేస్తారు.మర్రిచెట్టు నుంచి గుడి దగ్గరకు వెళ్లి కోనేరు నీటిని ఆడపడుచులు ఆలయాన్ని శుద్ధిచేస్తారు. సాయంత్రం గోదావరి జలంతో శుద్ధి చేసి మహా పూజ పుష్య అమావాస్య రోజున నిర్వహిస్తారు.మరసటి రోజు నుండి ప్రధాన జాతర ప్రారంభం అవుతుంది.ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్,ఛత్తీస్ ఘడ్,ఒరిస్సా,మహారాష్ట్ర ,మధ్యప్రదేశ్ కు చెందిన ఆదివాసులు హాజరవుతారు.

బెటింగ్(కొత్త కోడళ్ళ పరిచయం) మేస్రం కుటుంబాల్లో కొత్త కోడళ్ళుగా వచ్చిన వారు నాగోబా దర్శనానికి తప్పనిసరిగా రావలిసి ఉంటుంది.పరిచయం కావలిసిన వదువులను 'బేటి కోరియాడ్' అని అంటారు.ఆ పరిచయం తరువాత మాత్రమే నాగోబా పూజలకు వారిని అనుమతిస్తారు.

కొమురం భీం పోరాటం తరువాత ఆదివాసిల జీవనంపై అధ్యయనం చేయడానికి వచ్చిన మానవ పరిణామ శాస్త్రవేత్త 'హైమన్ డార్ఫ్ ' కి వచ్చిన ఆలోచనే గిరిజన దర్బార్ లేదా నాగోబా దర్బార్. హైమన్ డార్ఫ్ అయన భార్య ఎలిజిబెత్‌తో కలిసి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మర్లవాయి గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో కేస్లాపూర్ గ్రామంలో నాగోబా జాతర జరుగుతుండడం వివిధ రాష్ట్రాల ఆదివాసిల వారి కష్ట సుఖాలను పంచుకోవడం గమనించిన హైమన్ డార్ఫ్ ఇది సరయిన వేదికని దర్బార్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతితో 1946 లో దర్బార్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నాగోబా జాతర నాలుగోవ రోజు దర్బార్ నిర్వహించడం ఆదివాసుల ఆనవాయితీ. ఈ డబ్బై మూడవ దర్బార్‌కి వారి శిష్యులు కూడావస్తున్నారు. ప్రతి ఏట జైనూర్‌లోని మర్లవాయిలో హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని నిర్వహిస్తున్నారు.

– పెనుక ప్రభాకర్
94942 83038



అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో
సీపీఎస్ రద్దు

- పరిపాలనలో పారదర్శకత
- ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి



విజయక్రాంతి, కడప : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీపీఎస్‌పై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. వైఎస్ జగన్ గురువారం కడపలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో తటస్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కమిటీల పేరుతో జాప్యం చేయమని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రెగ్యులరైజ్ చేస్తామని, వ్యవస్థల్లో అవినీతి లేకుండా, పరిపాలనలో పారదర్శక విధానానికి పెద్దపీట వేస్తామని భరోసా ఇచ్చారు.

ఈ క్రమంలో న్యాయవాది జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2008లో వెయ్యి పోస్టులతో మాత్రమే జూనియర్ లెక్చరర్ పోస్టులు వేశారని తెలిపారు. పదేళ్లుగా జూనియర్ లెక్చరర్ పోస్టుల ఊసే లేదన్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. కేవలం మొన్న మాత్రమే 240 పోస్టులు చంద్రబాబు వేశారు. ఇది చాలా అన్యాయం. యూనివర్శిటీలో విద్యార్థులకు ఫెలోషిప్‌లు రావడంలేదు. జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీ లేనందువల్లే రాష్ట్రంలో కార్పొరేట్ విద్య వేళ్లూనుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నోటిఫికేషన్లు ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అదే విధంగా ఫీజు బకాయిలు రద్దు చేసి, పీహెచ్‌డీ స్కాలర్స్‌కు రూ.5 వేలు, పీజీ విద్యార్థులకు రూ.3వేలు ఇవ్వాలని కోరారు.

మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం

జగదీశ్వర్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై వైఎస్ జగన్ స్పందిస్తూ జూనియర్ లెక్చరర్ పోస్టులే కాదు, ఐదేళ్లుగా ఏ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. మేము అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ మీద పూర్తి డ్రైవ్ చేస్తాం. 2.42 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామన్న అంశంపై లెక్కలు కూడా చూపుతాం. గ్రామ సెక్రటేరియట్లలో 10 మంది అదే గ్రామానికి చెందిన వారికి ఉద్యోగాలు ఇస్తాం. లంచాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాలు ఇస్తాం. నవరత్నాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా వీరి ద్వారా డోర్ డెలివరీ చేస్తాం. పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తాం. ఈ విషయంపై మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.


సీపీఎస్ రద్దు చేస్తాం

ముఖాముఖిలో భాగంగా చిన్నారెడ్డి అనే రిటైర్డ్ విద్యాధికారి ఉద్యోగుల సమస్యల గురించి ప్రస్తావించారు. 2018 నాటి మొదటి డీఏ ఫిబ్రవరిలో ఇచ్చారు. మళ్లీ దీన్ని ఏప్రిల్ నుంచి అమలు చేస్తారంట. దాన్ని కూడా మూడు విడతలుగా చేస్తారంట. ఆరు నెలలకు ఇచ్చే డీఏ కూడా సక్రమంగా ఇవ్వడం లేదు అని వాపోయారు. 2018లో పీఆర్సీతోపాటు ఐఆర్ కూడా ఇవ్వాల్సిందన్నారు. గతంలో వైఎస్సార్ 22 శాతం ఇచ్చారని గుర్తుచేశారు. సీపీఎస్‌ను తొలగించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకువస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. రైతులకు ప్రతీ మేలో రూ.12500 ఇవ్వడం చాలా మంచి కార్యక్రమం అని ప్రశంసించారు.

ఇందుకు స్పందనగా వైఎస్ జగన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాను. అనేక సందర్భాల్లో ఈ సమస్యలపై నేను స్పందించాను. సీపీఎస్ మీద ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోగా సీపీఎస్‌ను తొలగిస్తాం. చంద్రబాబుకు ఈ విషయంపై చిత్తశుద్ధి లేదు. అందుకే కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నాడు. నాన్నగారిని ఇవ్వాల్టికీ ఉద్యోగులు అభిమానిస్తారు. ఆయన పేరు నిలబెట్టేలా నేను ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటాను. ఉద్యోగస్తులు చల్లగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని నమ్మే మనిషిని నేను అని వ్యాఖ్యానించారు.

బలహీన వర్గాలను
ఆదుకోవడమే లక్ష్యం

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు
- జగన్‌కు ఓ సిద్ధాంతం లేదు
- ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్మపోరాట దీక్ష
- టీడీపీ నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



విజయక్రాంతి, అమరావతి: పేదరికంలేని సమాజం కోసం కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. మానవ వనరులు, సంక్షేమంపై అసెంబ్లీలో ఆయన గురువారం మాట్లాడారు. తన కులం పేద కులమని, వారిని ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. సమాజానికి పేదరికం శాపం వంటిదని చంద్రబాబు అన్నారు. ప్రపంచీకరణతో కులవృత్తుల, చేతి వృత్తులు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కులవృత్తులు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అగ్రవర్ణాల్లోనూ పేదలున్నారని, మైనార్టీలూ పేదరికంలో మగ్గుతున్నారని వివరించారు. వారిని ఆదుకునేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌కు ఓ సిద్ధాంతం అనేదే లేదని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు దుయ్యబట్టారు. పింఛన్లపై జగన్ ప్రకటనను టీడీపీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం ప్రస్తావించారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో జగన్‌కు దిక్కుతోచడం లేదన్నారు. ప్రభుత్వం వృద్ధాప్య పింఛను రూ.2 వేలు ఇస్తుంటే, తాను రూ.3 వేలు ఇస్తానంటూ జగన్ ప్రకటించారని మండిపడ్డారు. ఈనెల 11వ తేదీన ఢిల్లీలో ధర్మపోరాట దీక్ష పెద్ద ఎత్తున చేస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుంచి దీనికి మద్దతు పలకాలన్నారు. 10న రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీకి నిరసన తెలుపుదామన్నారు. సమష్టి కృషితో ఎన్నో విజయాలు అందుకున్నామని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లోనూ తిరుగులేని విజ యం సాధించాలని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 80శాతం ఓటు బ్యాంకు సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల బందరు పోర్టు కల నేడు సాకారం చేస్తున్నట్లు సీఎం వివరించారు. అన్న వస్తున్నాడంటూ వైఎస్సార్‌సీపీ చేస్తోన్న ప్రచారంపై సీఎం ప్రస్తావించారు. నేరస్థుడు ఎలా ఉండాలో తెలుసు కానీ, అన్నగా ఎలా ఉండాలో జగన్‌కు తెలుసా? అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మైలవరం నియోజకవర్గంలో ఎస్ఐలకు డబ్బులిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు పట్టుపడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు ఈ తరహా ప్రలోభాలకు గురి చేసేందుకు సిద్ధమవుతారని, వీరి వ్యవహా రంపై నిఘా పెట్టాలని నేతలకు ఆయన సూచించారు. ప్రతి వర్గాన్ని ఆదుకునేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పసుపుకుంకుమ చెక్కుల పంపిణీనే కాకుండా, చెక్కులు బ్యాంకుల్లో వేస్తే డబ్బులు ఇప్పించే బాధ్యతనూ నేతలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

ఇబ్బందులు చంద్రబాబుకు చెప్పా : చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుతో ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ భేటీ అయ్యారు. తన నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర అంశాలపై తొలుత మంత్రి శిద్దా రాఘవరావుతో ఆమంచి చర్చించారు. అనంతరం మంత్రి శిద్దా అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌కు ఆమంచిని తీసుకెళ్లారు. అదే సమయంలో మండలి సమావేశాలకు చంద్రబాబు వెళ్లడంతో సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్రతో కృష్ణమోహన్ సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలపై ఆమంచి ఆయనతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఎం చంద్రబాబుతో ఆమంచి కృష్ణమోహన్ భేటీ అయ్యారు. ఆమంచి వాదనను విన్న సీఎం తన నిర్ణ యాన్ని తర్వాత ప్రకటిస్తానని చెప్పినట్లు సమాచారం. తనకు ఉన్న ఇబ్బందులను మాత్రమే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని ఆమంచి మీడియాతో చెప్పారు. అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీతతో విభేదాల దృష్ట్యా ఇటీవల తన అనుచరులతో సమావేశమై పార్టీ మార్పుపై ఆయన అభిప్రాయాలను సేకరించారు. మంత్రి శిద్దా రాఘవరావు జోక్యం చేసుకుని సమస్యను సీఎంకు వివరించాలని సూచించడంతో ఆమంచి కృష్ణమోహన్ అమరావతి చేరుకుని చంద్రబాబుతో సమావేశమయ్యారు.

బయటకు వచ్చారా..
బహిష్కరించిందా





- మంత్రి యనమల రామకృష్ణుడు, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజుల మధ్య అసెంబ్లీలో ఆసక్తికర చర్చ

విజయక్రాంతి, అమరావతి: ఏపీ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. రెండు పార్టీల పొత్తులపై ఇరువురి నేతల మధ్య కాసేపు మాటల యుద్ధం జరిగింది. సభలో సామాజిక సాధికారత, సంక్షేమం, మానవ వనరుల అభివృద్ధిపై గురువారం జరిగిన చర్చ సందర్భంగా ఇది చోటుచేసుకుంది.

2014లో తెలుగుదేశం పార్టీ, పవన్ కళ్యాణ్ సాయంతో తానిక్కడ కూర్చోగలిగానని, మొదట్లో టీడీపీతో కలిసే వెళ్లినా ఇప్పుడు బయటకు వచ్చామని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు వచ్చిందో, టీడీపీను ఎన్డీయే బహిష్కరించిందో తనకు తెలీదన్నారు. వైఎస్సార్‌సీపీ శాసనసభ్యులను తీసుకుని టీడీపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందని ఎద్దేవాచేశారు. దీనిపై మంత్రి యనమల స్పందిస్తూ టీడీపీను ఎవరూ బయటకు పంపించలేరని, బీజేపీ తీరు నచ్చకే తాము బయటకు వచ్చామన్నారు. బీజేపీను వదిలేసి వచ్చామని, ఒకరకంగా చెప్పాలంటే బీజేపీతో విడాకులు తీసుకున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీకు మోదీ కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ తరపున విష్ణుకుమార్ రాజు వకాల్తా పుచ్చుకున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ , బీజేపీ కుట్రలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా తమ పోరాటం సాగుతుందని యనమల అన్నారు.

ప్రధాని విశాఖ పర్యటన
27కి వాయిదా

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16వ తేదీన జరగాల్సిన ప్రధాని పర్యటన 27వ తేదీకి వాయిదా పడినట్లు పీఎంవో గురువారం ఓ ప్రకటన చేసింది. కాగా ఈ నేపథ్యంలో ప్రధాని సభకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం కేటాయించాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్రాజు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిశారు. ఇదే అంశంపై ఆయన గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.

15న డీఎస్సీ
ఫలితాలు

- మంత్రి గంటా

విజయక్రాంతి, అమరావతి: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను ఈ నెల 15న ప్రకటించే అవకాశం ఉన్నట్లు మంత్రి గంటా శ్రీనివాస రావు వెల్లడించారు. శాసనమండలిలో గురువారం ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 7,900 ఖాళీలలను భర్తీ చేసినట్లు సభలో తెలిపారు. మరో 11 గిరిజన ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.


జయరాం హత్యలో శిఖా ప్రమేయం ఉంది

- జయరాం భార్య పద్మశ్రీ ఆరోపణ

విజయక్రాంతి, హైదరాబాద్: తన భర్త హత్య వెనుక శిఖా చౌదరి ప్రమేయం ఉందని ఎన్నారై వ్యాపారవేత్త చిగురుపాటి జయరాం భార్య పద్మశ్రీ ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ శిఖా ప్రమేయం లేకుంటే తన భర్త చనిపోయేవారు కాదని అన్నారు. ఆమె వ్యవహారం చూసి తన భర్తకు ప్రాణహాని ఉందని ఐదేళ్ల క్రితమే భయపడినట్టు వెల్లడించారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయన్నారు. పేద అమ్మాయి అయిన శిఖా చౌదరి నేడు బిఎండబ్ల్యూ కారులో ఎలా తిరుగుతోందని ప్రశ్నించారు.

బడ్జెట్‌లో ఏపీని పట్టించుకోలేదు

- ఎంపీ గల్లా జయదేవ్



న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల ఊసే లేదని, బడ్జెట్‌లో రాష్ట్రాన్ని అస్సలు పట్టించుకోలేదని ఎంపీ గల్లా జయదేవ్ ధ్వజమెత్తారు. ఏపీకిచ్చిన హామీలు, నెరవేర్చిన వాటిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దేశంలో నిరుద్యోగం పెరిగిందని జయదేవ్ అన్నారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో కచ్చితత్వం, జవాబుదారీతనం లోపించిందని ఎద్దేవాచేశారు. ఏపీ పునర్విభజన చట్టంలోని 29 అంశాల్లో ఏపీకి న్యాయం జరగలేదన్నారు. ఢిల్లీని మించి రాజధాని కడతామని శంకుస్థాపనకు వచ్చినప్పుడు మోదీ చెప్పారని, తిరుపతి, నెల్లూరు సభల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. రైతులను ఆదుకుంటామంటూ చెప్పి రోజుకు రూ.17 ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని గల్లా విమర్శించారు. ఈ నాలుగేళ్లలో ఏపీలో సీఎం చంద్రబాబు రైతుల ఆదాయం రెట్టింపు చేశారన్నారు. రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి జీఎస్టీ, నోట్ల రద్దుతో ఉన్న ఉద్యోగాలను పోగొట్టారని అన్నారు. ఐదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు చివరి బడ్జెట్‌లో ఏవో తాయిలాలు ప్రకటించారని విమర్శించారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు.

మన్నవరం పవర్ ప్రాజెక్టును
తరలించటం లేదు

- రాజ్యసభలో ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో ప్రకటన



న్యూఢిల్లీ: చిత్తూరు జిల్లా మన్నవరంలోని ఎన్టీపీసీ–బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించే ప్రతిపాదన ఏదీ లేదని భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో గురువారం రాజ్యసభలో ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ రెండు దశల్లో 600 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఈ సంస్థ వ్యాపార కార్యకలాపాలను విస్తరించాలని 2010లో ప్రణాళికను రూపొందించినట్లు ఆయన తెలిపారు. తొలి దశ కింద 1200 కోట్ల రూపాయల పెట్టుబడితో ఈపీసీ ప్రాతిపదికన ప్రాజెక్టును చేపట్టడంతోపాటు కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమయ్యే పరికరాల తయారీని చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే రెండో దశ కింద 4,800 కోట్ల రూపాయల పెట్టుబడులతో బాయిలర్, టర్బైన్, జెనరేటర్ల (బీటీజీ) తయారీ యూనిట్లను నెలకొల్పాలని ప్రతిపాదించినట్టు తెలిపారు.

మార్చి 2011లో జరిగిన ఎన్‌బీపీపీఎల్ బోర్డు సమావేశంలో దేశంలో నెలకొన్న వ్యాపార అవకాశాలపై సమీక్ష జరిగింది. అప్పటికే దేశంలో బీటీజీ ఎక్విప్‌మెంట్ తయారీ రంగంలోకి అనేక జాయింట్ వెంచర్ కంపెనీలు ప్రవేశించడంతో తీవ్రపోటీ నెలకొన్నట్లు సమీక్షలో గుర్తించిన యాజమాన్యం తమ వ్యాపార కార్యకలాపాలను తొలిదశకు మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి తెలిపారు. దీనికి తోడు 2011–12 మధ్య కాలంలో దేశీయ పవర్ రంగంలో పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఫలితంగా ఆర్డర్ల సంఖ్య కూడా తగ్గింది. ఈ నేపథ్యంలో ఎన్‌బీపీపీఎల్ తొలి దశ పెట్టుబడులపై తిరిగి దృష్టి సారించవలసిన అవసరం ఏర్పడింది. 2015లో రూపొందించిన ఫీజబులిటీ నివేదిక ప్రకారం తొలి దశలో 363.94 కోట్లు మాత్రమే పెట్టాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. ఎన్‌బీపీపీఎల్‌లో 2018 డిసెంబర్ చివరి నాటికి 130 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు మంత్రి చెప్పారు. ఇందులో 100 కోట్లు ప్రమోటర్ కంపెనీలైన ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ సమకూర్చాయి. ఎన్‌బీపీపీఎల్‌లో వాణిజ్యపరమైన కార్యకలాపాలు 2015 మేలో ప్రారంభమైనట్లు మంత్రి తన జవాబులో పేర్కొన్నారు.

వర్శిటీల్లో ప్రొఫెసర్ల నియామకం వాయిదా

సెంట్రల్ యూనివర్శిటీలతో పాటు ప్రభుత్వం నుంచి గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ పొందుతున్న అన్ని రాష్ట్ర యూనివర్శిటీలు, డీమ్డ్ యూనివర్శిటీలు, యూజీసీ ఇంటర్‌యూనివర్శిటీ సెంటర్లలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ నియామక ప్రక్రియను వాయిదా వేయవలసిందిగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గత ఏడాది జూలైలో ఆదేశాలు ఇచ్చినట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సత్యపాల్ సింగ్ వెల్లడించారు. యూజీసీ ఆదేశాలను అతిక్రమిస్తూ రోస్టర్ పాయింట్లపై స్పష్టత రాకుండానే ఆంధ్రా యూనివర్శిటీలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు యథేచ్ఛగా సాగిపోతున్న విషయం వాస్తవమేనా అంటూ గురువారం రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అలాంటి అవకతవకలేవీ తమ దృష్టికి రాలేదని యూజీసీ తెలియచేసిందని చెప్పారు.



ఏపీ శాసన మండలి
ఛైర్మన్‌గా ఎం.ఎ. షరీఫ్

- ఏకగ్రీవంగా ఎన్నిక

విజయక్రాంతి, అమరావతి: ఏపీ శాసన మండలి ఛైర్మన్‌గా టీడీపీ సీనియర్ నేత, ప్రభుత్వ విప్ ఎం.ఎ. షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండలి ఇన్‌ఛార్జ్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రకటించారు. అనంతరం సీఎం చంద్రబాబు, ఇతర నేతలు ఆయన్ను అభినందించి ఛైర్మన్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లారు. ఆ తర్వాత షరీఫ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ షరీఫ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఫరూక్‌ను మంత్రిగా, షరీఫ్‌ను మండలి ఛైర్మన్‌గా చేయటం ద్వారా మైనార్టీలకు రెండు ముఖ్య పదవులు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో 78.5 శాతం ప్రజలు టీడీపీ ప్రభుత్వం పట్ల సంతోషంగా ఉన్నారని తెలిపారు. షరీఫ్ నేతృత్వంలో శాసనమండలి సజావుగా సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాసనమండలి గౌరవం నిలబెడతానని, ప్రజలకు సేవ చేస్తానని నూతన ఛైర్మన్ షరీఫ్ చెప్పారు.


ఎం.ఎ.షరీఫ్ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో 1955 జనవరి 1న జన్మించారు. స్థానిక వై.ఎన్.కాలేజీలో బీకాం, భోపాల్‌లో ఎంకాం, ఎల్ఎల్బీ చదివారు. విద్యార్థి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన షరీఫ్ ఎన్టీఆర్ టీడీపీను ప్రారంభించిన తొలినాళ్లలో పార్టీలో చేరారు. అప్పటి నుంచీ పార్టీకి సేవలందిస్తూ, వివిధ పదవులు చేపట్టారు. ప్రస్తుతం ఆయన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేస్తున్నారు. ఆయన సేవల్ని గుర్తించిన పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గాను నియమించింది.

సరస్వతీ పూజకు అనుమతి నిరాకరణ

తిరువనంతపురం: కళాశాల ప్రాంగణంలో సరస్వతి పూజ చేయాలనుకున్న విద్యార్థులకు నిరాశ ఎదురైంది. అలపుజ జిల్లాలోని కొచ్చిన్ విశ్వవిద్యాలయం కుట్టనాడ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సరస్వతి పూజ చేయాలని ఉత్తరాది విద్యార్థులు భావించారు. అయితే దీనికి అనుమతి ఇవ్వడానికి కొచ్చిన్ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) ఆర్ శశిధరన్ నిరాకరించినట్లు జాయింట్ రిజిస్ట్రార్ చెప్పారు. ఇది లౌకికవాద ప్రాంగణమని, మతపరమైన కార్యక్రమాలను అనుమతించేది లేదని చెప్పారన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధిలో గడ్కరీ భేష్

- లోక్‌సభలో సోనియా ప్రశంసలు





విజయక్రాంతి, న్యూఢిల్లీ: కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పనితీరుపై యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ప్రశంసలు కురిపించారు. దేశంలోని మౌలిక వసతులను అభివృద్ధి చేయడంలో ఆయన "అద్భుతంగా" కృషిచేశారన్న దానిపై ఆమె ఏకీభవించారు. లోక్‌భలో గరువారం ప్రశ్నోత్తరాల సమయంలో గడ్కరీ మంత్రిత్వ శాఖకు సంబంధించిన రెండు ప్రశ్నలపై చర్చ జరిగింది. దేశంలోని రహదారుల విస్తరణపై అమలు చేసిన పథకాలు, చేపట్టనున్న పనులపై ఆయన పూర్తి వివరణ ఇచ్చారు. "తమ తమ నియోజకవర్గాల్లో నా మంత్రిత్వ శాఖ చేపడుతున్న పనులపై పార్టీల కతీతంగా ఎంపీలు నన్ను మెచ్చుకుంటున్నారు.." అని ఆయన పేర్కొన్నారు. గడ్కరీ మాట్లాడుతున్నంత సేపూ సోనియా గాంధీ నవ్వుతూ, తలూపుతూ కనిపించడం విశేషం. బీజేపీ సభ్యుల హర్ష ధ్వానాల మధ్య గడ్కరీ తన ప్రసంగాన్ని ముగించగానే... మధ్యప్రదేశ్ బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ లేచి నిలబడి ఓ ప్రతిపాదన చేశారు. "కేంద్ర రోడ్డు రవాణా మంత్రి చేపట్టిన అద్భుతమైన పనులను సభలోని సభ్యులంతా మెచ్చుకోవాలి.." అంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు విన్నవించారు. దీంతో సోనియా కూడా మెచ్చుకోలుగా బల్లలు చరవడం మొదలు పెట్టారు. ఆమెను చూసి లోక్‌సభలో కాంగ్రెస్ సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే సహా ఆ పార్టీ ఎంపీలంతా గడ్కరీ సేవలను మెచ్చుకుంటూ బల్లలు చరిచారు. కాగా రాయబరేలీ నియోజకవర్గ సమస్యలపై "సానుకూలంగా" స్పందించినందుకు గతేడాది ఆగస్టులో సోనియా గాంధీ నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు చెబుతూ లేఖ రాసినట్టు వార్తలు వచ్చాయి. ఉత్తర ప్రదేశ్లోని రాయబరేలీ నియోజకవర్గం నుంచి సోనియా గాంధీ లోక్‌భకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

బీజేపీలో ధైర్యం ఉన్న నేత గడ్కరీ: రాహుల్ ప్రశంస

భారతీయ జనతా పార్టీలో నితిన్ గడ్కరీ ధైర్య సాహసాలు ఉన్న నాయకుడని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యనించారు. ఇటీవల లోక్‌సభలో మాట్లాడుతు అభివృద్ధిపై గడ్కరీది నిర్మాణాత్మమైన వ్యూహం అని, ఆయన నేతృత్వంలో దేశ వ్యాప్తంగా రహదారుల మునుపటికంటే బాగా అభివృద్ధి చెందాయని ప్రశంసించారు. ప్రతిపక్షాలపై ఆయన విమ ర్శలు కూడా అర్ధవంతంగా ఉంటాయని చెప్పారు.

సీబీఐ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావుకు సమన్లు



విజయక్రాంతి, ఢిల్లీ: కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారనే ఆరోపణలపై గత ఏడాది మోదీ ప్రభుత్వం సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా నియమించిన ఎం నాగేశ్వరరావుకు గురువారం సుప్రీం కోర్టు సమన్లు జారీ చేసింది. ఈనెల 12న న్యాయస్థానం ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా ముజఫర్పూర్ షెల్టర్ హోంలో బాలికలపై లైంగిక దాడి కేసును విచారిస్తున్న సీబీఐ అధికారి ఏకే శర్మను బదిలి చేస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని సుప్రీం కోర్టు ప్రాథమికంగా నిర్ధారించింది. తన ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు సీబీఐ ప్రాసిక్యూషన్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎస్ వాసూరాంను కూడా కోర్టు ఎదుట హాజరు కావాలని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది. ఏకే శర్మ బదిలీ ప్రక్రియలో భాగస్వాములైన అధికారుల పేర్లను ఇవ్వాలని కోర్టు సీబీఐని ఆదేశించింది. ఈ సందర్భంగా సీజేఐ రంజన్ గొగొయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ విషయాన్ని మేము చాలా తీవ్రంగా పరిగణిస్తున్నాం. మీరు సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఆడుకున్నారు. దేవుడే మిమ్మల్ని కాపాడాలి. ఎప్పుడూ సుప్రీం కోర్టు ఆదేశాలతో ఆడుకోకండి.' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా ముజఫర్పూర్ షెల్టర్ హోమ్ కేసు విచారణను సుప్రీంకోర్టు గురువారం ఢిల్లీసాకేత్ పోక్సో కోర్టుకు బదిలీ చేయడమే కాకుండా, విచారణను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించింది.

దినకరన్‌కు సుప్రీంలో భంగపాటు



విజయక్రాంతి, చెన్నై: టీటీవీ దినకరన్ నేతృత్వంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) పార్టీకి ఇప్పుడు ప్రెషర్ కుక్కర్ గుర్తును మంజూరు చేయడం కుదరదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దినకరన్ నేతృత్వంలోని పార్టీకి కామన్గా ఒక గుర్తు, పేరు కేటాయించాలంటూ గతేడాది మార్చి 9న ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. ప్రెషర్ కుక్కర్ కేటాయించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా కోర్టు సూచించింది.దీనిపై సీఎం పళనిస్వామి వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించింది

ఈ పిటిషన్‌పై జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తమిళనాడు అసెంబ్లీలో ఖాళీ అయిన 18 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు నాలుగు వారాల్లోగా ఈసీ నోటిఫికేషన్ ఇవ్వగలిగితే.. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు లోబడి ఎన్నికల సంఘం ఏఎంఎంకే పార్టీకి ప్రెషర్ కుక్కర్ గుర్తును కేటాయించాలని తెలిపింది. లేనిపక్షంలో ఏఎంఎంకే పార్టీకి ఈసీ తన ఇష్టానుసారం ఎన్నికల గుర్తును కేటాయించవచ్చునని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఢిల్లీ మెట్రో హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం

- రోగులను మరో ఆస్పత్రికి తరలింపు

విజయక్రాంతి, న్యూఢిల్లీ: దేశ రాజధాని శివారు ప్రాంతం నొయిడాలోని ఓ హాస్పిటల్లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సెక్టార్ 12లోని మెట్రో హాస్పిటల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో అందులో భారీగా రోగులు చిక్కుకున్నారు. హాస్పిటల్ భవనంలో దట్టమైన పొగలు అలముకోవడంతో లోపల చిక్కుకున్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. . ప్రమాదం గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలికి చేరుకున్నారు. మొత్తం 12 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. లోపల చిక్కకున్న వారిని హాస్పిటల్ భవనం అద్దాలు పగులగొట్టి బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎంత మంది లోపల చిక్కుకున్నారనే విషయంపై ఎలాంటి సమాచారం లేదు. రోగులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హాస్పిటల్ బిల్డింగ్ చుట్టూ దట్టమైన పొగలు కమ్మేసాయి. బయటకు తీసుకొచ్చిన రోగులను అంబులెన్స్ సాయంతో వేరే హాస్పిటల్‌కు తరించే ప్రయత్నం చేస్తున్నారు.. ప్రమాదానికి కల కారణాలు ఇంకా తెలియరాలేదు. పరిస్థితులు అదుపులో ఉన్నాయని, ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి.

హెల్మెట్‌లతో విలేకర్లు
బీజేపీకి నిరసన తెల్పిన స్థానిక మీడియా



రాయ్‌పూర్: సాధారణంగా మీడియా సమావేశాల్లో విలేకరులు మైక్లు, కెమెరాలతో కన్పిస్తారు. కానీ ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో భాజపా నిర్వహించిన కార్యక్ర మానికి జర్నలిస్టులు మైక్, కెమెరాలతో పాటు హెల్మెట్లు ధరించి వచ్చారు. ఇటీవల భాజపా నేతలు కొందరు ఓ విలేకరిపై దాడి చేశారు. ఆ ఘటనకు నిరసనగానే తాజాగా జర్నలిస్టులు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇటీవల జరిగిన ఘటనకు నిరసనగా మేం హెల్మెట్లు పెట్టుకున్నాం. అంతేగాక.. ఒకవేళ వారు మళ్లీ మాపై దాడి చేసినా హానీ జరగకుండా ఉండేందుకే ఇలా ముందుగా జాగ్రత్త పడ్డాం' అని విలేకరులు తెలిపారు. గత శనివారం ఓ మీడియా సమావేశంలో జర్నలిస్టు సుమన్ పాండేపై కొందరు భాజపా నేతలు దాడి చేశారు. ఈ ఘటనలో అతడి తలకి గాయమైంది. 'సమావేశాన్ని మేం ఫోన్లలో రికార్డు చేస్తుండగా కొందరు భాజపా నేతల మధ్య ఏదో విషయమై వాగ్వాదం జరిగింది. ఈ ఘటనపై విలేకరులు ఆందోళన చేపట్టారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాండే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన భాజపా నేతలను అరెస్టు చేశారు.

ఢిల్లీలో మహిళా వైద్యురాలి ఆత్మహత్య

- లైంగిక వేధింపులకు గురైనట్లు సూసైడ్ నోట్

విజయక్రాంతి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) ఆసుపత్రిలో పనిచేస్తున్న రేడియాలజీ డాక్టర్ పూనమ్ వోహ్రా తన ప్రభుత్వ వసతిగృహంలో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులకు ఆమె ఇంట్లో సూసైడ్ నోట్ లభ్యమైంది. దానిలో ఆమె తాను పనిచేస్తున్న ఆసుపత్రికి చెందిన ముగ్గురు వైద్యులు తనను వేధిస్తున్నారని ఆరోపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డిఎస్పీ మాథూర్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ పూనమ్ వోహ్రా(52) తనకు ప్రభుత్వం కేటాయించిన వసతి గృహంలో భర్త చిరంజీవి వోహ్రా, పిల్లలతో పాటు ఉంటున్నారు. ఆమె 2016లో ఆర్ఎంఎల్లో కన్సల్టెంట్ రేడియాలజిస్ట్ గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో మంచి డాక్టర్‌గా పేరు సంపాదించారు.

భర్త, పిల్లలు బయటకు వెళ్లిన మధ్యాహ్న సమయంలో ఆమె ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కొద్దిసేపటి తరువాత పక్క ఇంట్లో ఉన్న వారు డాక్టర్ పూనమ్ ఇంటి తలుపు తట్టారు. అయితే వారికి ఎటువంటి సమాధానం లభించలేదు. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. నార్త్ ఎవెన్యూ పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూనమ్ వ్రోహ్రా సూసైడ్ నోట్లో తనను వేధిస్తున్నరని ఆరోపించిన ముగ్గురు వైద్యులను పోలీసులు విచారించనున్నారు.

మమత ధర్నాలో పాల్గొన్న పోలీసులకు షాక్



విజయక్రాంతి, న్యూఢిల్లీ: సీబీఐ అధికారుల తీరుకు నిరసనగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇటీవల రాజ్యాంగ పరిరక్షణ పేరుతో దీక్ష చేపట్టారు. ఈ ధర్నాలో మమతతో పాటు కొందరు పోలీసు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అయితే సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకంగా పోలీసులు ధర్నాలో పాల్గొనడంపై కేంద్ర హోంశాఖ చర్యలకు దిగింది. ఆ పోలీసులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో పాటు వారు కేంద్ర ప్రభుత్వంలో పనిచేయకుండా కొంతకాలం నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ డీజీపీ వీరేంద్ర, అదనపు డీజీపీలు వినీత్ కుమార్ గోయల్, అనూజ్ శర్మ, బిధానగర్ కమిషనర్ జ్ఞానవంత్ సింగ్, కోల్కతా అదనపు కమిషనర్ సుప్రతిమ్ దర్కార్‌పై హోంశాఖ చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

షెల్టర్ హోం కేసును ఢిల్లీ ట్రయల్ కోర్టుకు బదిలీ చేయండి

- సుప్రీం ఆదేశాలు



విజయక్రాంతి, న్యూఢిల్లీ: చిన్నారులను ఉంచే సంరక్షణాలయాలకు సంబంధించిన వివరాలను ఇంత వరకు సమర్పించకపోవడం పట్ల గురువారం సుప్రీం కోర్టు..బిహార్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. గురువారం మధ్యాహ్నం రెండు గంటల కల్లా వాటి వివరాలు అందజేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ముజఫర్పూర్ సంరక్షణాలయంలో యువతుల పై జరిగిన లైంగిక దాడికి సంబంధించిన కేసు విచారణను దిల్లీలోని ట్రయల్ కోర్టుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ కోర్టు ఆరు నెలల్లో ఈ కేసు విచారణను ముగించనుంది.మీ వద్ద ఆశ్రయం పొందిన పిల్లలకు ఇలాంటి పరిస్థితి రానీకుండా చూడాలి. అసలు బిహార్లో ఎన్ని సంరక్షణాలయాలు ఉన్నాయి? అక్కడ ఎంతమంది ఆశ్రయం పొందుతున్నారు? వాటి నిర్వహణకు ఎన్ని నిధులు పొందుతున్నారు? ప్రస్తుతం అక్కడున్న పిల్లల పరిస్థితి ఏమిటీ?' అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. బిహార్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తోన్న న్యాయవాది శుక్రవారం వరకు సమయం కోరగా.. మీరు వీటికి సమాధానాలు చెప్పే పరిస్థితిలో లేకపోతే, ఆ అంశాన్ని పరిశీలించే సంబంధిత వ్యక్తిని హాజరు పర్చమని ఆదేశించారు. . ఈ కేసును బిహార్ సీబీఐ కోర్టు నుంచి దిల్లీకి రెండు వారాల్లోగా బదిలీ చేయనున్నామని వెల్లడించారు.ఎన్జీవో నడుస్తోన్న ముజఫర్పూర్ సంరక్షణాలయంలో బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడులకు పాల్పడ్డారని, అసభ్యకరమైన పాటలకు బలవంతంగా నృత్యాలు చేయించారని సీబీఐ గతంలో జరిగిన విచారణ సమయంలో కోర్టుకు వెల్లడించింది. ఈ కేసులో ప్రముఖ వ్యక్తుల హస్తముందని, దీని నిర్వాహకుడు బ్రజేష్ ఠాగూరును ప్రధాన నిందితుడిగా చేరుస్తూ సీబీఐ అభియోగపత్రాలు దాఖలు చేసింది.

పారా మిలటరీలో 76 వేల ఉద్యోగ ఖాళీల భర్తీ



విజయక్రాంతి, న్యూఢిల్లీ: కేంద్ర పారా మిలటరీ బలగాల్లో 76,578 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు హోంశాఖ తెలిపింది. ఈ మొత్తం ఉద్యోగాల్లో 54,953 కానిస్టేబుల్ పోస్టులు ఉండగా, వీటిలో మహిళల కోసం 7,646 పోస్టులను కేటాయించినట్లు వెల్లడించింది. కానిస్టేబుల్ పోస్టుల్లో సీర్‌పీఎఫ్‌లో అత్యధికంగా 21,566 ఖాళీలు ఉండగా, బీఎస్ఎఫ్ (16,984), ఎస్ఎస్‌బీ (8,546), ఐటీబీపీ(4,126) అస్సాం రైఫిల్స్(3,076) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయని తెలిపింది. ఇందుకోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) 2019, ఫిబ్రవరి 11 నుంచి మార్చి 11 వరకూ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించనుంది.ఇక సబ్ ఇనస్పెక్టర్ హోదాలో 1,073 పోస్టులు ఉండగా వాటిలో బీఎస్ఎఫ్‌లో 508, సీఆర్‌పీఎఫ్‌లో 274, ఎస్ఎస్బీలో 206, ఐటీబీపీలో 85 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు అదనంగా ట్రేడ్స్‌మన్ , హోంశాఖ, వైద్యం, పారా మెడికల్, కమ్యూనికేషన్, ఇంజనీరింగ్ రంగాల్లో మరో 20,086 పోస్టులను పదోన్నతుల ద్వారా హోంశాఖ భర్తీ చేయనుంది.

వరద బాధితులను కాపాడిన మత్స్యకారులకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలి

- శశిధరూర్ లేఖ



తిరువనంతపురం: విపత్తులో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలు కాపాడిన కేరళ మత్స్యకారులకు నోబెల్శాంతి బహుమతి అందించాలని కాంగ్రెస్‌ఎంపీ శశిథరూర్ నోబెల్ కమిటీకి లేఖ రాశారు. 2018, ఆగస్టులో కేరళ శతాబ్ద కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో తీవ్ర ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కొంది. వరదలతో అల్లాడిపోయింది. పెద్ద ఎత్తున ప్రజలు సొంత ప్రాంతాలను వదిలి వలసబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో వరదలో చిక్కుకున్న స్థానికులకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సాధారణ పౌరులు ఆర్థిక సాయం చేశారు. అలాగే ఎంతోమంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తోటివారిని కాపాడారు. సాయం చేయడానికి ముందుకొచ్చినవారిలోకేరళకు చెందిన మత్స్యకారుల వర్గమూ ఉంది. కేరళ వరదల సమయంలోమత్స్యకారుల వర్గంచాలా ప్రముఖమైన పాత్ర పోషించిందని తిరువనంతపురం పార్లమెంటు సభ్యుడైన శశిధరూర్ నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ బెరిట్ రీస్ ఆండర్సన్‌కు లేఖ రాశారు.

బీజేపీకి సవాల్ విసిరిన సిద్దరామయ్య



విజయక్రాంతి, బెంగళూరు: భారతీయ జనతా పార్టీకి గురువారం కాంగ్రెస్ గట్టి సవాల్ విసిరింది. కర్ణాటక ప్రభుత్వాన్ని నడిపేందుకు తగిన ఆధిక్యత జేడీఎస్ కాంగ్రెస్ కూటమికి లేదని బీజేపీ భావిస్తే, అవిశ్వాస తీర్మానం ఎందుకు ప్రవేశపెట్టడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. గురువారం శాసన సభ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి కుమార స్వామి ప్రభుత్వం మైనారిటీలో పడిందని ఆరోపించారు. సభలో గందరగోళం సద్దుమణగకపోవడంతో శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.సిద్ధరామయ్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించనివ్వండి

వాళ్ళని నిరోధిస్తున్నది ఏమిటి? మేం శాసన సభ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. వాళ్ళందరూ (నలుగురు అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు) రేపు (శుక్రవారం) వస్తారు. బడ్జెటును రేపు (శుక్రవారం) ప్రవేశపెడతాం. ప్రభుత్వానికి ఆధిక్యత ఉంది" అని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా పాల్గొనాలని సిద్ధరామయ్య విప్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి బీ ఎస్ యడ్యూరప్ప మాట్లాడుతూ "వాళ్ళకి (కుమార స్వామి నేతృత్వంలోని జేడీఎస్‌కాంగ్రెస్ కూటమికి) ఆధిక్యత లేదు. ప్రభుత్వంలో కొనసాగే నైతిక హక్కు వాళ్ళకి లేదు. మా నిరసనను రేపు (శుక్రవారం) కొనసాగిస్తాం" అని చెప్పారు. కర్నాటక శసన సభ సమావేశాలు బుధవారం ప్రారంభం అయ్యాయి.

సప్నా చౌదరి డాన్స్ షోలో తొక్కిసలాట
అభిమానులపై లాఠీ చార్జ్



విజయక్రాంతి, న్యూఢిల్లీ: హరియాణాకు చెందిన సింగర్, డ్యాన్సర్ సప్నా చౌదరి తాజాగా రాజ్‌గఢ్‌లో నిర్వహించిన కార్య క్రమానికి అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అయితే, నిర్వహణ లోపాల కారణంగా షోలో తొక్కి సలాట చోటుచేసుకుంది. ఇసుకేస్తే రాలనంతమంది జనం కార్యక్రమానికి హాజరయ్యారు. సప్న స్టేజీపైకి రాగానే సీట్లపై నుంచి ఒక్కసారిగా పైకిలేచిన అభిమా నులు ముందుకు తోసుకురావడంతో తోపులాట జరి గింది. ఈ ఘటనలో ఇద్దరు అభిమానులు గాయప డ్డారు.దీంతో కల్పించుకున్న పోలీసులు పరిస్థితిని అదుపుచేసేందుకు ప్రయత్నించడంతో అభిమానులు వారిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. అదే సమయంలో సప్నా చౌదరిని వేదికపై నుంచి పోలీసులు క్షేమంగా తరలించారు. కాగా, బిగ్‌బాస్ 11 పోటీదారు అయిన సప్నా చౌదరి గ్లామర్ ఇండస్ట్రీలో పాపులర్ అయింది. గత ఏడాది నవంబరులో బెగుసరాయిలో నిర్వహించిన సప్న షోలోనూ గందరగోళం నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు.

15వేల మొక్కలు నాటండి..



విజయక్రాంతి, న్యూఢిల్లీ: ఓ కేసు విషయంలో 15వేల మొక్కలు నాటాలంటూ దిల్లీ హైకోర్టు ప్రతివాదులను ఆదేశించింది. 2జీ కుంభకోణం కేసులో కేంద్ర మాజీ మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహ నిందితులందరినీ నిర్దోషులుగా తేలుస్తూ 2017 డిసెంబరు 21న దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ 2018 మార్చిలో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దీంతో ఈ అప్పీ్లు తమ స్పందన తెలియజేయాలని నిర్దోషులుగా తేలిన వారిని కోర్టు సూచించింది.అయితే వీరిలో ఇద్దరు వ్యక్తులు, మూడు కంపెనీలు ఇంత వరకూ తమ స్పందన తెలియజేయలేదు.

ఇందుకు తమకు కొంత గడువు కావాలంటూ స్వాన్ టెలికాం ప్రయివేట్ లిమిటెడ్ ప్రమోటర్ షాహిద్ బల్వా, కుసేగావ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాజీవ్ అగర్వాల్, డైనమిక్ రియాల్టీ, డీబీ రియాల్టీ లిమిటెడ్, నిహార్ కన్స్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్ గతంలో పలుసార్లు న్యాయస్థానాన్ని కోరారు. ఈడీ అప్పీ్లు గురువారం మరోసారి విచారణ జరగగా వీరు మరోసారి సమయం కావాలని అడిగారు.దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. ఒక్కొక్కరు 3000 మొక్కల చొప్పున 15వేల మొక్కలు నాటాలని శిక్ష విధించింది. ఫిబ్రవరి 15న అటవీ అధికారి ఎదుట హాజరై శిక్షను పూర్తిచేయాలని ఆదేశించింది. స్పందన తెలియజేసేందుకు చివరి అవకాశం ఇస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే నెల 26కు వాయిదా వేసింది.

రికార్డు స్థాయిలో ఎండలు

లండన్: బ్రిటన్ వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. 2014–2023 దశాబ్దం 150 ఏళ్ళలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే దశాబ్దంగా రికార్డు సృష్టిస్తుందని పేర్కొంది. రాబోయే ఐదేళ్ళలో ఉష్ణోగ్రతల పరిస్థితులను వివరిస్తూ, ప్రీ ఇండస్ట్రియల్ లెవెల్స్ కన్నా 1 డిగ్రీ సెంటిగ్రేడ్ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాబోతున్నట్లు పేర్కొంది. 2015లో మొట్టమొదటిసారి ప్రీ ఇండస్ట్రియల్ లెవెల్ కన్నా 1 డిగ్రీ అధికంగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరిగిందని తెలిపింది. అప్పటి నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోందని పేర్కొంది. ఈ పెరుగుదల 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని తెలిపింది. తాత్కాలికంగానే అయినా 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు తెలిపింది.



ఈ చేపలు ఈత కొట్టవ్.. కాళ్లతో నడుస్తయ్..

టాస్మానియా: చుక్కల చేపల కదలికలు భలే విచిత్రంగా ఉంటాయి. ఇవి చేపలే అయినా గానీ, ఈత కొట్టవు. నీటి అడుగు భాగంలో నేలపై నెమ్మదిగా నడుస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాయి. 'కోళ్లు కూడా పక్షులే అయినా అవి ఎక్కువ దూరం ఎగరలేవు, ఎక్కువ ఎత్తుకూ ఎగరలేవు. అలాగే ఇవి కూడా ఓ రకం చేపలే అయినా గానీ ఎక్కువ దూరం ఈదలేవు' అని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టిమ్ లిం తెలిపారు. ఇవి ఎక్కువగా కదలవు. అలా ఓచోట కూర్చొని ఉన్నట్లుగా ఉండటానికే ఎక్కువ ఇష్టపడతాయి. వాటికి అలా ఉంటేనే సంతోషం. 1980కు ముందు టాస్మానియా ఆగ్నేయ తీరప్రాంతంలో ఇవి ఎక్కడ పడితే అక్కడ విరివిగా కనబడేవి. కానీ రాను రాను వీటి సంఖ్య తగ్గిపోయింది.

ఇప్పుడు అరుదుగా, చాలా తక్కువ ప్రదేశాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. అందుకే వీటిని పరిరక్షించేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ప్రయోగశాలలో పునరుత్పత్తి చేసి... ఈ చుక్కల చేపల జాతిని రక్షించే దిశగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం 9 రకాల ప్రదేశాల నుంచి చుక్కల చేపల్లో వయసు ఎక్కువగా ఉన్న వాటిని ఎంచుకుని తీసుకొచ్చారు. వాటి ద్వారా ఆ జాతిని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. 'అవి గుడ్లు పెట్టడం చూస్తే భలే సంతోషంగా ఉంది. మా దగ్గర ఇప్పుడు 70 వరకూ పిల్ల చుక్కల చేపలున్నాయి. ఆ చిన్న చేపలు నీటి అడుగున కదులుతుంటే ఎంత బాగుంటుందో. ఇప్పుడు ఆ చేప పిల్లలను చూస్తుంటే ఈ జాతి అంతరించిపోకుండా ఆపలేకపోయినా... కనీసం మరికొన్ని రోజులు బతికేలా చేశామనే తృప్తి కలుగుతోంది' అని శాస్త్రవేత్తలు సంతోషపడుతున్నారు.

పాస్‌వర్డ్ చెప్తే రూ.1000 కోట్లు..

- మృతిచెందిన క్రిప్టో కరెన్సీ సంస్థ సీఈవో
- హ్యాక్ చేయలేక ఐటీ నిపుణుల తర్జనభర్జన
- సొమ్ముల సంగతేంటని ఇన్వెస్టర్ల గగ్గోలు..

ఇంటర్‌నేషనల్ డెస్క్: ఒక వ్యక్తి మరణం లక్షలాది మంది ఇన్వెస్టర్లను ఆందోళనలోకి నెట్టేసింది. ఏకంగా 19 కోట్ల కెనడా డాలర్ల (రూ.1,030 కోట్లు) సొమ్ము ఫ్రీజ్ అయిపోయింది. ఈ డబ్బును ఎలా వెనక్కి తీసుకురావాలో తెలియక టెక్ దిగ్గజాలు తలలు పట్టుకుంటున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే క్రిప్టో కరెన్సీ అంటే తెలుసు కదా. కేవలం ఆన్లైన్లో మాత్రమే చెల్లుబాటు అయ్యే డిజిటల్ కరెన్సీ. దీనిలో పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో లాభాలు ఆర్జించవచ్చని ఈ మధ్య కాలంలో చాలామంది దానివైపే మొగ్గు చూపిస్తున్నారు. ఇలా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు ఆహ్వానించే ఒక కంపెనీయే కెనడాకు చెందిన క్వాడ్రిగా సీఎక్స్. సంస్థ ప్రస్తుత సీఈవో అయిన కెనడాకు చెందిన గెరాల్ కాటన్ 5 ఏళ్ల కిందట నోవా స్కాటియాలో దీనిని స్థాపించారు. దీంతో ఈ కంపెనీలో ఎందరో ఇన్వెస్టర్లు తమ డబ్బును క్రిప్టో కరెన్సీ రూపంలో డిపాజిట్లు చేశారు.

భారత్‌లోనే మరణం..

ఇక్కడ వరకు అంతా బాగానే ఉన్నా.. అసలు చిక్కల్లా గతేడాది డిసెంబర్లో మొదలైంది. గత డిసెంబర్లో ఏదో పనుల నిమిత్తం కాటన్ భారత్కు వచ్చారు. 30 ఏళ్ల వయసున్న ఆయనకి అప్పటికే జీర్ణకోశ వ్యాధి బాగా ముదిరిపోయింది. మన దేశంలో పర్యటిస్తుండగానే ఆకస్మికంగా కాటన్ మృతిచెందారు. దీంతో ఒక్కసారిగా క్వాడ్రిగాసీఎక్స్లో పెట్టుబడి పెట్టినవారిలో ఆందోళన మొదలైంది. ఎందుకంటే ఈ క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ వాలెట్ పాస్వర్డ్లు, రికవరీ కీలు కాటన్కు తప్ప మరెవరికీ తెలీదు. ఆయన వాటిని ఎక్కడా రాసి పెట్టి కూడా ఉంచలేదు. దీంతో కోట్లాది డాలర్లను ఎలా రికవరీ చేసుకోవాలో తెలియక ఇన్వెస్టర్లంతా లబోదిబోమంటున్నారు. ఆ పాస్వర్డ్లను కనుక్కోవడానికి సాంకేతిక నిపుణులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా ఫలితాలు మాత్రం శూన్యం.





అతి గోప్యతే కొంప ముంచిందా..?

డిజిటల్ కరెన్సీ అంటే అన్నీ ఆన్లైన్ లావాదేవీలే కాబట్టి గెరాల్ కాటన్ భద్రత విషయంలో చాలా అప్రమత్తంగా ఉండేవారు. తాను వాడే ల్యాప్టాప్లు, ఈ మెయిల్, మొబైల్ ఫోన్లు, మెసేజింగ్ వ్యవస్థలన్నింటినీ ఎన్క్రిప్ట్ చేసేశారు. దీంతో ఆ పాస్వర్డ్లను కనుక్కోవడంలో ఐటీ దిగ్గజాలు కూడా చేతులెత్తేశారు. డిజిటల్ లావాదేవీల్లో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా, ఎవరూ వాటిని హ్యాక్ చేయకుండా కాటన్ పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అయితే ఇంతటి పకడ్బందీ భద్రతా చర్యల కారణంగా తాము ఆ సొమ్మును రికవరీ చేసే పరిస్థితుల్లో లేమంటూ ఆయన భార్య జెన్నిఫర్ రాబర్ట్సన్ కోర్టులో అఫిడవిట్ సమర్పించారు. ఇప్పుడు ఇన్వెస్టర్లు మాత్రం చేసేదేమీలేక న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్నారు. అయితే కొందరు ఇన్వెస్టర్లేమో ఈ కంపెనీ కుట్ర పన్ని తమను మోసం చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల వేదికగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరేమో క్వాడ్రిగాసీఎక్స్ డిపాజిట్లు ఆన్లైన్లో చేతులు మారుతున్నాయని, పాస్వర్డ్లు తెలీకుండా అదెలా జరుగుతోందంటూ ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద ఒక వ్యక్తి మరణంతో రూ.1,000 కోట్లకు పైగా సొమ్ముకి అతీగతీ లేకపోవడం విస్మయం కలిగించే విషయమే.



బ్రెగ్జిట్‌పై పురోగతి కావాలి

- బ్రిటన్ ప్రధానమంత్రి థెరెసా మే

బ్రస్సెల్స్: బ్రెగ్జిట్ విషయంలో పురోగతి కావాలని బ్రిటన్ ప్రధానమంత్రి థెరెసా మే అన్నారు. యూరోపియన్ యూనియన్ నాయకులతో బ్రెగ్జిట్‌పై చర్చల్లో నెలకొన్న స్థంభనను తొలగించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు. యుకెకు, ఇయులోని 27 భాగస్వామ్య దేశాలకు మధ్య నెలకొన్న ఉద్రిక్తతను తొలగించేందుకు యూరోపియన్ కమిషన్ జీన్ క్లాడె అధ్యక్షుడు జుంకర్ ప్రతిపాదించిన సమావేశాన్ని ఆమె స్వాగతించారు. బ్రెగ్జిట్ ఆలోచనను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనలను గత నవంబర్‌లోనే యుకె పార్లమెంటు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బ్రెగ్జిట్ ఆలోచన విరమించుకోవాలని జరిగిన చర్చల్లో ఎలాంటి ప్రగతి లేకపోగా, బ్రెగ్జిట్ కోరుకుంటున్న వారికి, వద్దు అంటున్న వారికి మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు డొనాల్డ్ టస్క్, ఇయు నుంచి వెళ్లిపోవాలనుకునే వారి కోసం నరకంలో ప్రత్యేక స్థలం సిద్ధం చేసి ఉందని వ్యాఖ్యానించారు. కెమరాల ముందు మే, టస్క్‌లతో ముఖాముఖి వాదన ముందుగా నిర్ణయించారు. అయితే అనుకున్న సమయం కొన్నా కొద్ది గంటల ముందు దానిని రద్దు చేశారు. బ్రెగ్జిట్‌కు సంబంధించిన ఒప్పందంలో థెరిసామే కొన్ని సవరణలు కోరుకుంటున్నారు.

స్వీడన్ ప్రధాని సలహాదారుగా మరాఠా యువతి



స్టాక్ హోం: భారత సంతతికి చెంది న యువతి, మహారాష్ట్రకు చెందిన విద్యావేత్త కుమార్తెకు సువర్ణావకాశం లభించింది. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ విద్యావేత్త అశోక్ విఖే పాటిల్ కుమార్తె నీలా విఖేపాటిల్ స్వీడన్ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఒ)లో రాజకీయ సలహాదారురాలిగా నియమితులయ్యారు. స్వీడన్‌లో ఇటీవల అధికారం చేపట్టిన సోషల్ డెమోక్రాట్ గ్రీన్ పార్టీ కూటమి నాయకుడు స్టీఫెన్ లోవన్ వద్ద కొంతకాలంగా నీల పనిచేస్తున్నారు. స్టీఫన్ గత నెలలో స్వీడన్ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన నీలను తన రాజకీయ సలహాదారురాలిగా నియమించుకున్నారు. 'నీల... స్వీడన్ ప్రధాన మంత్రి రాజకీయ సలహాదారుగా నియమితులయ్యారు. ఆర్థిక విభాగం, పన్నులు, బడ్జెట్, గృహనిర్మాణం వంటి విభాగాల బాధ్యతలను కూడా నిర్వహిస్తారు' అని ఆమె తండ్రి అశోక్ పాటిల్ చెప్పారు.

అంతేకాకుండా తన కుమార్తె స్టాక్‌హోం మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్ఎంసీ) సిటీ కౌన్సిల్‌కు కూడా ఎన్నికయ్యారని చెప్పారు. నీల గత ప్రభుత్వం హయాంలోనూ రాజకీయ సలహాదారురాలిగా పనిచేశారు. ఆమె గ్రీన్ పార్టీలో క్రియాశీల కకార్యకర్త కూడా. అంతే కాకుండా గ్రీన్ పార్టీ ఎన్ని కల కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. కాగా స్వీడన్‌లో జన్మించిన నీల బాల్యం అహ్మద్‌నగర్‌లోనే గడి చింది. స్వీడన్‌లోని గోతెన్బర్గ్ స్కూ ల్ ఆఫ్ బిజినెస్‌లో నీల ఎంబీఏ డిగ్రీ చదివారు. నీల తాత బాలాసాహెబ్ విఖే పాటిల్ గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇక ఆమె మేన మామ రాధాకృష్ణ విఖేపాటిల్ మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు.



బెంగాల్లో గ్లోబల్ బిజినెస్ సమ్మిట్

కోల్‌కతా: బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 15వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి ప్రముఖ వ్యాపారవేత్తలు, దౌత్యవేత్తలు హాజరయ్యారు. గురువారం ప్రారంభమైన సమ్మిట్‌లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అతిథులకు ఆహ్వానం పలికారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో పెట్టుబడులను ఆకర్షించే అంశంపై దృష్టి సారించారు. ఈ సమ్మిట్‌లో వివిధ దేశాల నుంచి వారితో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ, హీరానందాని గ్రూప్ నుంచి నిరంజన్ హీరానందానీ, భర్తి గ్రూప్ నుంచి రాజన్ భర్తి మిట్టల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ విదేశాల నుంచి అరుదెంచిన దౌత్యవేత్తలతో, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. కోల్‌కతా కొత్త నగరంలోని కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్‌లో కోక కోలా సౌత్ ఏసియా హెడ్‌తో పాటు పలువురు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. విదేశీ భాగస్వాములపైనే సమ్మిట్ దృష్టి పెట్టింది. యుకె, ఫ్రాన్స్, క్రెచ్ రిపబ్లిక్, సౌత్ కొరియా దేశాలతో పాటు 36 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టింగ్ ఆపరేషన్ పూర్తి వివరాలు వెల్లడించాలి

- భారతీయ అమెరికన్ రాజాకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో బృందం



వాషింగ్టన్: అమెరికాలోని నకిలీ విశ్వవిద్యాలయ వ్యవహారంలో యూఎస్ హోంలాండ్ సెక్యూరిటీ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్ తాలూకు పూర్తి వివరాల వెల్లడించాలని ఆ దేశ చట్ట సభ్యులు డిమాండ్ చేశారు. భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రిపబ్లిక్, డెమోక్రట్ల బృందం ఈ మేరకు హోంలాండ్ సెక్యూరిటీ విభాగం, యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ (ఐసీఈ) విభాగాలకు లేఖ రాసింది. నిర్బంధంలో ఉన్న విద్యార్థుల విచారణ సరైన రీతిలో జరుగుతుందా లేదా అనే విషయాన్ని వాకబు చేసిన చట్ట సభ్యులు.. న్యాయపరంగా దక్కాల్సిన అన్ని హక్కులు వారికి కల్పిస్తున్నారా లేదా అన్నదానిపై వివరాలు కోరారు. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు సహా తాజా సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. నకిలీ విశ్వవిద్యాలయం పేరుతో 130 మంది విదేశీ విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి అక్రమ వీసాలు ఇప్పించారన్న ఆరోపణలపై అమెరికన్ హోంలాండ్ సెక్యూరిటీ విభాగం 8 మంది భారతీయ విద్యార్థులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పే అండ్ స్టే రాకెట్ గుట్టు రట్టు చేసేందుకు భాగంగా డెట్రాయిట్లో ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం పేరుతో హోంలాండ్ సెక్యూరిటీ విభాగమే ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ అంశంలో వారు దోషులుగా తేలితే గరిష్ఠంగా ఐదేళ్లు శిక్ష పడనుంది.

దుబాయ్‌లో లోక కేరళ సభ..

దుబాయ్: 'లోక కేరళ సభ' (ప్రపంచ కేరళ వేదిక) ప్రాంతీయ సమావేశం ఫిబ్రవరి 15, 16న దుబాయిలో నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న కేరళీయులను మాతృభూమి కేరళతో సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, ఆర్థికంగా అనుసంధానపరిచే యోచనతో 'లోక కేరళ సభ' (ఎల్కేఎస్)ను కేరళ రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఏర్పాటు చేసింది.

ఇందులో కేరళ రాష్ట్రానికి చెందిన అందరు ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటూ, కేరళకు చెందిన 100 మంది ప్రవాస భారతీయులు, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో నివసిస్తున్న 40 మంది కేరళ ప్రవాసులు, వివిధ రంగాలలో నిష్ణాతులైన 30 మంది కేరళ మేధావులు మొత్తం 351 మంది సభ్యులుంటారు. ప్రవాసీ కేరళీయుల కష్టాలను, ఆకాంక్షలను తెలుపుకోవడానికి, వారి నైపుణ్యాన్ని, అనుభవాన్ని రాష్ట్రాభివృద్ధికి వాడుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది.



కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, అసెంబ్లీ స్పీకర్ శ్రీరామక్రిష్ణన్, అసెంబ్లీలో ప్రతిపక్షనేత రమేష్ చెన్నితలతో సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేరళ ప్రవాసీ ప్రముఖులు, ప్రపంచవ్యాప్తంగాఉన్న 200 కు పైగా ఎల్కేఎస్ సభ్యులు (65 మంది గల్ఫ్ నుండి)తో సహా 1500 మంది దుబాయి సభకు హాజరవుతారు. ఈ సందర్భంగా నెలవారీ ఆదాయాన్నిచ్చే ప్రవాసి డివిడెండు పథకంతో సహా నాలుగు సంక్షేమ పథకాలను ప్రకటించనున్నట్టు సమాచారం. ఉపాధినిచ్చే నైపుణ్యాలు, పార్థీవ దేహాల తరలింపు, పునరావాసం తదితర ఏడు ముఖ్యమైన విషయాలపై చర్చిస్తారు.



వెనిజువేలా సంక్షోభ నివారణకు..

ఉరుగుయాన్: వెనిజువేలాలో రాజకీయ సంక్షోభ నివారణ కోసం యూరోపియన్, లాటిన్ అమెరికన్ నాయకులు నేడు సమావేశం కానున్నారు. ఇందు కోసం వారు గుడ్ ఫెయిత్ ప్లాన్‌పై చర్చించనున్నారు. కెనడా లిమా గ్రూప్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జరుగుతున్న నాయకుల సమావేశం, వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను దిగిపోవాలని ఒత్తిడి పెంచేందుకు అంతర్జాతీయ ప్రణాళికను రూపొందించేందుకు ఉద్దేశించింది.

మదురో పాలనలో వెనిజులాలో ధ్వంసం జరిగిందని, పేదరికం పెరిగిందని, 30 లక్షల మంది విదేశాలకు వలస వెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు వెనిజులాపై దృష్టిని సారించాయి. గత మాసంలో ప్రతిపక్ష నాయకుడు జువాన్ గుయాడో తనకు తాను అధ్యక్షునిగా ప్రకటించుకోవడంతో సంక్షోభం మొదలైంది.



పిజ్జా వద్దని మందలించినందుకు..

నార్త్ కరోలినా: పిజ్జా ఆర్డర్ చేస్తే వద్దని చెప్పిందని... నిర్ధాక్షిణ్యంగా కన్నతల్లినే కడతేర్చాడు ఓ కసాయి కొడుకు. స్థానికంగా సంచలనం క్రియేట్ చేసిన ఈ సంఘటన అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో జరిగింది. నళిని అనే 51 ఏళ్ల భారతీయ మహిళ... చాలా ఏళ్ల క్రితమే కుటుంబంతో సహా అమెరికా వెళ్లి స్థిరపడింది. ఆమెకు ఆర్నవ్ అనే కొడుకు ఉన్నాడు. ఒకే ఒక్క బిడ్డ అని ఆర్నవ్‌ను అల్లారు ముద్దుగా పెంచుకోవడంతో కొడుకు గారాబం ఎక్కువైంది. స్కూల్ చదువు చదివినంత కాలం బాగానే ఉన్న ఆర్నవ్ కాలేజ్లోకి ఎంటర్ అయ్యాక సరదాలకు, చెడు అలవాట్లకు బానిసయ్యాడు.

పిల్లాడు చెడిపోవడం గమనించిన తల్లి నళిని ఆర్నవ్ అలవాట్లను కంట్రోల్ చేయడం మొదలెట్టింది. కొడుకు చేసే ప్రతీ విషయాన్ని గమనిస్తూ... హెచ్చరించడం మొదలుపెట్టింది. ఓ రోజు తండ్రి బిజినెస్ పనుల నిమిత్తం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆకలి వేసి పిజ్జా ఆర్డర్ చేస్తానని తల్లిని ఆర్నవ్ అడిగాడు. అయితే దానికి నళిని వద్దు అని తేల్చి చెప్పేసింది. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. కోపంతో నళిని కొడుకు చెంప మీద కొట్టి మందలించింది . ఈ సంఘటనతో తీవ్ర ఆవేశానికి లోనైన ఆర్నవ్ తల్లి గొంతు నులిమి చంపేశాడు. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాలని భావించిన ఆర్నవ్ కారు దాకా ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లి అందులోకి ఎక్కించలేక అక్కడే వదిలేశాడు. ఈ సంఘటన జరిగిన సమయంలో ఆర్నవ్ వయసు కేవలం 16 ఏళ్లు. తాజాగా మైనారిటీ తీరిన ఆర్నవ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు... విచారించగా తల్లిని చంపిన విషయం ఒప్పుకున్నాడు. ఆవేశంలో తల్లిని హత్య చేసినందుకు ప్రశ్చాతాపం వ్యక్తం చేశాడు. నేరం అంగీకరించిన ఆర్నవ్‌కు అక్కడి చట్టాల ప్రకారం 12 నుంచి 15 ఏళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉన్నట్టు అంచనా.



కుప్పకూలిన భవనం..

ఇస్తాంబుల్: టర్కీలోని అతిపెద్ద నగరమైన ఇస్తాంబుల్లో ఎనిమిది అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పలువురు శిథిలాల్లో చిక్కుకుపోయారు. ఆ భవనంలోని 14 అపార్టమెంట్లలో 43 మంది నివసిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భవనంలో మూడు అంతస్తులు అక్రమంగా నిర్మించినట్లు ఇస్తాంబుల్ గవర్నర్ తెలిపారు. ఇది అకస్మాత్తుగా కూలడానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతుందని వెల్లడించారు. అత్యవసర బృందాలు శిథిలాలు వెలికితీత కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ ఘటనలో గాయపడిన ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

వావివరుసలు తప్పి.. ఓ కామాంధుడు..

టెన్నెసీ: అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో ఘోరం జరిగింది. ఓ 22ఏళ్ల యువకుడు తన సొంత చెల్లిపై దారుణానికి ఒడిగట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలోని నాష్ విల్లే.. అనే సిటిలో ఓ 22 యువకుడు..తన 11 సంవత్సరాల చెల్లెలిపై అత్యాచారం చేయసాగాడు. దాంతో ఆ బాలిక గర్భాన్ని దాల్చింది.

అయితే ఈ విషయం బయటపడితే తనకు ప్రమాదమని, పరవు పోతుందని గ్రహించిన ఆ యువకుడు.. తన చెల్లికి అబార్షన్ కూడా చేయించాడు. అయితే గత కొన్ని రోజులుగా.. కూతురి ప్రవర్తనలో తేడా గమనించిన తల్లి.. ఏం జరిగిందని ప్రశ్నించగా.. విషయం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న తల్లి కోపంతో స్థానిక పోలీసులకు సమాచారం తెలియజేసింది. దీంతో పోలీసులు ఆ కుర్రాడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో భాగంగా పలు సార్లు తన చెల్లిపై అత్యాచారం చేసినట్లు ఆ యువకుడు తెలియజేశాడు.

పొలిటికల్ పార్టీలకు వాట్సాప్ వార్నింగ్

వాషింగ్టన్: వాట్సప్‌ను దుర్వినియోగం చేయాలని చూస్తే సర్వీసులు బ్యాన్ చేస్తామంటూ వాట్సప్ సంస్థ రాజకీయ పార్టీలను హెచ్చరించింది. 2019 సాధారణ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలకు ప్రముఖ సోషల్ మీడియా మెసేజింగ్ సంస్థ వాట్సప్ గట్టి వార్నింగ్ ఇచ్చింది. వాట్సప్‌ను దుర్వినియోగం చేయాలని చూస్తే బ్యాన్ చేస్తామని హెచ్చరించింది. అయితే, ఏ రాజకీయ పార్టీకి వార్నింగ్ ఇచ్చారు? ఆయా పార్టీలు ఏ రకంగా దుర్వినియోగం చేస్తున్నాయనే విషయాన్ని మాత్రం బయటకు వెల్లడించలేదు.

'కొన్ని పార్టీలు వాట్సప్‌ను దుర్వినియోగం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. అలాంటి పార్టీలకు ఒక్కటే చెబుతున్నాం. వారి పద్ధతి మార్చుకోకపోతే మా సర్వీసులు బ్యాన్ చేస్తాం.' అని వాట్సప్ కమ్యూనికేషన్స్ హెడ్ కార్ల్ వూగ్ హెచ్చరించినట్టు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది. వాట్సప్‌లో ఎలాంటి అసభ్యకర, అభ్యంతరమైనవి లేకుండా చూడాలని మేం కోరుకుంటున్నాం.



అలాంటివి లేకుండా చేయడానికి మేం ఎప్పటికప్పుడు కృషిచేస్తున్నాం. 'అని కార్ల్ వూగ్ తెలిపారు.

వాట్సప్ సంస్థ తమతో ఎలాంటి చర్చలు జరపలేదని బీజేపీ సోషల్ మీడియా సెల్ ఇన్చార్జి అమిత్ మాల్వీయ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వాట్సప్‌ను దుర్వినియోగం చేయదని ఆ పార్టీ సోషల్ మీడియా హెడ్ దివ్య స్పందన తెలిపారు. వాట్సప్ సంస్థకు భారత్లో నెలకు 200 మిలియన్ల యూజర్లు ఉన్నారు. ప్రపంచంలోని అతి పెద్ద మార్కెట్లలో ఇండియా ఒకటి. దేశంలోని రాజకీయ పార్టీలు కూడా వాట్సప్‌ను తమ ప్రచారంలో భాగం చేశాయి. వాట్సప్ యాప్‌ను విపరీతంగా వాడుకుంటున్నాయి.

గతంలో వాట్సప్‌లో జరిగిన దుష్ప్రచారం వల్ల కొన్ని దుర్ఘటనలు జరిగాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి కొందరు యువకుల మీద మూకదాడులు జరిగాయి. దీంతో వాట్సప్ వేదికగా జరుగుతున్న ఫేక్ న్యూస్ ప్రచారాన్ని అడ్డుకట్ట వేయడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారో చెప్పాలంటూ ఓ దశలో కేంద్ర హోంశాఖ వాట్సప్‌కు నోటీసులు కూడా ఇచ్చింది. మూకదాడల తర్వాత ఫేక్ న్యూస్‌కు అడ్డుకట్ట వేసేందుకు వాట్సప్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఒకేసారి ఐదుగురు వ్యక్తులు లేదా గ్రూపులకు మించి ఫార్వర్డ్ చేయడానికి వీల్లేకుండా కట్టడి చేసింది. అలాగే, ఫార్వర్డ్ చేసిన మెసేజ్ అని తెలిపేలా 'ఫార్వర్డ్' అని పైన కనిపించేలా డెవలప్ చేసింది.



బ్రహ్మీపై అవన్నీ రూమర్లే

1000 పైగా సినిమాల్లో నటించిన గ్రేట్ కమెడియన్ డా.బ్రహ్మానందం కెరీర్ పరంగా మరో సెంచరీ కొడతారా? అంటే అవుననే ఈ ఫోటోలో కనిపిస్తున్న జోష్ చెబుతోంది. గత కొంతకాలంగా ఆయన ఆరోగ్యం బాలేదని, కాంప్లికేటెడ్ అని అంతర్జాలంలో ప్రచారమైంది. అయితే బ్రహ్మానందం ఆరోగ్యానికి ఏ ఢోకా లేదని ఆయన కుమారుడు హీరో గౌతమ్ ఇదివరకూ మీడియాకి క్లారిటీనిచ్చారు. బ్రహ్మానందానికి గుండె నొప్పి వచ్చిన మాట నిజం. అయితే దానికి ముంబైలో సర్జరీ చేయించారు. ఆ తర్వాత బ్రహ్మానందం వేగంగా కోలుకున్నారనడానికి ఇదిగో ఈ ఫోటోనే పెద్ద సాక్ష్యం. గుండె చికిత్స అనంతరం డా.బ్రహ్మానందాన్ని పరామర్శించేందుకు టాలీవుడ్ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఆయన ఇంటికే వెళారు. మునుపటి లానే బ్రహ్మీ ఎంతో చురుగ్గా కనిపిస్తున్నారు. ఆయన ఇకపైనా అంతే చురుగ్గా సినిమాలు చేయాలనీ.. చేస్తారని బన్ని అభిలాషిస్తూ ఇలా ఫోటో దిగారు. ప్రస్తుతం ఈ అరుదైన ఫోటో సామాజిక మాధ్యమాల్లోకి వచ్చి జోరుగా వైరల్ అవుతోంది.

హైదరాబాద్ మణికొండ ఏరియాలో ఓ ఖరీదైన డూప్లెక్స్ ఇంట్లో బ్రహ్మానందం నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఆయన సన్నిహితులు, బంధువులు పరామర్శకు విచ్చేస్తున్నారట. బ్రహ్మీ వేగంగా కోలుకుని ఇకపైనా తన నటనను కొనసాగిస్తారనే అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



వరమా.. శాపమా!

ప్రస్తుతం తరంలో హీరోయిన్లకు బరువు పెరగడం అనేది పెద్ద సమస్యగా మారింది. ఎన్నో వైవిధ్యభరితమైన సినిమాలు చేసి తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని సంపాదించుకున్న అనుష్క కూడా ఇటీవలి కాలంలో ఈ బరువు సమస్యతో సతమతమవుతోంది. ఒక్క సినిమా కోసం తను చేసిన ఆ సాహసమో... లేదంటే యోగా ట్యూటర్ కాబట్టి పెరిగినంత సులభంగా తగ్గిపోవచ్చుననే ఓవర్ కాన్ఫిడెన్సో కానీ మొత్తంమీద అధిక బరువు సమస్య ఇప్పుడు తన కెరీర్‌ని డైలమాలో పడేసింది. అయితే... బరువు తగ్గడానికి అనుష్క చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలిస్తున్నట్లు లేవు. ఈ నేపథ్యంలో రెండు నెలల్లో బరువు తగ్గి స్లిమ్‌గా మారినట్లయితే తన సినిమాలో అవకాశం ఇస్తానని ఓ దర్శకుడు అనుష్కకు ఓ ప్రామిస్ చేసారట! ఈ ఆఫర్ కాస్తా ఊరిస్తున్నా, ఇన్నాళ్లుగా తగ్గని బరువు రెండు నెలల్లో ఎలా తగ్గాలో మరి... స్వీటీనే చెప్పాలి.



అన్ని భాషల్లో ఆర్ఆర్ఆర్

జక్కన దర్శకత్వంలో వస్తున్న ఆర్ఆర్ఆర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో జరుగుతుంది. ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్‌తోపాటు 1000 మంది పాల్గొంటుండగా యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో చరణ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు.

ఈసినిమాలో తమిళ నటుడు సముద్రఖని ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో నటించే హీరోయిన్లు ఎవరు అన్నదానికి ఇంకా క్లారిటీ ఇవ్వలేదు చిత్ర బృందం. అయితే జక్కన మాత్రం బాలీవుడ్ కథానాయికలను తీసుకునే ఆలోచనలో వున్నారట. వచ్చే ఏడాదిలో తెలుగుతోపాటు ఇతర భాషల్లో కూడా విడుదలకానుంది ఈ చిత్రం.



నేనే ముఖ్యమంత్రి ప్రీ రిలీజ్

స్వలాభం కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చే రాజకీయ నాయకులను మాత్రమే మనం ఎన్నుకోవాలనే కథాంశంతో 'నేనే ముఖ్యమంత్రి' చిత్రం నిర్మించాం. విద్యార్థులే దేశ భవిష్యత్తు కాబట్టి, వారు భవిష్యత్తులో ఎలాంటి నాయకుడిని ఎన్నుకోవాలి? ఎలాంటి నాయకుణ్ని ఎన్నుకోవద్దు అని మా సినిమా చూసి తెలుసుకుంటారని వారి సమక్షంలో నందిగామలోని చైతన్య కాలేజ్‌లో మా చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు 'నేనే ముఖ్యమంత్రి' నిర్మాతల్లో ఒకరైన అట్లూరి నారాయణ రావు. శ్రీ వైష్ణవి ఫిలింస్, ఆలూరి క్రియేషన్స్ పతాకాలపై అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా 'నేనే ముఖ్యమంత్రి' చిత్రాన్ని నిర్మించారు. దేవిప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రల్లో మోహన్ రావిపాటి దర్శకత్వంలో రూపొందిన అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ నెల 8న గ్రాండ్‌గా విడుదవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం నందిగామలోని చైతన్య కాలేజ్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ... "మనల్ని పాలించే నాయకులను ఎటువంటి వారిని ఎన్నుకోవాలి? ఎటువంటి నాయకును ఎన్నుకోవద్దు? అనే అంశాన్ని మా చిత్రం ద్వారా చూసిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో నిస్వార్థంతో సేవ చేసే నాయకులు మనకు అవసరం. సరైన నాయకుణ్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత మనదే అనేది మా సినిమాలో చూపించాం. ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది" అన్నారు. ఆలూరి సాంబశివరావు మాట్లాడుతూ..."మా చిత్రంలో సమకాలీన రాజకీయ అంశాల గురించి చర్చించాం. అన్ని వర్గాలకు నచ్చే అంశాలతో పాటు అందర్నీ ఆలోచింపజేసేలా సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. పదవి కోసం ఆరాటపడే నాయకులను కాకుండా బాధ్యతతో పని చేసే వారికే పట్టం కట్టాలని చెప్పే చిత్రమిది. ఈ నెల 8న విడుదల చేస్తున్నాం." అన్నారు. నందిగామ మున్సిపల్ ఛైర్మన్ పద్మావతి, సంగీత దర్శకుడు ఫణి కళ్యాణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎమర్జింగ్ స్టార్ 2018

ఎం.ఎస్.ధోని బయోపిక్, లస్ట్ స్టోరీస్ (లఘుచిత్రం)తో పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత 'భరత్ అనే నేను' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. ఇక్కడా బంపర్ హిట్‌తో డెబ్యూ.. అందుకే లేటెస్ట్ గా దుబాయ్‌లో జరిగిన జీ సినిమా తెలుగు అవార్డ్స్‌లో కియారా 'ఎమర్జింగ్ స్టార్ ఆఫ్ ద ఇయర్ 2018' అవార్డును సొంతం చేసుకోవడంతో తన కాన్ఫిడెన్స్ ను రెట్టింపు చేసింది. ఈ పురస్కారంతో కియరా మరింత ఉప్పొంగిపోతోంది. 2018 అన్ని విధాలా అంటే ఇటు సినిమాల్లోనూ, అటు వెబ్ సిరీస్ 'లస్ట్ స్టోరీస్' తోనూ తన క్రేజు తారా స్థాయికి చేరింది. ఒక్క 'లస్ట్ స్టోరీస్'తోనే కియారా నేమ్ బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలోనే మార్మోగిపోయింది. 2018లో క్రేజీ తారగా పేరు తెచ్చుకున్న కియారాకు 'ఎమర్జింగ్ స్టార్ ఆఫ్ ద ఇయర్' దక్కడం సముచితమే అని బాలీవుడ్ అభిమానులు మార్కులు వేస్తున్నారు. అన్నట్టు కియారా నటిస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'కళాంక్'. ఇందులో కియారా స్పెషల్ అప్పియరెన్స్ ఇస్తోంది. ధర్మా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దిల్జీత్ దొసాంజే కీలక పాత్రల్లో నటిస్తు 'గుడ్ న్యూస్'లోనూ కియారా నటిస్తోంది. అసలు కియరా బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అంటే... కియరాకు సినిమా నేపథ్యం ఉంది. బాలీవుడ్ గ్రేట్ యాక్టర్ అశోక్‌కుమార్ మనవరాలు ..

90లలో పాపులర్ హీరోయిన్‌కి మేనకోడలు అయిన కియారా అటు ఉత్తరాదితో పాటు ఇటు దక్షిణాదినా ఫుల్ బిందాస్‌గా కెరీర్‌ని పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటి వరకు తన కుటుంబ నేపథ్యం గురించి వేదికలపై చెప్పుకోని ఈ అమ్మడు.. సొంత ట్యాలెంటుతోనే ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది.



ప్రేమ పరిచయం గమ్మత్తుగా

ప్రేమ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'ప్రేమ పరిచయం' గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. రజత్ రాఘవ్ హీరోగా నటిస్తున్నారు. సిద్ధికా శర్మ, కరిష్మా కౌల్ నాయికలు. శివ.ఐ దర్శకుడు. ఎం. పెరుమాండ్లు నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి చిత్ర నిర్మాత పెరుమాండ్లు కెమెరా స్విచ్చాన్ చేశారు. పారిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి క్లాప్‌నిచ్చారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర నిర్మాత మాట్లాడుతూ "యువతీ యువకులు తెలిసీ తెలియక ఎన్నో పొరపాట్లు చేస్తుంటారు. అయితే వాటి ప్రభావం భవిష్యత్తుపై ఉంటుందని చెప్పే చిత్రమిది. రొమాన్స్ తో పాటు అన్ని అంశాలూ ఇందులో ఉంటాయి. యువతకు చక్కటి సందేశాన్నిచ్చే సినిమా అవుతుంది. ఈ నెల 11 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం" అని అన్నారు. దర్శకుడు శివ మాట్లాడుతూ "ప్రేమ గురించి ఎన్నోచిత్రాలు వచ్చాయి. అయితే అసలు ప్రేమ ఎలా స్టార్ట్ అవుతుంది? అనే విషయాన్ని లోతుగా ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఈ సినిమా ద్వారా కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. బ్యాక్ గ్రౌండ్‌లో వచ్చే నేచర్‌ని కూడా విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా చూపిస్తున్నాం. దీన్ని కొత్త టెక్నాలజీతో చేస్తున్నాం. దర్శకుడిగా ఇది నా తొలి సినిమా. నిర్మాత మా ఫ్రెండ్. ఆయన పరిచయమవుతూ నన్ను డైరక్టర్‌గా పరిచయం చేస్తున్నారు" అని అన్నారు.


లెస్బియన్‌లను సమాజం అంగీకరించాలి

రెజీనా కసాండ్రా తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలలో పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. ఈ భామ కన్ను ప్రస్తుతం బాలీవుడ్ పై పడింది. తనవైపు వచ్చిన అవకాశాలను అందుకుంటూ అదృష్టాన్ని పరీక్షించుకునే రెజీనా బాలీవుడ్ హీరోయిన్ సోనమ్ కపూర్‌తో కలిసి 'ఏక్ లడకీ కో దేఖాతో ఐసా లగా' అనే లెస్బియన్ లవ్‌స్టోరీ లో నటించింది. ఈ సినిమాలో రెజీనా, సోనమ్‌ల ప్రేమికులుగా కనిపించనున్నారు. తాజాగా రెజీనా ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తాను దక్షిణాదికి మాత్రమే పరిమితం అవ్వాలనుకోవడం లేదనీ, అన్ని భాషల్లోనూ నటిస్తాననీ, నటిగా ఎలాంటి పాత్రను అయినా పోషించేందుకైనా సిద్ధమని చెప్పేందుకే లెస్బియన్‌గా చేయడానికి వెనుకాడలేదని పేర్కొంది. అయినా అందులో తప్పేం ఉంది, సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది, మనం 21వ శతాబ్దంలో ఉన్నాము ఎవరు ఎలా కావాలంటే అలా జీవించే స్వేచ్ఛ ఉంది. లెస్బియన్లను సమాజం కూడా అంగీకరించాలని అంది.



ఆముదంతో కనుబొమలు ఒత్తుగా..

చూడడానికి అందంగా ఉన్నా కనుబొమలు మాత్రం కనిపించవు. ఆ కనుబొమలను అందంగా మార్చాలంటే ఆముదాన్ని ఉపయోగించాలి. రోజూ పడుకునే ముందు కనుబొమలకు ఆముదం రాసి సున్నితంగా మర్ధన చేస్తే ఫలితం ఉంటుంది. గ్లిజరిన్, ఆముదం సమపాళ్ళల్లో కలిపి ఈ మిశ్రమాన్ని కనురెప్పలకు పట్టించాలి. కళ్ళల్లోకి వెళ్ళకుండా చూసుకోవాలి. దీంతో కనురెప్పలు దట్టంగా పెరుగుతాయి. మస్కారాని అరుదుగా వాడడం మంచిది. మస్కారా వేసుకున్న తర్వాత దాన్ని తీసేయకుండా పడుకోకూడదు. బేబీ ఆయిల్‌లో దూది ముంచి జాగ్రత్తగా మస్కారాను తుడవాలి.



మౌనం.. ధ్యానం.. ఆత్మస్థైర్యం




ఉదయం లేచినప్పటి నుండి మళ్ళీ నిద్రపోయేంత వరకూ ఏదో ఒక విషయాన్ని మాట్లాడుతూ, ఆలోచిస్తూనే ఉంటాం కదా! కాసేపు మౌనంగా ఉండడం అంటే అబ్బో ఊహించుకోలేము. కానీ సాధ్యమే నండీ... శరీరానికి కావాల్సిన ఆరోగ్యం, మెదడుకు కావాల్సిన ప్రశాంతతని చేకూర్చేది మౌనమేనని రుజువైంది. మౌనంతో మేలు జరుగుతుందంటే ఎవరు కాదంటారు. మౌనం మంచిదేనని తెలుసుకోవాలంటే పాటించి చూడాల్సిందే...

రోజూ ఒక్క అర గంట మౌనంగా ఉంటే చక్కటి శారీరక మానసిక ఆరోగ్యం మీ సొంతం అవ్వటమే కాదు. ఆశలు, ఆశయాలు, కలలు, కోరికలు అన్ని నెరవేరుతాయని చెబితే నమ్మగలరా? నమ్మలేం కదూ? కానీ ఇది నిజం. అదెలా సాధ్యమంటే, ప్రయత్నిస్తే తెలుస్తుంది సాధ్యమా కాదా అనేది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎంత సేపు మాట్లాడతాం.. ఎప్పుడైనా లెక్కేశారా.. పోనీ ఎంత సేపు మౌనంగా ఉండగలరో ప్రయత్నించారా.. ఓసారి ట్రై చేద్దామా..

పదే.. పది నిమిషాలు..

మౌనంగా ఉండటమంటే ఇంట్లో పనులు చేస్తూ, లేదా టీ.వీలోని కార్యక్రమాన్ని చూస్తూ, కంప్యూటర్ ముందు కూర్చొని ఇంటర్నెట్ బ్రౌజ్ చేస్తూ సైలెంట్‌గా ఉన్నా కదా అంటే ఇది కాదు మౌనమంటే. అచ్చంగా మౌనంగానే ఉండగలగాలి. పనులు అన్నీ చేస్తున్నపుడు నోరు మాట్లాడకపోయినా, మనసు ఆలోచనల్లో పరుగులు తీస్తూనే ఉంటుంది. ఆ ఆలోచనలు మనల్ని మన నుంచి వేరుగా ఉంచలేవు. కాబట్టి కళ్ళుమూసుకుని మాటని, మనసుని మౌనంలోకి జార్చితే చాలు. అలా ఓ పదినిమిషాల తర్వాత కళ్ళు తెరిచి చూస్తే మనసు హాయిగా, ప్రశాంతంగా ఉంటుందట.



మౌనంతో మాటలు వస్తాయి..

మౌనం.. మనల్ని మనకు దగ్గర చేస్తుంది. రోజంతా ఎవరెవరితోనో మాటలు, వాదనలు, కోపాలు, అరుపులు... అక్కడితో అయిపోతుందా.. లేదు. అవన్నీ మనసులో చేరి ఆలోచనలుగా మారి ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. వదిలించుకోవటం ఎలాగంటే సింపుల్. కాసేపు మౌనంగా కళ్ళు మూసుకోవటమే. దాన్ని ధ్యానమనండి, మెడిటేషన్, ప్రాణామాయం ఏదైనా కావచ్చు ఏకాగ్రతగా శ్వాసపై ధ్యాస పెట్టగలిగితే చాలు. అ తరువాత అంతక ముందు వరకు ఉన్న చికాకు ఇట్టే మాయమవుతుంది. అంతే కాదు మౌనంగా ఉండటం వల్ల మాటలు కూడా చక్కగా వస్తాయట.

ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది..

మౌనంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసంతో ఉండే వారి మాటలు సూటిగా, స్పష్టంగా ఉంటాయి. బెరుకు, బెదురు అనవసరమైన కబుర్ల లాంటి వృధా సమయం వీరికి ఉండదు. ఈ అలవాటు ఎదుట వ్యక్తులకు మనపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచుతుంది. ఆచి తూచి మాట్లాడటం చేతకాని తనం కానే కాదు. తనపై తన ఆలోచనలపై తనకున్న పట్టును, నమ్మకాన్ని తెలియచేస్తుంది. చేజారిన కాలం, పెదవి దాటినా పలుకు వెనక్కి రావు. అందుకే వాటిని ఎంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలో తెలిసి తీరాలి. అందుకు మౌనంతో సాధ్యమైతే మాటల్లో నోరు జారకుండా అదుపు చేసే ఆలోచనా శక్తి పెరుగుతుందన్న మాట.

పరిస్థితులను ఆపగలిగేది..

ఉదయం లేచిన దగ్గర్నుంచి అన్ని రకాల అనుభూతులు, భావాలు, ఆలోచనలు పట్టి పీడిస్తుంటాయి. వాటి ప్రభావం మనస్సుపై పడుతుంది. దాంతో ఒత్తిడి, చికాకు మొదలై మన మాటలపై, చేతలపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఫలితంగా సంబంధాలలో కోపతాపాలు, ఆరోపణల మధ్య ఇరుక్కుంటాయి. వీటన్నింటి ప్రభావం మనస్సుపై చక్రంలా తిరిగినట్టు ఒకదాని వల్ల మరొకటి ఏర్పడి ప్రమాదాల్లో చిక్కుకునేలా చేస్తాయి. ఈ చక్రాన్ని ఆపే అవకాశం మన చేతుల్లోనే వుంది. అదే 'మౌనం'. ఆ మౌనంలో ఏ అలోచనలు ఉండకూడదు. ప్రశాంతంగా మనసుతో మమేకమై , ఓ పదినిమిషాలు అయినా ఉండగలిగితే చాలు. ఫలితం ఏమిటన్నది చెప్పటం ఎందుకు, ఇక మీరే తెలుసుకోవచ్చు. ఒకసారి అ ప్రశాంతతని రుచి చూసాక దాని గరించి మీరే మరో పదిమందికి చెబుతారు.



'చిటికె'లో సాధ్యం..!

- చపాతీలు వత్తేటప్పుడు మధ్యలో కాస్త నూనెవేసి మడత లతో చేసి హాట్ ప్యాక్‌లో ఉంచితే 6నుండి7 గంటలపాటు మెత్తగా ఉంటాయి.
- అన్నం ఉడికేటప్పుడు రెండు మూడు చుక్కల నిమ్మరసం పిండితే అన్నం తెల్లగా ఉంటుంది.
- నెయ్యి కాచి దించే ముందు చిటికెడు మెంతులు వేస్తే నెయ్యి సువాసనగా ఉంటుంది.
- అరకిలో గోధుమపిండికి రెండు మక్కిన అరటిపళ్ళు, కప్పు పెరుగు కలిపితే చపాతీలు మెత్తగా ఉంటాయి.
- కార్పెట్లు మురికిగా మారి దుర్వాసన వస్తుంటే కప్పు బేకింగ్ సోడాకి, చెంచాడు ఏదైనా సుగంధ నూనెలని కలపాలి. ఈ మిశ్రమాన్ని కార్పెట్ పై చల్లి తెల్లారి వాక్యుమ్ క్లీనర్‌తో శుభ్రం చేసుకొంటే సరిపోతుంది.

పెయిన్ 'కిల్లర్స్'..

బాధ కలగగానే ఏదో ఒక టాబ్లెట్ వేసుకుంటే గానీ తగ్గదనుకునే అనుమానంతో నొప్పి రాగానే పెయిన్‌కిల్లర్స్‌ని వాడుతుంటారు చాలా మంది. కానీ అది ఎంతవరకు వాడొచ్చో, ఎలాంటి వారు వాడకూడదనే విషయాలను తెలుసుకోకుండానే తక్షణ నిర్ణయాలను తీసుకుంటారు. అందులోనూ గర్భిణీలు అస్సలు పెయిన్ కిల్లర్స్‌ని వాడకూడదంటున్నారు వైద్యులు. ఎందుకంటే పుట్టబోయే పిల్లలకు సంతానోత్పత్తి సమస్యలతో పాటు పిల్లల డీఎన్ఏపై ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. పారాసిటమాల్‌ను గర్భిణులు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యుని సలహా మేర మాత్రమే వాడాలి. పిండం అభివృద్ధి చెందుతున్న దశలో పెయిన్ కిల్లర్స్ మగసంతానంపై దుష్ప్రభావం చూపుతుంది. పురుషుల వృషణ సంబంధమైన కణజాలంపై చేసిన పరిశోధనలో కణజాలంపై పారాసిటమాల్, ఐబ్యుప్రోఫెన్లను ప్రయోగించగా వీర్యాన్ని ఉత్పత్తి చేసే కణాల సంఖ్య 25 శాతానికి పడిపోయిందని, వీటి వాడకంతో బీజకణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం, ఆ కారణంగా పుట్టబోయే ఆడపిల్లల్లో సంతానోత్పత్తిలో సమస్యలు తలెత్తుతాయని శాస్త్రజ్ఞులు గుర్తించారు.



గర్భం దాల్చిన తర్వాత పెయిన్ కిల్లర్స్ తీసుకునే విషయంలో మహిళలు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ఒకవేళ తప్పనిసరైతే అతి తక్కువ డోసు మందులను, పరిమిత కాలం వాడాలన్న వైద్యుల సలహాను తప్పనిసరిగా పాటించాలి.

మాటే మంత్రం..

లభించే చిన్న అవకాశాలే..
భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకి చేరుస్తాయి..





పన్నీర్ పాయసం

ఉత్తరాది వారు ప్రత్యేక పండగలకి చేసుకునే ప్రసిద్ద తీపి వంటకం పన్నీర్ పాయసం. పనీర్ ఖీర్ అని కూడా పిలుస్తారు. పన్నీర్, పాలు, గట్టిపడిన పాలు, సువాసన నిచ్చే ఏలకుల పొడి, డ్రై ఫ్రూట్లతో తయారుచేస్తారు. దీన్ని పండగలప్పుడే కాక, వ్రతాలప్పుడు కూడా చేస్తారు. గట్టిపర్చిన పాల తియ్యదనం, డ్రైఫ్రూట్ల ముక్కలతో, పన్నీర్ కొంచెం ఉప్పుదనం తగులుతూ మంచి రుచిని అందిస్తాయి. దీన్ని చిటికెలో శ్రమలేకుండా తయారుచేయవచ్చు. చల్లగా తింటేనే దీని రుచి చాలా బాగుంటుంది.

కావలసిన పదార్ధములు:

తరిగిన పన్నీర్ 1 కప్పు, గట్టిపర్చిన పాలు 1 కప్పు, పాలు 1 లీటరు, డ్రై ఫ్రూట్లు, ఏలకుల పొడి 1 చెంచా.

తయారు చేయు విధానం:

1. తరిగిన పన్నీర్ ను వేడి పెనంలో వేయండి. 2. వెంటనే పాలను జతచేయండి. 3. 56 నిమిషాల వరకు ఉండలు కట్టకుండా కలుపుతూనే ఉండండి. 4. గట్టిపాలను కూడా పోసి, మరో అరగంటపాటు కలుపుతూనే ఉండండి. 5. ఏలకుల పొడిని వేసి బాగా కలపండి. 6. డ్రై ఫ్రూట్లను, ఒక చెంచా తరిగిన బాదం పప్పును జతచేయండి. 7. బాగా కలిపి ఒక గిన్నెలోకి మార్చుకోండి. 8. తరిగిన బాదం, కిస్మిస్‌లతో పైన గార్నిష్ చేస్తే సరి.





పన్నీర్ నెగ్గెట్స్

కావలసిన పదార్థములు:

పనీర్ 200 గ్రాములు, బ్రెడ్ ముక్కలు 4, అల్లంపేస్టు 1 చెంచా, వెల్లుల్లి పేస్టు 1 చెంచా, మిరియాల పొడి 1 చెంచా, కారం 1 చెంచా, నిమ్మకాయ అర చెక్క, మొక్కజొన్న పిండి, 1 కప్పు మైదాపిండి, 2 చెంచా కొత్తిమీర (తరిగినది) నూనె 2 కప్పులు

తయారు చేయు విధానం:

బౌల్‌లో అల్లం, వెల్లుల్లి పేస్టును వేసి, చెంచా కారం వేయాలి. అరచెంచా మిరియాల పొడి, రుచికి సరిపడ ఉప్పును కూడా వేసుకోవాలి. 1 కప్పు తరిగిన కొత్తిమీర వేసి, నిమ్మరసం పిండండి. బాగా కలిపి తరిగిన పన్నీర్ ముక్కలు వేయండి. మిశ్రమం మొత్తం బాగా కలిసేట్టు 30 నిమిషాలు అలా నానబెట్టుకోవాలి. నాలుగు బ్రెడ్ ముక్కలను తీసి మిక్సీలో క్రంబ్స్ లాగా ముక్కలు చేయండి. ఈ బ్రెడ్ క్రంబ్స్‌ను వేడిచేసిన నూనె ఉన్న పెనంలో వేయండి. 3 నుంచి 4 నిమిషాలు సన్నని మంటపై ఉంచి, బంగారు గోధుమ రంగులోకి వచ్చేదాకా కలపండి. ప్లేట్లోకి తీసుకుని, మాములు గది ఉష్ణోగ్రతలోనే చల్లబడనివ్వండి. ఇప్పుడు, మీడియం సైజు గిన్నె తీసుకుని అరకప్పు మొక్కజొన్న పిండిని వేయండి. 2 చెంచాల మైదాను వేసి, అరచెంచా మిరియాల పొడిని వేయండి. చిటికెడు ఉప్పు, కొన్ని నీళ్ళు పోసి, గడ్డలు లేకుండా బాగా కలపండి. ఇప్పుడు మెరినేటడ్ పన్నీర్ ముక్కలు తీసుకుని, ఈ మిశ్రమంలో ముంచండి. తర్వాత ఈ ముక్కలను బ్రెడ్ క్రంబ్స్ పొడిపై దొర్లించి, నూనెలో వేయండి. బ్రౌన్ రంగు వచ్చేదాకా వేగించుకోవాలి. బంగారు రంగులోకి మారాక, నూనె నుంచి తీసేసి టమాటా కెచప్ తో వేడివేడిగా వడ్డించండి.

పన్నీర్ టిక్కా

పన్నీర్ ఐటమ్స్ చూడడానికీ తినడానికీ ఫన్నీగా, వెరైటీగా ఉంటాయి. కారంకారంగా.. రుచికరంగా ఉండే పన్నీర్ రోల్స్ తయారీ విధానం ఈ రెసిపి తయారుచేయడం చాలా సులభం. పిల్లలు పెద్దలు వీటిని ఇష్టంగా తింటారు. లోపల సాఫ్ట్‌గా బయట క్రిస్పీగా ఉండే ఈ పన్నీర్ టిక్కా రెసిపి అందరికీ నచ్చుతుంది. పిల్లలు ఇష్టంగా తింటారు. పనీర్ టిక్కా రెసిపి ఎలా తయారుచేయాలో చూద్దాం..



కావల్సిన పదార్థాలు:

పనీర్ (కాటేజ్ చీజ్) : 1 కప్పు (మీకు నచ్చిన షేప్ లో కాస్త మందంగా కట్ చేసుకోవాలి), గ్రీన్ క్యాప్సికమ్ : 2(2ఇంచులలో కట్ చేసుకోవాలి), రెడ్ క్యాప్సికమ్ 1(1 ఇంచులలో కట్ చేసుకోవాలి) మీడియం ఉల్లిపాయ: 1(చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ : 2 టీస్పూన్లు, ఇంగువల: 1కప్పు, కారం : 1/2టీస్పూన్, గరం మసాలా: 1/4టీస్పూన్, కస్తూరి మేతి: 1/2టీస్పూన్, ధనియాల పొడి : 1టీస్పూన్, ఛాట్ మసాలా: 1 టీస్పూన్, నూనె: 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు: రుచికి సరిపడా, నిమ్మరసం : 2 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ మరొకటి మీడియం సైజ్: గార్నిష్ కోసం సన్నని స్లైస్ గా కట్ చేసుకోవాలి.

తయారుచేసే విధానం:

రెండు కప్పుల(ప్లెయిన్ పెరుగు)తీసుకుని ఒక పల్చటి క్లాత్ లో వేసి గట్టిగా చుట్టి 30 నిముషాలు పక్కన పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల పెరుగులోని నీరు లేకుండా వడిగిపోతుంది. ఈ పెరుగును మరో గంట అలాగే ఉంచాలి. ఈ గట్టిపడ్డ పెరుగును ఉపయోగించాలి. తయారుచేయు విధానం : 1. చిక్కగా పెరుగును ఒక బౌల్లో తీసుకుని, అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, గరం మసాలా, మేతి పౌడర్, ధనియాల పొడి, ఒక టీస్పూన్ ఛాట్ మసాల మొత్తం మిక్స్ చేస్తే మ్యారినేషన్ తయారైనట్లే... 2. తర్వాత ఈ మిశ్రమంలో రెడ్ అండ్ గ్రీన్ క్యాప్సికమ్ ముక్కల, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా మిక్స్ చేయాలి. గట్టి పెరుగు ఈ ముక్కలకు బాగా పట్టే విధంగా చేయాలి. ఇలా మ్యారినేషన్ చేసిన తర్వాత ఒక గంట సేపు అలాగే ఉంచాలి. సాధ్యమైతే ఈ మిశ్రమాన్ని రాత్రి తయారుచేసి, ఫ్రిజ్ లో పెట్టుకోవచ్చు. 3. రెడ్ క్యాప్సికమ్, గ్రీన్ క్యాప్సికమ్, పనీర్, ఆనియన్ ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఒక చిన్న టూత్ పిక్ షీకర్ కు గుచ్చి పెట్టాలి.ఇలా అన్నింటిని తయారుచేసుకుని, ఒక పక్కన పెట్టుకోవాలి. 4. తర్వాత నాన్ స్టిక్ గ్రిడిల్ లేదా తవా తీసుకుని, అందులో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడి అయ్యాక అందులో పన్నీర్ గుచ్చి పెట్టిన టూత్ స్టిక్స్‌ను నిధానంగా ఉంచి, సున్నితంగా షాలో ఫ్రై చేసుకోవాలి. 5. టూత్ పిక్ ను రెండు వైపులా తిప్పుతూ లైట్ బ్రౌన్ కలర్ వచ్చే వరకూ మీడియం మంట మీద ఫ్రై చేసుకోవాలి. ఒక 5 నిముషాలు ఫ్రై చేసుకున్న తర్వాత క్రిస్పీగా డ్రైగా మారిన తర్వాత వాటిని సర్వింగ్ ప్లేట్ లోనికి మార్చుకోవాలి. 6. సర్వింగ్ ప్లేట్ లోనికి మార్చుకొన్న తర్వాత టూత్ స్టిక్స్ ను తీసేసి, వాటి మీద ఒక టీస్పూన్ ఛాట్ మసాలా మరియు కొద్దిగా నిమ్మరసం చిలకరించి ఆనియన్ స్లైస్ ను గార్నిష్ గా అలంకరించి సర్వ్ చేయాలి. అంతే పన్నీర్ టిక్కా రెడీ. దీన్ని పుదీనా చట్నీతో సర్వ్ చేస్తే చాలా టేస్ట్ గా ఉంటుంది.

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	409	విజయవాడ	406
ముంబయి	459	ఢిల్లీ	447
చెన్నై	450	బెంగళూరు	440



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115



సెన్సెక్స్ –4.14
36,971



నిఫ్టీ +6.95
11,069

రూపాయి
₹71.45
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
34,385
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 (గ్రాములకు)/(రూ.)లలో

తగ్గిన బంగారం ధర

ముంబై: అంతర్జాతీయ సానుకూలతలు, కొనుగోళ్ల అండతో గత కొద్ది రోజులుగా పైపైకి పోతున్న పసిడి ధర గురువారం కాస్త దిగొచ్చింది. నేటి బులియన్ మార్కెట్‌లో రూ.270 తగ్గడంతో 10 గ్రాముల బంగారం ధర రూ. 34,180కి పడిపోయింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి గిరాకీ తగ్గడంతో ఈ లోహం ధర దిగొచ్చినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు వెండి మాత్రం నేడు మరింత పెరిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కేజీ వెండి ధర రూ.120 పెరిగి రూ.41,500కు చేరింది. ఇక అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. న్యూయార్క్ మార్కెట్‌లో ఔన్సు పసిడి ధర 1,303.94డాలర్లు, ఔన్సు వెండి ధర 15.63 డాలర్లు పలికింది.

రియల్ ఎస్టేట్ కోసం స్టాంజా ఎస్టేట్ వినూత్న యాప్

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రపంచస్థాయి స్టూడెంట్ ప్రొవైడర్‌గా ఖ్యాతినార్జించిన స్టాంజా లివింగ్, ప్రాపర్టీల లిస్టింగ్‌లను సమర్థవంతంగా, వేగంగా సమాచారాన్ని తెలుసుకునేందుకు స్టాంజా ఎస్టేట్ యాప్‌ను స్టాంజా లివింగ్ విడుదల చేసింది. స్టాంజా లివింగ్‌తో భాగస్వామ్యం కలిగిన స్థిరాస్తుల యజమానులు, రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్లు, డెవలపర్లకు ఈ యాప్ సమర్థవంతమైన విధానంలో ఆధునిక, నాణ్యత కలిగిన వసతి సదుపాయాలను విద్యార్థులకు కల్పిస్తుందని స్టాంజా తెలిపింది. 2021 నాటికి లక్ష పడకలకు పైగా సామర్థ్యానికి చేరుకోవడమే తమ లక్ష్యమని స్టాంజా లివింగ్ సహ వ్యవస్థాపకులు అనింద్య దత్త, సందీప్ దాల్మియాలు తెలిపారు. బ్రాండ్ నిర్మాణాన్ని చేపట్టే రీతిలో వివిధ కార్యక్రమాలను ప్రకటిస్తామని వివరించారు.

ఫార్చ్యూన్ మేగజైన్ సర్వేలో ఫెడెక్స్‌కు 10వ స్థానం

ఇండియా: ప్రపంచంలోని అత్యంత ఆదరణీయ కంపెనీల జాబితాలో ఫెడెక్స్ 10వ స్థానంలో నిలిచింది. ఆర్థిక ప్రదర్శన, కార్పొరేట్ గుర్తింపులకు సంబంధించిన తొమ్మిది కీలక అంశాలను ఆధారంగా తీసుకుని ఫార్చ్యూన్ మేగజైన్ ఈ సర్వేను రూపొందించింది. ఈ సందర్భంగా ఫెడెక్స్‌కార్ప్ ప్రెసిడెంట్, చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్ డేవిడ్ జె. బ్రాంక్‌జెక్ మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా ఫార్చ్యూన్ ప్రచురించే అత్యంత ఆదరణీయ కంపెనీల ర్యాంక్‌లలో స్థానం పొందడం మాకు ఎంతో గర్వకారణమని తెలిపారు.

కీలక వడ్డీ రేట్లు తగ్గించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలో తొలి సమీక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు
- రెపోరేటు 6.5 నుంచి 6.25 తగ్గించిన ఆర్‌బీఐ
- రివర్స్ రెపో రేటు 6 శాతానికి తగ్గింపు
- గృహరుణాలపై తగ్గనున్న వడ్డీ రేట్లు
- రూ. 1.6 లక్షల వరకు హామీ లేకుండా వ్యవసాయ రుణాలు: ఆర్‌బీఐ



ఢిల్లీ: ఊహించినట్లుగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలో జరిగిన తొలి సమీక్ష సమావేశంలో యథాతథ నిర్ణయానికి బ్రేక్ వేసి రేట్ కట్‌కు నిర్ణయించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు కట్ చేస్తూ ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ) తీర్మానించింది. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25శాతానికి దిగి వచ్చింది. అలాగే బ్యాంకు రేటు 6.75 నుంచి 6.50 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణ అంచనాలను కూడా సవరించింది. మొత్తం ఆరుగురు సభ్యులున్న ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ)లో నలుగురు రేటు కట్‌కు ఆమోదం తెలిపారని శక్తి కాంత దాస్ వెల్లడించారు. ఆరవ ద్వైమాసిక రివ్యూలో రెపో రేటు (వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐ తీసుకునే వడ్డీరేటు)ను 6.25 శాతంగా ఉంచింది. రివర్స్ రెపో (వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీరేటు) 6.25శాతంనుంచి 6 శాతానికి తగ్గింది. దీంతో స్టాక్ మార్కెట్ పాజిటివ్‌గా స్పందిస్తున్నాయి. బ్యాంకింగ్ షేర్లు లాభపడుతున్నాయి.

గృహ, వాహన రుణాల వడ్డీరేట్లు తగ్గుతాయ్

ఆర్‌బీఐ పాలసీ రివ్యూలో వడ్డీరేట్ల కోతకే మొగ్గు చూపడంతో గృహ, వాహన రుణాల వడ్డీరేట్లు తగ్గుముఖం పట్టనున్నాయి. రెపో రేటుపై పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు తగ్గడం గృహ, వాహన రుణ గ్రహీతలకు శుభపరిణామమని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీరేట్ల కోత విధించి గృహ, వాహన కొనుగోలుదారులకు కేంద్ర బ్యాంకు శుభవార్త అందించిందని పేర్కొన్నాయి. ఈ సవరించిన రేట్లను బ్యాంకులు వినియోగదారులక పాస్ చేస్తాయని తాము భావిస్తున్నామని నైట్ ఫ్రాంక్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ షిషీర్ బైజల్ చెప్పారు. ఇది కస్టమర్ల కొనుగోలు నిర్ణయాన్ని సులభతరం చేస్తుంది. కొంతకాలంగా డిమాండ్ లేక నీరసించిన రియల్ రంగ అభివృద్ధికి ఇది కీలక అడుగు అని వ్యాఖ్యానించారు. కీలక వడ్డీరేట్లపై ఆర్‌బీఐ యథాతథానికే మొగ్గు చూపనుందన్న విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా మానిటరీ పాలసీ కమిటీ స్పందించింది. వరుస యథాతథ పాలసీకి చెక్ చెబుతూ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని కమిటీ రెపో రేట్ కోతకే మొగ్గు చూపింది. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగి వచ్చింది. రివర్స్ రెపో 6 శాతానికి చేరింది. అలాగే బ్యాంక్ రేటు 6.5 శాతంగా అమలు కానుంది.

రైతులకు ఆర్‌బీఐ కానుక.. రూ. 1.6 లక్షల వరకు హామీ లేకుండా వ్యవసాయ రుణాలు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ కూడా రైతులకు మరో కానుక అందిస్తోంది. హామీ అవసరం లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 1.60లక్షలకు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. 'ద్రవ్యోల్బణం, పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ. 1.6లక్షల వరకు పెంచుతున్నాం. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది' అని ఆర్బీఐ పేర్కొంది. దీనిపై త్వరలోనే అన్ని బ్యాంకులకు నోటీసు జారీ చేయనుంది. హామీ రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ. లక్ష వరకు పెంచుతూ 2010లో ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది.



ఆర్‌బీఐ సమీక్ష కీలక నిర్ణయాలివే..

- రెపో రేటును 6.5శాతం నుంచి 6.25శాతానికి తగ్గింపు
- రివర్స్ రెపో రేటును 6శాతానికి, బ్యాంకు రేటును 6.5శాతానికి తగ్గింపు
- మార్చి త్రైమాసికంలో ద్రవ్యల్బోణం 2.8శాతంగా ఉండొచ్చని అంచనా
- 2019–20 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ద్రవ్యోల్బణం 3.23.4శాతంగా, ఆ తర్వాత మూడు నెలలు 3.9శాతంగా ఉంటుందని అంచనా
- 2019–20 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.4శాతంగా అంచనా



ఫ్లాట్‌గా దలాల్ స్ట్రీట్

- సెన్సెక్స్ 4పాయింట్ల నష్టం, నిఫ్టీ 7పాయింట్ల లాభం

ముంబయి: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో దేశీయ మార్కెట్లు గురువారం తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. కొనుగోళ్ల అండతో గురువారం ట్రేడింగ్‌ను ఉత్సాహంగానే ప్రారంభించినప్పటికీ.. ఆర్‌బీఐ సమీక్ష ప్రకటన అనంతరం మదుపర్ల లాభాల స్వీకరణ కూడా సూచీలను ఒత్తిడిలోకి నెట్టేసింది. ఫలితంగా ఆరంభ లాభాలను కోల్పోయిన మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. గురువారం ఉదయం సెన్సెక్స్ ఉత్సాహంగా ప్రారంభమైంది. తొలి గంటల్లో 100 పాయింట్లకు పైగా లాభంతో ప్రతిష్ఠాత్మక 37వేల మైలురాయిని దాటింది. అయితే ఆ తర్వాత కీలక వడ్డీరేట్లను తగ్గిస్తూ ఆర్‌బీఐ చేసిన ప్రకటన మార్కెట్లను ఊగిసలాటకు గురిచేసింది. కీలక రంగాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు ఇంట్రాడే గరిష్ఠాలను కోల్పోవాల్సి వచ్చింది. ఒక దశలో నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు చివరకు కాస్త కోలుకున్నాయి. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 4 పాయింట్ల అత్యల్ప నష్టంతో 36,971 వద్ద, నిఫ్టీ 7 పాయింట్ల లాభంతో 11,069 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.71.41గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, సన్‌ఫార్మా, ఐషర్‌మోటార్స్, బజాజ్ ఆటో, గ్రాసిమ్ షేర్లు లాభపడగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, రిలయన్స్, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టపోయాయి.

సామ్‌సంగ్ అమ్మకాల్లో ఇండియాలో 3 స్థానంలో బిగ్ సి



విజయక్రాంతి, హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయరంగ సంస్థ బిగ్ సి సామ్‌సంగ్ అమ్మకాలలో ఇండియాలో 3 స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సౌత్ వెస్ట్ ఏసియా ప్రెసిడెంట్&సీఈవో హెచ్‌సీహాంగ్ బిగ్ సి ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్, సీయండీ యం. బాలు చౌదరిని అభినందించారు. అంతేకాకుండా సామ్‌సంగ్ ప్రవేశపెట్టిన ప్రతి మొబైల్ మోడల్ అమ్మకాలలో గత 16 సంవత్సరాలుగా బిగ్ సి తెలుగు రాష్ట్రాలలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సామ్‌సంగ్ పూర్తి సహకారం కారణంగానే ఈ ఘనత సాధించామని, భవిష్యత్తులో కూడా మరిన్ని లక్ష్యాలు సాధిస్తామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సామ్‌సంగ్ సిబ్బంది, బిగ్ సి డైరెక్టర్ వై. స్వప్న కుమార్, జి. బాలాజీ రెడ్డి, కైలాష్ లఖ్యాని పాల్గొన్నారు.

స్పోర్ట్స

గిల్, పృథ్వీ షాలలో అపారమైన ప్రతిభ ఉంది

- సచిన్ టెండూల్కర్

న్యూఢిల్లీ: భారత యువ క్రికెటర్లు పృథ్వీ షా, శుభ్‌మన్‌గిల్‌లలో అపారమైన ప్రతిభ దాగుందని భారత దిగ్గజ క్రికెటర్ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేర్కొన్నారు. అండర్ 19లో వీరిద్దరూ కలిసి అద్భుతంగా రాణించారని ఆయన ప్రశంసించారు. షా, గిల్‌లు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగ్రేటం చేశారు. న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌లో శుభమన్‌గిల్ రెండు మ్యాచ్‌లలో 9,7 పరుగులతో పేలవ ప్రదర్శన కనబరిచాడు. అలాగే మరో యువ క్రికెటర్ పృథ్వీషా ఆస్ట్రేలియా టూర్ ఎంపికయ్యాడు. కానీ గాయం కారణంగా అతను ఆ సిరీస్‌లో ఆడలేదు. దీంతో ఈ ఇద్దరిపై అభిమానుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో సచిన్ వీరికి బాసటగా నిలిచాడు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ యువ క్రికెటర్లు షా, గిల్‌లు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగ్రేటం చేశారని, వారిని కొద్ది సమయం ఇస్తే పుంజుకుంటారని సచిన్ వారికి బాసటగా నిలిచాడు. షా ఆటతీరును గురించి గతంలోనే నేను మాట్లాడానని, 8–9 ఏళ్ల వయసులో అతని ప్రాక్టీసు చూసి తప్పకుండా భారత జట్టుకు ఆడతాడని నాకు అనిపించిందని సచిన్ గుర్తు చేశారు. శుభ్‌మన్‌గిల్ కూడా అండర్ 19 ప్రపంచకప్‌లో షాతో కలిసి అత్యుత్తమంగా ఆడాడని, వీరిద్దరిలోనూ అపారమైన ప్రతిభ దాగుందని పేర్కొన్నారు. కాకపోతే ఇటీవలే వారు భారత జట్టులోకి అరంగ్రేటం చేసినందున కొద్ది రోజులు ఆటను ఆస్వాదించనివ్వండని సచిన్ సూచించారు.



ఆసీస్ బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్ రాజీనామా

సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టు బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్ రాజీనామా చేశారు. ప్రపంచకప్‌కు మరికొద్ది రోజుల ముందు సంచలన నిర్ణయం తీసుకున్నాడు. దాదాపు మూడు సీజన్ల నుంచి బౌలింగ్ కోచ్‌గా సాకర్ వ్యవహరించారు. ఆసీస్ పేస్ బౌలింగ్‌ను మరింత పటిష్టం చేయడంలో సాకర్ కీలకపాత్ర వహించాడు. సాకర్ మాట్లాడుతూ జట్టును వీడేందుకు ఇదే సరైన సమయం అని భావించి తాను వైదొలుగుతున్నట్లు సాకర్ ప్రకటించారు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు సేవలందించే క్రమంలో చాలా ఎంజాయ్ చేశానని, మేటి బౌలర్లు ఉన్న జట్టుతో కలిసి పనిచేయడం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని సాకర్ తెలిపారు. ఆస్ట్రేలియా జట్టు ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలల నుంచి డేవిడ్ సాకర్‌తో కలిసి పనిచేస్తున్నానని, ఆయన తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు. జట్టు బౌలింగ్‌లో చెరగని ముద్ర వేసిన సాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. ఆసీస్ జట్టు సభ్యులతో కలిసి ఎంజాయ్ చేస్తూ సుధీర్ఘ పయనం చేశాడని లాంగర్ తెలిపారు. వన్డే ప్రపంచకప్‌కు మరికొన్ని నెలల సమయం మాత్రమే ఉన్న తరుణంలో డేవిడ్ సాకర్ ఆకస్మిక నిర్ణయం క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ)ను ఒక్కసారిగా డైలమాలో పడేసింది. అయితే గతంతలో ఇంగ్లాండ్ బౌలింగ్ కోచ్‌గా పని చేసిన అనుభవం ఉన్న ట్రాయ్ కూలీని భారత్, పాకిస్తాన్‌లతో సిరీస్‌లకు ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది. మరి ట్రాయ్ కూలీనే ప్రపంచకప్ వరకూ బౌలింగ్ కోచ్‌గా కొనసాగిస్తుందా లేదా అనే వేచిచూడాల్సిందే.

నిలవాలంటే.. గెలవాలి

- నేడు కివీస్ రెండో టీ20 మ్యాచ్
- జట్టులో మార్పులతో బరిలోకి భారత్
- సీరీస్ కైవసం చేసుకోవాలని చూస్తున్న బ్లాక్‌కాప్స్



ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో తొలి టీ20లో ఘోర పరాభవాన్ని చవిచూసిన టీమిండియా.. నేడు రెండో టీ20 పోరుకు సిద్ధమైంది. న్యూజిలాండ్ గడ్డపై తొలి టీ20 సిరీస్ సాధించాలనే లక్ష్యంతో పోరుకు సమాయత్తమైన భారత్ జట్టుకు శుభారంభం లభించలేదు. తొలి మ్యాచ్‌లో 80 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి పాలై సిరీస్‌లో వెనుకబడింది. ఇది మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కావడంతో టీమిండియా బరిలో ఉండాలంటే కచ్చితంగా రెండో మ్యాచ్‌లో గెలవాల్సిన పరిస్థితి. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరుగనున్న నేటి మ్యాచ్‌లో ఇరు జట్లు గెలుపుపై దృష్టి సారించాయి. ఒకవైపు సిరీస్‌ను ఇక్కడ కొట్టేయాలనే కసితో కివీస్ సిద్ధమవుతుండగా, మ్యాచ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ కోల్పోకూడదనే భారత్ భావిస్తోంది.

మార్పులు తప్పవా?

తొలి టీ20లో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్స్‌తో భారత్ పోరుకు సిద్ధమైనప్పటికీ కనీసం పోరాడటంలో విఫలమైంది. కివీస్ సాధించిన స్కోరును చూసి భయపడ్డారో లేక బ్యాటింగ్ విభాగం బలంగా ఉందని ఎవరికి వారే భావించారో కానీ ఓవరాల్‌గా చేతులెత్తేశారు భారత క్రికెటర్లు. దీనిపై కెప్టెన్ రోహిత్ శర్మ సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు కూడా.





తుది 11మందిలో 8మంది బ్యాట్స్‌మెన్స్ ఉండటాన్ని ప్రధానంగా ప్రస్తావించాడు. ఈ బ్యాటింగ్ లైనప్‌తో కొండంత లక్ష్యాన్ని కూడా సునాయాసంగా ఛేదించవచ్చు అనుకుంటే మొత్తంగా విఫలం కావడంపై రోహిత్ ఆందోళన వ్యక్తం చేశాడు. దాంతో రెండో టీ20కి భారీ మార్పులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖలీల్ అహ్మద్, కృనాల్ పాండ్యాలను తప్పించే అవకాశాలు కనబడుతున్నాయి. వీరి స్థానాల్లో చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, సిద్దార్థ్ కౌల్‌ను టీమిండియా మరొకసారి పరీక్షించనుంది. ఈ ముగ్గురిలో సిద్దార్థ్ కౌల్, కుల్దీప్ యాదవ్‌లు తుది జట్టులో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

టిమ్ సీఫెర్ట్‌ను నిలవరిస్తారా...

కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ ఈ సిరీస్‌కు దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకున్న టిమ్ సీఫెర్ట్.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నాడు. 43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84 పరుగులు చేసి కివీస్ భారీ స్కోరు బాటలు వేశాడు. ఈ తరుణంలో నేటి మ్యాచ్‌కు సీఫెర్ట్‌ను తొందరగా పెవిలియన్‌కు పంపించకపోతే భారత్ మరొకసారి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కాగా, ఈ సిరీస్‌లో మ్యాచ్, మ్యాచ్‌కు మధ్య సమయం తక్కువగా ఉండటంతో కివీస్ బ్యాటింగ్ ఆర్డర్‌పై భారత్ ఎంతవరకూ కసరత్తు చేసిందనేది ప్రధానమైన ప్రశ్న. ఒకవైపు ఒత్తిడిలో భారత్ మ్యాచ్‌కు సిద్ధమవుతుండగా, ఫుల్ జోష్‌తో కివీస్ బరిలోకి దిగుతుంది. మరి టీమిండియా గెలిచి సిరీస్‌పై ఆశలు నిలుపుకుంటుందా.. లేక ముందుగానే కివీస్‌కు సిరీస్‌ను సమర్పించుకుంటుందో చూడాలి.

జట్ల అంచనా..

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, ఎంఎస్ ధోని, హార్దిక్ పాండ్యా, విజయ్ శంకర్, భువనేశ్వర్ కుమార్, చహల్, కుల్దీప్ యాదవ్, సిద్దార్థ్ కౌల్

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్(కెప్టెన్), టిమ్ సీఫెర్ట్, కొలిన్ మున్రో, డార్లీ మిచెల్, రాస్ టేలర్, గ్రాండ్‌హోమ్, సాంట్నర్ స్కాట్ కుగ్లేన్,టిమ్ సౌథీ, ఇష్ సోధీ, ఫెర్గూసన్





విదర్భదే... రంజీ ట్రోఫీ టైటిల్

- వరుసగా రెండోసారి విజేతగా విధర్భ

నాగ్‌పూర్: దేశవాళీ క్రికెట్‌లో భాగంగా ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీనీ వరుసగా రెండోసారీ విదర్భ జట్టు కైవసం చేసుకుంది. నాగ్‌పూర్ వేదికగా గురువారం ముగిసిన ఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్రపై 78 పరుగుల తేడాతో విదర్భ జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ నిర్దేశించిన 206 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో సౌరాష్ట్ర 127 పరుగులకే కుప్పకూలింది. దీంతో టోర్నీ చరిత్రలో మూడోసారి రన్నరప్‌తో సరిపెట్టుకున్న సౌరాష్ట్ర టైటిల్ కల , ఈ ఏడాది కూడా చెదిరిపోయింది. విదర్భ రెండుసార్లు విజేతగా నిలిచిన జట్టుగా రికార్డుల్లోకెక్కింది. ఆదివారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 312 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన సౌరాష్ట్ర జట్టు ఓపెనర్ స్నెల్ పటేల్ (102: 209 బంతుల్లో 15x4) శతకం సాధించడంతో 307 పరుగులు చేసింది, పిచ్‌పై పగుళ్లు ఏర్పడటంతో నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు కష్టమైంది. ఈ క్రమంలో 55 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి సౌరాష్ట్ర కష్టాల్లో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 58/5 వద్ద ఆఖరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సౌరాష్ట్ర మరో 69 పరుగులు మాత్రమే జోడించి స్పిన్నర్ ధర్మేంద్ర సిన్హా జడేజా



(6/96) ధాటికి ఛేదనలో సౌరాష్ట్ర 127 పరుగులకే ఆలౌటైంది. సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్‌లలో విశ్వరాజ్ జడేజా ఒక్కడే హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 52 పరుగులు చేసిన జడేజా సార్వెట్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. సౌరాష్ట్ర స్టార్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర్ పుజారా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 1, 0 పరుగులకే పేలవంగా ఔటవడం ఆ జట్టు విజయావకాశాల్ని దారుణంగా దెబ్బతీసింది. విదర్భ బౌలర్లలో ఆల్‌రౌండర్ ఆదిత్య సర్వత్రే ఆరు వికెట్లు తీసి సౌరాష్ట్ర ఓటమికి ప్రధాన కారణమయ్యాడు. మరో బౌలర్ అక్షయ్ వాఖరే మూడు వికెట్లు తీయగా సీనియర్ బౌలర్ ఉమేశ్ యాదవ్‌కు ఒక్క వికెట్ దక్కింది. ఈ విజయంతో వచ్చే నెలలో జరిగే ఇరానీ ట్రోఫీలో రెస్టాఫ్ ఇండియా టీమ్‌తో విదర్భ తలబడబోతోంది.

సెహ్వాగ్, క్లార్క్ బనానా ఛాలెంజ్

న్యూఢిల్లీ: ఇండియన్ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్‌ల బనానా ఛాలెంజ్ ఇప్పుడు నెట్‌లో హల్‌చల్ సాగిస్తోంది. వీరిద్దరూ కలిసి యూసీకు చెందిన వీషేర్ ఛానల్‌లో బనానా ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బనానా గేమ్ ఆడుతూ ఒకరిపై ఒకరు ఛాలెంజ్ విసురుకున్నారు. ఈ గేమ్ రూల్స్‌లో కళ్లకు గంతలు కట్టుకుని వీరిద్దరూ అరటిపళ్లను వెతికే విధానం ప్రేక్షకులకు నవ్వులు పూయించింది. వీషేర్ ఛానల్ వినియోగదారుల్లో సెహ్వాగ్‌కు మద్దతిచ్చేవారు ఒకవైపు ఉండగా మరొకవైపు క్లార్క్‌కు మద్దతిచ్చేవారు ఉన్నారు. నెటిజన్లు చేస్తున్న కామెంట్లు వైరల్ అవుతున్నాయి.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.